

మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


సంకెళ్ళు లేని లోకంకోసం శ్రీశ్రీ...!

సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలో మనస్థానమెక్కడ?

పాత వీడియోలతో తప్పుడు పోస్టులు

లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 309 | బుధవారం | 30-04-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

# మీకే పూర్తి స్వేచ్ఛ

- భారత సాయుధ బలగాల ఆచరణాత్మక బాధ్యతలపై ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటన
- ఎప్పుడు ఎక్కడ ఏ సమయంలో దాడిచేయాలో నిర్ణయించుకోవచ్చు
- పహల్గామ్ ఘటనపై రక్షణ వ్యవస్థల ఉన్నతస్థాయి సమావేశంలో ప్రధానమంత్రి మోదీ

**న్యూఢిల్లీ :** భారత సాయుధ బలగాలు తమవంతు ఆచరణాత్మక బాధ్యతలు నిర్వహించడానికి పూర్తిస్వేచ్ఛ ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. పహల్గామ్ ఘటనకు ప్రతిస్పందనగా ఏ లక్ష్యాలపైన దాడి చేయాలి? ఎప్పుడు, ఏ సమయంలో దాడి చేయాలి? అనే విషయంపై ఆచరణాత్మక నిర్ణయం తీసుకోవడానికి భారత సాయుధ బలగాలకు పూర్తిస్వేచ్ఛ ఉందన్నారు. ఏ లక్ష్యాలను దెబ్బతీయాలో, ఎక్కడ దాడి చేయాలో,ఎలా దాడి చేయాలో భారత సాయుధ బలగానే నిర్ణయించుకోవాలని స్వేచ్ఛ ఇచ్చారు. రక్షణవ్యవస్థలతో మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన ఈ విషయం ప్రకటించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తోపాటు త్రివిధ దళాల ప్రధానాధిపతులు పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయడానికి ఇది యావత్ జాతి చేసిన తీర్మానమని మోదీ ఉద్ఘాటించారు. భారత సాయుధబలగాల వృత్తిపరమైన శక్తిసామర్థ్యాలపై మోదీ పూర్తిస్థాయి విశ్వాసం వ్యక్తం చేశారు. ''వారు కర్తవ్యనిర్వహణలో మన ప్రతిస్పందన తెలియజేయడానికి ఏ పద్ధతిలో

తరువాయి 2లో





## ఆపరేషన్ కగార్

# నిలిపివేయండి

- కర్రె గుట్టల్లో పోలీస్ క్యాంపులు ఎత్తివేయండి
- తక్షణమే కేంద్రప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలి
- వామపక్ష పార్టీలు డిమాండ్
- 20వేల మంది పోలీస్ బలగాలతో నరమేధం సృష్టించడం దుర్మార్గమని ఆగ్రహం
- న్యాయస్థానాలు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని వెల్లడి

''మావోయిస్టులు అడవులను గానీ, అక్కడ ఉన్న సంపద కానీ స్వాధీనం చేసుకోలేదు. అమాయక ప్రజలైన ఆదివాసీల హక్కులు, వారి రక్షణ కోసం మాత్రమే పోరాడుతున్నారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన కేంద్ర ప్రభుత్వం మాత్రం సహజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతోంది. మావోయిస్టుల పేరుతో అడవుల్లో ఉన్న వారిని కాల్చి చంపుతూ, అర్బన్ నక్సలైట్ల పేరుతో మేధావులైన వరవర రావు, ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వారిని అక్రమంగా జైళ్లలో నిర్బంధించి తీవ్ర మానసిక క్షోభకు గురిచేసి హతమారుస్తున్నారు.''

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆదివాసీ జాతిని హననంచేస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయడంతో పాటు తక్షణమే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో బేషరతుగా శాంతిచర్చలు జరపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. దాదాపు 20 వేల మంది పోలీసు బలగాలతో కర్రెగుట్టను చుట్టుముట్టి నరమేధం సృష్టించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశాయి. వెంటనే కర్రెగుట్టల నుంచి పోలీసు క్యాంప్‌లను ఎత్తివేయాలని కోరాయి. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూల కంటి రంగారెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కె.జి.రాంచందర్, ఎంసిపిఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎ.జానకి రాములు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, ఎస్‌యుసిఐ (సి) నాయకులు సి.హెచ్.మురహరి, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం

తరువాయి 2లో



# మే 10న మిస్ వరల్డ్ పోటీలు

- అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి : సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

'ప్రపంచ సుందరి– 2025' పోటీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మే నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 'ప్రపంచ సుందరి– 2025' ఏర్పాట్లపై అధికారులతో ముఖ్యమంత్రి మంగళవారం హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ నిర్వహణకు

తరువాయి 2లో

కొత్త డిజిపి నియామకంపై సస్పెన్స్ 12

## నేడు పదో తరగతి

# పరీక్ష ఫలితాలు

మధ్యాహ్నం 1 గంటకు రవీంద్ర భారతిలో సిఎం రేవంత్ రెడ్డి విడుదల

ఈసారి మెమోలో గ్రేడ్లతో పాటు మార్కులు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి పరీక్ష ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో విడుదల చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు

తరువాయి 2లో

## కాళేశ్వరంలో

# అన్నీ లోపాలే

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో గుర్తించిన ఎన్‌డిఎస్‌ఎ
- మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్ –7 లోని పిల్లర్లకు పగుళ్లు
- గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం, ఉద్దేశపూర్వక దుర్వినియోగాన్ని ఎన్‌డిఎస్‌ఎ నివేదిక బయటపెట్టింది
- ఏ దేశంలోనైనా మానవతప్పిదం వల్ల రూ.లక్షకోట్ల నష్టం జరిగితే ఊరుకుంటారా?
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం
- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్



అవినీతి జరిగినట్లు నివేదికలో ఎక్కడా లేదు : హరీశ్ 12



ప్రజాపక్షం/హైదరాబాద్

గత బిఆర్‌ఎస్ (గతంలో టిఆర్‌ఎస్) ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలలో పెద్ద ఎత్తున నిర్మాణ లోపాలు ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) గుర్తించిందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్7లోని పిల్లర్లకు పగుళ్లు వచ్చాయని, పైపింగ్ నిర్మాణాల క్షీణత కారణంగా కుంగడంతో పాటు సిమెంట్ కాంక్రీట్ బ్లాక్‌లు దెబ్బతిన్నాయని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా దిగువన ఉన్న కాంక్రీట్ బ్లాక్‌లు కదిలిపోవడం, సీపేజ్ దెబ్బతినడంతో పాటు ఒకేవిధమైన వైఫల్యాలు ఉన్నట్లు నివేదిక వెల్లడించిందని మంత్రి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపైన, బ్యారేజీల నిర్మాణలోపాలకు కారకులైన

తరువాయి 2లో

### కాళేశ్వరం కమిషన్ గడువు మరో నెల పెంపు

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై న్యాయ విచారణ జరుపుతున్న జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పెంచింది. ఈ నెల 30వ తేదీతో కమిషన్ గడువు ముగియనుండడం, కమిషన్ విచారణ ఇకా పూర్తి కాకపోవడంతో మరో నెల గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కమిషన్ ఇప్పటికే పలువు అధికారులు, నిపుణులతో విచారించిన కమిషన్ 90 శాతం మేర నివేదికను ఇప్పటికే పూర్తి చేసింది.అయితే పూర్తి నివేదిక సిద్ధం చేసేందుకు గాను ఎన్‌డిఎస్‌ఎ తుది నివేదిక కొంత అలస్యం కావడం, ఆ నివేదిక ఇటీవలే అందడంతో కమిషన్ తన విచారణను త్వరలోనే పూర్తి చేయనుంది.



# బిజెపిది అధికార కాంక్ష

- సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శ
- 11 ఏళ్లుగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రజాస్వామ్యం : చాడ

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశం విచ్ఛిన్నమైనా పర్వాలేదు కానీ ఎప్పటికీ తామే అధికారంలోకి రావాలనే అధికార కాంక్షతో బిజెపి పనిచేస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. బిజెపికి ఆధికార వాంఛే తప్ప దేశంపై కానీ, ప్రజలపై కానీ ఏలాంటి ప్రేమ లేదన్నారు. తమను ఎవరూ ప్రశ్నించకూడదనే నియతృత్వంతోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చివరికి న్యాయ వ్యవస్థపై సైతం దాడికి తెగబడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం

తరువాయి 2లో



సమస్యలపై స్పందించకుంటే

# సమ్మె తప్పదు

- ఆర్‌టిసి యాజమాన్యం, ప్రభుత్వం చర్చలకు పిలవాలి
- లేనిపక్షంలో మే 7 నుంచి సమ్మెలోకే వెళ్తాం
- టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం



ప్రజాపక్షం/హైదరాబాద్

దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న తెలంగాణ ఆర్ టి సి కార్మికులు, ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వం చర్చలకు పిలిచి పరిష్కరించకుంటే మే 7వ తేదీ నుంచి సమ్మె తప్పదని టిజి ఎస్‌ఆర్‌టిసి జెఎసి రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. ఆర్ టి సి పరిరక్షణ, ప్రభుత్వ హామీలు, ఆర్ టి సి లో సమ్మె అంశాలపై జాతీయ కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం జెఎసి ఛైర్మన్, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అధ్యక్షతన మంగళవారం ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో టి జి ఆర్ టి సి జెఎసి ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకురాలు అనురాధ, ఐఎఫ్‌టియు నాయకులు రమేష్ జెఎసి కోఛైర్మన్ కె.హన్మంతు ముదిరాజ్, వైస్ ఛైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, నేతలు సుద్దాల సురేష్, బి.యాదగిరి, టిఎంయు నాయకులు ఎన్.కమలాకర్, బి.యాదగిరి,

తరువాయి 2లో

టెర్రరిస్టులకు వ్యతిరేకంగా 'స్పైవేర్'

# ఉపయోగిస్తే తప్పేంటి?

- పెగాసస్‌పై పిటీషన్ల విచారణ సందర్భంగా 'సుప్రీం' కీలక వ్యాఖ్యలు
- దేశ భద్రత, సార్వభౌమత్వం సంబంధిత ఏ నివేదిక బహిర్గతం చేయబడదని స్పష్టీకరణ
- జులై 30కి విచారణ వాయిదా




**న్యూఢిల్లీ :** నాలుగు సంవత్సరాల క్రితం దేశ రాజకీయాలను కుదిపేసిన పెగాసస్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా 'స్పైవేర్‌ను'

తరువాయి 12లో

## కెనడా ఎన్నికల్లో లిబరల్ పార్టీ

# చారిత్రక విజయం

- వరుసగా నాలుగోసారి అధికారంలోకి
- అంబరాన్నంటిన సంబరాలు
- అమెరికా మమ్మల్ని విచ్ఛిన్నం చేయలేదు : కార్నీ

**ఒట్టావా :** ఓటమి అంచున ఉన్న లిబరల్ పార్టీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పుణ్యమా అని పార్లమెంటు ఎన్నికల్లో జయకేతనం ఎగురవేసింది. దీంతో 2015 నుండి వరుసగా దేశంలో నాలుగోసారి ఈ పార్టీ అధికారాన్ని నిలబెట్టుకుంది. దీంతో కెనడాలో లిబరల్ పార్టీ సంబురాలు అంబరాన్ని అంటాయి. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత గానీ కార్నీకి ఎన్ని మెజారిటీస్థానాలు వచ్చాయన్న విషయం వెల్లడికాదు. ఒకవేళ మెజారిటీ రాకపోతే ఇతరపార్టీల మద్దతు తీసుకోవాల్సి ఉంటుంది. దిగువసభ హౌస్ ఆఫ్ కామన్స్‌లో 343 స్థానాలు ఉండగా, 172 స్థానాలు గెలుచుకున్నపార్టీకే అధికారం లభిస్తుంది. 168 స్థానాల్లో లిబరల్‌పార్టీ అభ్యర్థులు ఓట్ల లెక్కింపులో ప్రత్యర్థులకు అంతనంతదూరంలో దూసుకుపోతున్నారు. కడపటి వార్తలు అందేసరికి అతిపెద్దపార్టీగా అవతరించిన లిబరల్‌పార్టీ మెజారిటీకి నాలుగు స్థానాలు వెనుకబడి ఉంది. పూర్తిఫలితాలు ఇంకా వెలువడలేదు. లిబరల్‌పార్టీకి విజయం చేకూర్చడం ద్వారా, అమెరికాలో 51వ రాష్ట్రంలో కెనడా చేరిపోవాలన్న ట్రంప్ దురాక్రమణ హెచ్చరికలకు, సుంకాల బెదిరింపులకు కెనడా ప్రజలు చెక్ పెట్టారు. ప్రతిపక్ష నాయకుడు పియర్రీ పోయిలిబ్రే గెలుస్తాడని చాలా మంది అంచనావేశారు. ఆయనే కొత్త ప్రధానమంత్రి అని విశ్వసించారు. కానీ ఆయన తన సొంత నియోజకవర్గంలోనే విజయం సాధించలేకపోయారు. పియర్రీ



తరువాయి 12లో



## తదుపరి సిజెఐగా గవాయ్‌ను నియమిస్తూ నోటిఫికేషన్ 06

# విద్యుత్ ఛార్జీలు పెరగవ్

- ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఛార్జీలే కొనసాగింపు
- తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ప్రకటన
- వార్షిక టారీఫ్ ఉత్తర్వులు జారీచేసిన ఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ ప్రకటన

ప్రజాపక్షం / హైదరాబాద్



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26లో రాష్ట్రంలో విద్యుత్ చార్జీలే కొనసాగుతాయని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సి) ప్రకటించింది. ఈ మేరకు ఇఆర్‌సి వార్షిక విద్యుత్ టారీఫ్ ఉత్తర్వులు 2025–26లను కమిషన్ ప్రకటించింది. ఉత్తర్వులు మే 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిసింది. దక్షిణ, ఉత్తర తెలంగాణ విద్యుత్

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

# ఈ ట్రంప్ మాకొద్దురా బాబూ..!

## వంద రోజుల పాలనలో విచిత్ర విన్యాసాలు
### 80 ఏళ్ళ చరిత్రలో లేనంత అతి కనిష్టస్థాయి రేటింగ్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ రెండోసారి పదవీకాలంలో మంగళవారం (ఏప్రిల్ 29వ తేదీ) నాటికి మొదటి 100 రోజుల పరిపాలన పూర్తిచేసుకున్నారు. గడచిన 80 ఏళ్ళ అమెరికా చరిత్రలో ఏ అధ్యక్షుడికీ ఎన్నడూలేనిస్థాయిలో వివిధ సర్వేలలో ట్రంప్ రేటింగ్ అత్యంత కనిష్ఠస్థాయికి క్షీణించింది. రోలర్ కోస్టర్ ఆర్థిక విధానాలు, నిలకడలేని యూ టర్న్ ఆలోచనలు వంటి విచిత్రమైన విన్యాసాలు ప్రజలకు విసుగుతెప్పించాయి ఆయన చేపట్టిన ప్రధానమైన విధానాలను మెజారిటీ అమెరికన్లు తిరస్కరించారు. ఈ విధానాలు ఆర్థిక సంక్షోభానికి దారితీస్తాయని వారు భావిస్తున్నారు.ట్రంప్ పాలన మధ్యప్రాచ్యాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టిందని లెబనాన్ లోని సిల్క్‌రోడ్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్టడీస్ అండ్ రీసెర్చ్ అధ్యక్షుడు వారెఫ్ కుమైహ్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చి పాలస్తినాలో విస్తరణవాదాన్ని ప్రోత్సహించడంవల్ల మానవ సంక్షోభం మరింత పెరగుతుందన్నారు. ఇరాన్‌పై ఆంక్షలు, చర్చలపేరుతో బెదిరింపులవల్ల మరింతగా ఉద్రిక్తతలు పెరుగుతాయన్నారు. కాగా, వందరోజుల పాలనపై అమెరికాలో 59 శాతం ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారు. 64 శాతంమంది టారిఫ్‌లకు వ్యతిరేకంగా ఉన్నారు. 71 శాతం ప్రజలు ఈ టారిఫ్‌లవల్ల ద్రవ్యోల్బణం, సంక్షోభం చుట్టుముడుతుందని భావిస్తున్నారు. 60 శాతం ప్రజలు విదేశాంగ విధానాలపట్ల వ్యతిరేకతతో ఉన్నారు. ట్రంప్ యంత్రాంగం చట్టాలను పాటించడంలేదని 62 శాతం మంది భావిస్తున్నారు. ట్రంప్ ఉన్నతస్థానాలలో చేసిన నియామకాలు, ఆయన ఎంపికలు సరిగ్గా లేవని 59 శాతంమంది విశ్వసిస్తున్నారు. ట్రంప్ అనుసరిస్తున్న సుంకాల విధానాలవల్ల కరోనా మహమ్మారి కాలంలో వచ్చిన ఆర్థిక సంక్షోభాన్ని మించినస్థాయిలో ఆర్థిక సమస్యలు తలెత్తవచ్చునని ఐఎంఎఫ్ నిపుణులు అంచనావేస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధి 2.8 శాతంగా మాత్రమే ఉండవచ్చునని కూడా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అంచనావేస్తున్నది. వివిధ సంస్థలు, చానళ్ళు నిర్వహించిన రేటింగ్ నిర్ధారణ సర్వేలలో ట్రంప్‌పట్ల ఉన్న విశ్వాసం క్షీణస్థాయికి చేరుకున్నారని తేటతెల్లమైంది.

ఎన్నికల తుదిఘట్టం సమయంలో, ప్రమాణస్వీకారం సమయంలో ప్రజలకున్న విశ్వాసం ఈనాడు లేదని రేటింగ్ సంస్థలు ప్రకటించాయి. ముఖ్యంగా ట్రంప్ వలస విధానాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ట్రంప్ బాగా పనిచేస్తున్నారని 22 శాతం ప్రజలు మాత్రమే భావిస్తున్నారు. ఫిబ్రవరినెలలో ఉన్న రేటింగ్ కంటే ఏడూశాతం మేరకు ట్రంప్ రేటింగ్ క్షీణించింది. ధరల పెరుగుదల, ప్రధానంగా అమెరికా స్టాక్ మార్కెట్ల పతనం వంటి ప్రతికూల పరిస్థితులవల్ల మధ్యతరగతి వరాల్లలో ట్రంప్‌కు ఉన్న పరపతి, మద్దతు 31 శాతానికి పడిపోయింది. ట్రంప్ అనుసరిస్తున్న వలస విధానాన్ని ఆయన నియమించిన బోర్డర్ జార్ సమర్థిస్తుండగా స్వంత దేశీయులే వ్యతిరేకిస్తున్నారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికా వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో రెండు విడతలుగా లక్షలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు జరిపారు. ఐనాగానీ ట్రంప్‌లో చలనం లేదుకడా, ఇక మూడోసారి కూడా తాను అధికారంలోకి వస్తాననీ, అందుకు తగిన మార్గాలున్నాయనీ చట్టవిరుద్ధమైన ప్రకటనలు చేస్తూ ఆయన అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నారు.

# కెనడాలో శవమై కనిపించిన భారత విద్యార్థిని



**ఒట్టావా :** కెనడాలో మూడు రోజులుగా జాడ తెలియకుండా పోయిన భారతీయ విద్యార్థిని వన్షిక మంగళవారంనాడు శవమై కనిపించాడు. దేశ రాజధాని నగరం ఒట్టావాలో భారతీయ విద్యార్థి మృతదేహం మంగళవారంనాడు లభ్యమైంది. భారత విద్యార్థి వన్షికా మరణించాడన కెనడాలోని భారత హై కమిషన్ కార్యాలయం ఎక్స్ వేదికగా ధృవీకరించింది. ''భారతీయ విద్యార్థిని వన్షిక మరణించిందని చెప్పడానికి చింతిస్తున్నాం, ఈ కేసును సంబంధిత అధికారులు దర్యాప్తు చేస్తున్నారు, ఇదెంతో విషాదకరమైన ఘటన'' అని హైకమిషన్ పేర్కొంది. ఒట్టావాలోని సెవెన్ మెజెస్టిక్ డ్రైవ్ లోని తన నివాసం నుండి గడచిన శుక్రవారం రాత్రి వన్షిక అదృశ్యమైంది. భారత హైకమిషన్‌తో సన్నిహిత సంబంధాలుగల భారత్‌-కెనడా అసోసియేషన్ ఈ విషయం చెప్పింది. శుక్రవారం రాత్రి 11.40 గంటల సమయంలో ఆమె మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. శనివారం ఉదయం ఆమె అతిముఖ్యమైన ఒక పరీక్షకు హాజరుకావాల్సి ఉంది.కానీ ఆలోచనా విధానానికీ, ఆమె ప్రస్తుత నడవడికకు ఎలాంటి సంబంధం లేదనీ, ఆమెకు ఆత్మహత్య చేసుకునే మనస్తత్వం కాదనీ, ఈ విషయంలో ఎక్కడో తప్పు జరిగిందని కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒట్టావాలో ఉన్న హిందూ మతస్థులు ఈ ఘటనపట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వారు అభద్రతాభావంలో ఉన్నారనీ స్థానిక అసోసియేషన్ హైకమిషన్‌కు ఒక లేఖ రాసింది.

# చైనా రెస్టారెంట్‌లో మంటలు
## 22 మంది సజీవదహనం

**బీజింగ్ :** చైనా లియోనింగ్ నగరంలోని ఒక రెస్టారెంట్‌లో మంగళవారంనాడు మంటలు చెలరేగడంతో 22 మంది మరణించారు.రాజధాని బీజింగ్‌కు 580 కి.మీ దూరంలో ఈ నగరం ఉంది. అర్థరాత్రివేళ ఈ మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు గాయపడ్డారు. ఐతే ఈ అగ్ని ప్రమాదం ఎందుకు జరిగిందన్న విషయం మాత్రం బయటకు వెల్లడించలేదు. గాయపడినవారికి పూర్తి సహాయం చేయాలని, వారికి మంచి వైద్య సేవలు అందించాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ కోరారు. ఈనెలలో చైనాలో జరిగిన రెండవ అతిపెద్ద ప్రమాదం ఇదే. ఇంతకుముందు ఈనెలలోనే ఏప్రిల్ తొమ్మిదో తేదీన చైనా హెబెయి రాష్ట్రంలో ఉన్న ఒక నర్సింగ్ హోమ్‌లో అగ్ని ప్రమాదం చెలరేగడంతో 20 మంది వృద్ధులు సజీవదహనమయ్యారు. ఝూంగ్‌జియాకు నగరంలోని కూరగాయల మార్కెట్‌లో మంటలు చెలరేగి ఎనిమిది మంది మరణించారు.

# స్పెయిన్,పోర్చుగల్‌లో విద్యుత్ సంక్షోభం

**మాడ్రిడ్ :** స్పెయిన్, పోర్చుగల్ దేశాలలో విద్యుత్ సంక్షోభం నెలకుంది. ఈ రెండు దేశాలకూ ఫ్రాన్స్ ద్వారా విద్యుత్ అనుసంధానం ఉంది. సోమవారంనాడు ఈ రెండు దేశాలలో పూర్తిగా విద్యుత్ సదుపాయానికి తీవ్ర అంతరాయం కలగడంతో రైళ్ళు ఆగిపోయాయి. ఎటిఎంలు స్తంభించాయి. కార్యాలయాలు, ఇతర కీలక మౌలిక సదుపాయాల పనులన్నీ స్తంభించిపోయాయి. ముఖ్యంగా స్పెయిన్‌దేశంలో ఏ జరగకుండా కార్యకలాపాలన్నీ ఆగిపోయాయి. చివరకు మంగళవారంనాడు ఉదయం ఏడు గంటలనాటికి ఈ విద్యుత్ సంక్షోభ సమస్య పరిష్కారమైంది. పూర్తిగా రెండు దేశాలలో విద్యుత్ సరఫరాలను 99 శాతం మేరకు పునరుద్ధరించారు. ఈ రెండు దేశాలలో ఇప్పుడు జనజీవన సాధారణస్థితికి చేరుకుంది. ప్రభుత్వ రవాణాను పునరుద్ధరించారు. ఐతే ఈ విద్యుత్ సంక్షోభం వాటిల్లడానికి గల ప్రధాన కారణం మిస్టరీగా మారింది. ఇప్పటివరకూ స్పెయిన్‌లో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ రాలేదు.

# ఆర్.ఎస్.నగర్ అగ్ని బాధితుల సహాయనిధి

**విజ్ఞప్తి**

రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని రావినారాయణ రెడ్డి కాలనీ, ఫేస్‌- 3లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు 400 గుడిసెలు తగలబడటం జరిగింది. ఈ గుడిసెలలో బడుగు బలహీనవర్గాల ప్రజలు గుడిసెలు వేసుకొని బ్రతుకుతున్నారు. ఈ అగ్ని ప్రమాదం వలన వారి నిత్యావసర వస్తువులు, దాచుకున్న డబ్బులు, బట్టలు, పిల్లల విద్యా సర్టిఫికేట్స్ అన్ని కాలీ బూడదైనాయి. వారందరూ దిక్కుతోచని స్థితిలో నిరాశ్రయులై వున్నారు. వీరికి మానవతాదృకృథంతో వస్తురూపంలోనైన, డబ్బు రూపంలోనైన సహకారం అందించాలని విజ్ఞప్తి. దాతల వివరాలు ఎప్పటికప్పుడు ప్రచురించబడును.

**29-04-2025 నాటికి సహాయం అందించిన దాతల వివరాలు...**

1. దామోదర్ రెడ్డి — రూ.10,000 (మేడ్చల్ జిల్లా, ఉప్పల్ నియోజకవర్గ సిపిఐ తరపున..)
2. ఎండి జిల్లాలుద్దీన్ — రూ.10,000 (సంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి)
3. దండి సురేష్ — రూ.10,000 (ఖమ్మం జిల్లా సిపిఐ తరపున...)
4. బొమ్మగాని ప్రభాకర్ — రూ.1000

ఫోన్‌పే: 9866996737, (రవీంద్రాచారి, భాగ్యమ్మ)

– ఆందోజు రవీంద్రాచారి,
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

# హసీనాను అరెస్టు చేశారా?లేదా?
## మే 12 నాటికి చెప్పాలని బంగ్లాకోర్టు ఆదేశం



**ఢాకా:** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా, ఆమె కుమారుడు సజీవ్ వాజెడ్ జోయ్, మరో 16 మంది నిందితులను అరెస్టు చేసే విషయంలో దర్యాప్తు ఎంత వరకూ వచ్చిందో ప్రయత్నాల పురోగతి నివేదిక మే 12వ తేదీనాటికి తమకు సమర్పించాలని ఆ దేశ న్యాయస్థానం ఆదేశించింది. బంగ్లాదేశ్‌లోని 12 పోలీస్ స్టేషన్లకు కోర్టు ద్వారా ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ఢాకా మెట్రోపాలిటన్ సీనియర్ స్పెషల్ జడ్జస్ కోర్టుకు చెందిన న్యాయమూర్తి మహ్మద్ జాకీర్ హుస్సేన్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్వాచల్ న్యూ టౌన్ ప్రాజెక్టులో ప్లాట్ల కేటాయింపునకు సంబంధించిఅక్రమాలకు పాల్పడ్డారని వీరిపై ఆరోపణలు వచ్చాయి. దీనికంటే ముందు దాఖలైన మూడు కేసులకు సంబంధించి షేక్ హసీనాపై ఇదే న్యాయస్థానం ఏప్రిల్ 15వ తేదీన అరెస్టు వారెంటు జారీ చేసింది.

# నైజీరియాలో పేలుడు 26 మంది మృతి

**అబూజా :** పశ్చిమ ఆఫ్రికాదేశం నైజీరియాలో రోడ్డుపక్కనే బాంబు పేలడంతో 26 మంది మరణించారు. వీరిలో స్త్రీలు, పురుషులు, పిల్లలు ఉన్నారు. కామెరూన్ సరిహద్దుల్లో వెళుతున్న ఒక లారీ నాటుబాంబు బారిన పడటంతో పేలుడులో అందులో ప్రయాణిస్తున్నవారు మరణించారు. ఈ ప్రాంతంలో సాయుధ గ్రూపులమధ్య అనేక దశాబ్దాలుగా అంతర్యుద్ధం కొనసాగుతున్నది. ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ (ఇస్వాప్), బోకోహార్మ్ మధ్య ఇటీవలికాలంలో తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ మృతుల్లో ఆరుగురు పిల్లలు, నలుగురు మహిళలు ఉన్నారు.



ఇటీవలికాలంలో రోడ్లమీదనే రెండు వర్గాలు పేలుడు పదార్థాలు ఉంచి ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నాయని అంతర్జాతీయ సహాయ సంస్థలు పేర్కొన్నాయి.

# పరీక్ష ఫలితాలు
(మొదటి పేజీ తరువాయి)

పదో తరగతి పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు సుమారు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ మేరకు ఇప్పటికే జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ పూర్తి కావడం, నూతన విధానంలో మార్కుల మెమోల జారీపై స్పష్టత రావడంతో ఫలితాల విడుదలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**మార్కుల మెమోలో మార్పులు**

ఈ సంవత్సరం నుంచి పదో తరగతి మా ర్కుల మెమోల విధానంలో ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన మార్పులు చేసింది. గతంలో కేవలం సబ్జెక్టుల వారీగా గ్రేడ్లు, సిజిపిఎ మాత్రమే ఇచ్చేవారు. అయితే, ఇక నుంచి విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్ మార్కులను విడివిడిగా చూపించడంతో పాటు, మొత్తం మార్కులు, గ్రేడ్లను కూడా మెమోలో పొందుపరచనున్నారు. అలాగే, విద్యా ర్థి ఉత్తీర్ణత (పాస్/ఫెయిల్) వివరాలను కూడా స్పష్టంగా పేర్కొంటారు. బో ధనేతర కార్యక్రమాల్లో (కోకరిక్యులర్ యాక్టివిటీస్) విద్యార్థుల ప్రతిభకు కూడా గ్రేడ్లు ఇవ్వనున్నారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ వంటి నాలుగు విభాగాలకు సంబంధించిన గ్రేడ్లను కూడా మార్కుల మెమోలో ముద్రించనున్నట్లు అధికారులు తెలిపారు.

# పూర్తి స్వేచ్ఛ
(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరించాలి, ఏ లక్ష్యాన్ని దెబ్బతీయాలి, ఏ సమయంలో స్పందించాలి అనే విషయాలు నిర్ణయించుకునే ఆచరణాత్మక స్వేచ్ఛ మీదే'' అని చెప్పారని ప్రధానిని ఉటంకిస్తూ వర్గాలు తెలియజేశాయి. రక్షణ సిబ్బంది ప్రధాన జనరల్ అనిల్ చౌహాన్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈనెల 22 తేదీన పహల్గామ్‌లో 22 మంది అమాయకులైన పౌరులను కాల్చి చంపిన ఘటన తర్వాత ప్రతిచర్యలు తీసుకోవడంపై చర్చించేందుకు ఈ సమావేశం నిర్వహించారు. ఉగ్రవాదులు చేసిన దాడి వెనక సూత్రధారులు ఎవరున్నారు? వారిని పోషించేవారు ఎవ్వరో వారిని వెంటాడేందుకు మోదీ ప్రతిజ్ఞ చేశారు. భారత్‌పై చారిత్రకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ దాడులు చేయడానికి అండగా నిలబడుతున్న పాకిస్థాన్‌ను ఆయన స్పష్టంగా ప్రస్తావించారు. భూమ్మీద ఉగ్రవాదులకు స్థానం లేకుండా అంచులవరకూ తరిమి కొడతామని ఇప్పటికే ప్రధానమంత్రి ప్రతిజ్ఞ చేశారు. దేశవ్యాప్తంగా పహల్గామ్‌కు విహారయాత్రకు వెళ్ళిన పర్యాటకులపై పాశవికదాడి చేసి సామాన్య ప్రజలను ఉగ్రవాదులు హతమార్చిడాన్ని ప్రధానమంత్రి తీవ్రంగా పరిణించారు. ఉగ్రవాద దాడులకు పాల్పనవారు, వారి సూత్రధారులపై ప్రతీకార చర్యలు తీసుకోవాలని యావత్ దేశం కోరుతున్నది. ఇంతకుముందు కూడా మోదీ ప్రభుత్వ హయాంలో భారత వైమానికదళం పాకిస్థాన్ భూభాగంలోకి ప్రవేశించి సర్జికల్ దాడులు చేసింది. 2016లో యూరీలో, పుల్వామాలో సిఆర్‌పిఎఫ్ జవాన్లను దాడిచేసి ఉగ్రవాదులు చంపినప్పుడు పాకిస్థాన్‌లోని బాల్‌కోట్‌పై భారతసైన్యం దాడులు చేసింది. ఇప్పుడు పహల్గామ్‌లో దాడుల తర్వాత కూడా భారత సైన్యం వరుసగా అనేక చర్యలు తీసుకుంది. సింధుజలాలల ఒప్పందాన్ని రద్దుచేసింది.ఐతే మోదీతో రక్షణ వ్యవస్థల ఉన్నతస్థాయీ సమావేశం జరగడానికి ముందుగా హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన ఉన్నతస్థాయీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మూడు విభాగాలకు చెందిన పారామిలిటరీ దళాలకు చెందిన సీనియర్ అధికారులు, మరో రెండు భద్రతా సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఐతే ఈ సమావేశంలో ఏం చర్చించారన్న ఎజెండా బయటకు రాలేదు.

# మిస్ వరల్డ్ పోటీలు
(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను సమావేశంలో అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసే అతిథుల కోసం ఎయిర్ పోర్టు, వారు బస చేసే హోటళ్లు, కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలకు సంబంధించి వివిధ విభాగాల వారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సిఎం సూచించారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, మిస్ వరల్డ్2025 ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, పూర్తి చేయాల్సిన పనులు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# సమ్మె తప్పదు
(మొదటి పేజీ తరువాయి)

టిజెఎంయు నాయకులు డివికె.రావు, వి.బాబు, ఎండి. రహీముద్దీన్, బి.శ్రీనివాస్, ఎం.వేంకటేష్‌గౌడ్, కె.రాం రెడ్డి, స్వాములయ్య తదితరులు ప్రసంగించారు. సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.నరసింహా మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేస్తే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని అన్నారు. సమ్మె జరగవద్దని తాము కోరుకుంటున్నామని, సమ్మెపై జెఎసి జనవరి 27న ఇచ్చిన నోటీసుపై యాజమాన్యం నుంచిగాని, ప్రభుత్వం నుంచిగాని ఇంత వరకు ఎలాంటి స్పందన లేకపోవడం వల్లనే సమ్మె అనివార్యంగా భావిస్తున్నామన్నారు. సమ్మె నోటీసుపై జెఎసితో చర్చలు జరపకుండా కార్మికులను రెచ్చగొడుతున్నారని అందుకు యాజమాన్యం, ప్రభుత్వమే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అన్నారు. సమస్య జఠిలంగా ఉందని అయినా చర్చించే నాథుడే లేకుండా పోయారన్నారు. సంస్థలో కార్మికులు, ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉందని, యాజమాన్యం కార్మికులను చిత్రహింసలకు గురి చేస్తుందని, నిబంధనల ప్రకారం ఎనిమది గంటల పనిదినాలను పాటించకుండా 16 గంటలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఏడాదికి 150 మంది కార్మికు లు అనారోగ్యాలకు గురవుతున్నారని స్పష్టం చేశారు. సమ్మె నోటీసు ఇచ్చిన తరువాత సిపిఐ ఎంఎల్‌ఎ కూనమనేని సాంబశివరావుతో సిఎంతో పాటు మంత్రుల దృష్టికి త మ సమస్యలను తీసుకెళ్లామని అయితే ఇంత వరకు అక్క డి నుంచి ఎలాంటి స్పందన ఇంత వరకు రాలేదన్నారు. తమ చివరి అస్త్రంగా సమ్మెకు దిగాల్సిన గత్యంతరం ఏర్పడిందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ఇపు డు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసిపై నియంత్రుత్వ దోరణి ప్రదర్శిస్తుందన్నారు.పదేళ్లలో 16 వేల మంది పదవీవిరమణ చేసినా ఉద్యోగాల భర్తీ చేయలేదన్నారు. 1200 బస్సులను కూడా తగ్గించారన్నారు. వీటి స్థానంలో ప్రైయివేటు ఎలక్ట్రికల్ బస్సులను తీసుకువచ్చారని అన్నారు.ఆర్‌టిసి సంస్థనే ఎలక్ట్రికల్ బస్సులను కొనేవిధంగా సబ్సిడి అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.బిఆర్‌ఎస్ ప్ర భుత్వంలో పోలీసుల లాఠీదెబ్బలు తిన్నా,రక్తంఏరులై పారినా 53 రోజులు సమ్మెచేశారని, ఈ సమ్మె కాలంలో 34 మంది కార్మికులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సంకల్పంతో ఈ సారి కూడా సమ్మెకు దిగుతున్న ట్లు ప్రభుత్వానికి హెచ్చరించారు. ఆర్‌టిసిలో ప్రైయివేటు బస్సులను ప్రోత్సహిస్తూ పథకం ప్రకారం ఆర్‌టిసిని ప్రై వేటు పరం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి గత ప్రభుత్వం గెజిట్ జారీ చేసి రెండు సంవత్సరాలు కావస్తున్నా అపాయింటెడ్ డేట్ ప్రకటించటానికి ఎందుకు జాప్యం జరుగుతుందో కాంగ్రెస్ ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ట్రేడ్ యూనియన్ల పునరుద్దరణ విషయంలో కూడా ఆర్‌టిసి యాజమాన్యం ఇస్తున్న తప్పుడు నివేదికల ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం కార్మికులకు ఇచ్చిన హామిని నిలబెట్టుకోవడంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ తన ఎన్నికల మెనిఫెస్టోలో ఆర్‌టిసి కార్మికులకు చేసిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

# అధికార కాంక్ష
(మొదటి పేజీ తరువాయి)

మగ్ధూంభవన్‌లో జరిగాయి. సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలను ఉద్దేశించి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ప్రసంగించారు. సమావేశంలో డాక్టర్ నారాయణ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పరిణామాలను వివరించారు. దేశం విచ్ఛిన్నమైనా పర్వాలేదు కానీ తామే అధికారంలోకి రావాలనే ఆకాంక్షతో బిజెపి పనిచేస్తోందన్నారు. చివరికి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఉపరాష్ట్రపతి సైతం సుప్రీం కోర్టుకు వ్యతిరేకంగా వాఖ్యానించడం ఇందులో భాగమేనన్నారు. దేశం ఒక్కటిగా ఉండాలంటే అన్ని మతాలు, వర్గాల ప్రజలకు సమాన హక్కులు ఉండే విధంగా రాజ్యాంగ రూపకల్పన జరిగిందన్నారు. నేడు రాజ్యాంగాన్నే నిర్వీర్యం చేసేందుకు బిజెపి కుట్రలు పన్నుతోందని నారాయణ విమర్శించారు. మహాత్మాగాంధీని చంపిన గాడ్సేకు గుడులు కట్టే రోజులు కూడా దగ్గరలోనే ఉన్నాయన్నారు.చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ అధికారం చేపట్టిన 11 ఏళ్ల కాలంగా ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. బిజెపి ప్రభుత్వం ఏకఛత్రాధిపత్యాన్ని చెలాయించాలనే దుర్బుద్ధితో రాజ్యాంగ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజ్యాంగాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తూ కగార్ ఆపరేషన్ పేరుతో సమయం నిర్ధేశించి మరీ మావోయిస్టులను భౌతికంగా నిర్మూలిస్తోందన్నారు. దేశంలో వామపక్ష శక్తులు బలహీనపడడంతో మతోన్మాద బిజెపి చెలరెగిపోతోందని, దీనిని కట్టడి చేయడానికి కమ్యూనిస్టులు మరింతగా బలోపేతం కావాల్సిన అవసరముందన్నారు. సిపిఐని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు సంసిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# నిలిపివేయండి
(మొదటి పేజీ తరువాయి)

పరాయి దేశంపై యుద్ధం చేస్తున్నట్లు దేశ పౌరులైన మావోయిస్టులను తుదముట్టిస్తామని ప్రతిజ్ఞ చేసి మరీ అత్యంత కిరాతకంగా వేటాడి వెంటాడి చంపడం దుర్మార్గమన్నారు. దీనిని న్యాయ స్థానాలు సుమోటాగా స్వీకరించి న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. మావోయిస్టుల అడవులను గానీ, అక్కడ ఉన్న సంపద కానీ స్వాధీనం చేసుకోలేదని, అమాయక ప్రజలైన ఆదివాసీల హక్కులు, వారి రక్షణ కోసం మాత్రమే పోరాడుతున్నారన్నారు. కానీ అదే రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన కేంద్ర ప్రభుత్వం ఆ సహజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడంలో భాగంగా వారిని తుదముట్టిస్తుండడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. మావోయిస్టుల పేరుతో అడువుల్లో వారిని కాల్చి చంపుతూ, అర్బన్ నక్సలైట్ల పేరుతో మేధావులైన వరవరరావు, ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వారిని అక్రమంగా జైళ్లలో నిర్బంధించి తీవ్ర మానసిక క్షోభకు గురిచేసి చంపుతున్నారన్నారు. మావోయిస్టులు తప్పు చేస్తే రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన చట్టాల ద్వారా శిక్షించాలి కానీ ప్రజాస్వామ్యంలో ఒకరిని చంపే అధికారం ఎవరికీ లేదన్నారు. గోద్రా అల్లరి కేసుల్లో గుజరాత్ రాష్ట్రం నుంచి బహిష్కరణకు గురైన అమిత్‌షా అనే వ్యక్తి దేశ హోంశాఖ మంత్రిగా ఉండడం ఈ దేశ ప్రజల దురదృష్టమన్నారు. తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి ధైర్యమంటే కగార్ ఆపరేషన్ జమ్మూకశ్మీర్‌లో చేపట్టి ఉగ్రమూకలను అంతమొందించాలని, అప్పుడు ప్రజలందరూ హర్షిస్తారన్నారు. మావోయిస్టులతో చర్చలు జరిపే విధంగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాయాలని కోరారు. వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ ఆదివాసీల నరమేధం కొనసాగించడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. సాధారణంగా ప్రభుత్వాలే శాంతి చర్చలకు ఆహ్వానిస్తుంటాయని, కానీ దేశంలో మావోయిస్టులే స్వయంగా చర్చలను ప్రతిపాదించినా కేంద్రం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. గాదగోని రవి మాట్లాడుతూ మావోయిస్టులు ఆయుధాలను వీడితేనే చర్చలంటూ చత్తీస్‌గఢ్ ప్రభుత్వం పేర్కొనడం సరైంది కాదని, కారణాలు లేకుండా ఎవరూ ఆయుధాలను పట్టరన్నారు. చర్చల సమయంలో ఆయుధాలు ఎందుకు పట్టాల్సివచ్చిందో అడిగే అవకాశం ఉందని, ముందుగా చర్చలకు తగిన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. సిహెచ్.మురహరి మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అడవిలో ఖనిజ సంపదను దోచిపెట్టేందుకే చేపట్టిన కగార్ ఆపరేషన్‌ను తక్షణమే ఉపసంహారించుకోవాలన్నారు. రమేశ్ రాజా మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రజల జీవించే హక్కులను హరిస్తుందని, కగార్ ఆపరేషన్ పేరుతో ఇప్పటికే 500 మందికి పైగా ఆదివాసీలను, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లతో కాల్చి చంపారన్నారు. ప్రసాద్ మాట్లాడుతూ, ఆదివాసీలు రక్షణ కోసమని పార్లమెంట్‌లో చట్టాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం బయట మాత్రం అందుకు విరుద్ధంగా వాటిని తుంగలో తొక్కి వారికి దక్కాల్సిన సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు నరమేధాన్ని కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జానకి రాములు మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ నాయకులు తాము చర్చలకు సిద్ధమంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసినప్పటికీ పాలకులు స్పందించకపోగా, నిరంకుశంగా వారిని అంతమొందించేందుకు చర్యలు చేపట్టడం అన్యాయమన్నారు.

**వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మే 2న సదస్సు**

కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేసి మావోయిస్టులతో భేషరతుగా చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సదస్సును మే 2వ తేదీన హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ సదస్సులో వామపక్ష పార్టీల నాయకులతో పాటు వివిధ వర్గాల మేధావులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. సదస్సులో అన్ని పార్టీలు, వర్గాల అభిప్రాయాల మేరకు కగార్ ఆపరేషన్‌పై చర్చించి కేంద్రం శాంతి చర్చలు చేపట్టేలా ఒత్తిడి తెచ్చేందుకుగాను కార్యాచరణను రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు.

# అన్నీ లోపాలే
(మొదటి పేజీ తరువాయి)

అధికారులపైన, వారికి ఆదేశాలు జారీ చేసిన వారిపైన చట్ట పరంగా చర్యలు తీసుకునే విషయమై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ఇటీవల 'ఎన్‌డిఎస్‌ఎ' ఇచ్చిన తుది నివేదికలోని అంశాలను హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మంగళవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మాజీ సిఎం కెసిఆర్ హయాంలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం, ఉద్దేశపూర్వక దుర్వినియోగాన్ని ఎన్‌డిఎస్‌ఎ నివేదిక బయటపెట్టిందని తెలియజేశారు. తెలంగాణ పిల్లల జీవితాలను తాకట్టు పెట్టి, లక్షల కోట్ల రుణాలతో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించారని, తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు,రైతులకు తీరని నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర భారతదేశంలో మానవ కట్టడాలలో ఇంత ఘోరంగా వైఫల్యం చెందిన ప్రాజెక్టు లేదని ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ద్వారా స్పష్టం అవుతుందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం, కె.చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రి ఉన్న సమయంలోనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు డిజైన్, నిర్మాణం పనులు, కూలిపోవడాలు లాంటివి జరిగాయని, దీనిపై ఎన్‌డిఎస్‌ఎ కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చిందని వివరించారు. పార్లమెంట్‌లో చట్టం ద్వారా దేశంలోనే అత్యున్నత నైపుణ్యం కలిగిన నిపుణులతో నేషనల్ డ్యామ్ సేఫ్టి అథారిటీని నియమించారని, దేశంలోని 700 బ్యారేజీలను ఎన్‌డిఎస్‌ఎ భద్రతను పరిశీలిస్తోందని,ఇంత అనుభవం, నైపుణ్యం ఉన్న వారు దేశంలోనే ఎవ్వరూ లేరని వివరించారు. కాళేశ్వరం వైఫల్యం పైన బాధ్యత వహించాల్సిన బిఆర్‌ఎస్, గత సిఎం కెసిఆర్, అందుకు భిన్నంగా ఎన్‌ఎస్‌డిఎపై ఎదురుదాడి చేయడం, అధికారాన్ని ప్రశ్నించడం సిగ్గుచేటని, ఆ సంస్థను కించపరిచేలా మాట్లాడడం మంచిది కాదని మండిపడ్డారు. ప్రజా జీవితంలో బాధ్యత కలిగిన వారు సిగ్గుతో తలవంచుకుని క్షమాపణ చెప్పకుండా, ఎన్‌డిఎస్‌ఎ ఎవరు? అని, వికృతమైన, వికారనమైన విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేరే ఏ దేశంలోనైనా మానవ తప్పిదం వల్ల వేల, లక్షల కోట్ల రూపాయాలు నష్టం జరిగితే ఉరుకుంటారా? అని ప్రశ్నించారు. డిపిఆర్ రూపకల్పనకు తగిన సమయం ఇవ్వకుండా హడావుడి చేశారని, డిపిఆర్‌లో అనుకున్న దానికి భిన్నంగా బ్యారేజీల నిర్మాణ సమయంలో అసాధారణమైన, గణనీయమైన మార్పులు జరిగాయని తెలిపారు. నిర్మాణ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత అన్నారం, సుందిళ్ల బ్యారేజీల స్థలాన్ని వరుసగా 2.2 కి.మీ, 5.4 కిలోమీటర్లు దిగువకు మార్చారన్నారు. అన్నారం బ్యారేజీకి ఎగువన భారీగా ఇసుక మేటలు వేశాయన్నారు. మూడు బ్యారేజీలలో షీట్ పైల్స్ స్థానంలో సీకెంట్ పైల్స్ వచ్చాయని, సిబిఐపి మార్గదర్శకాల ప్రకారం జియోటెక్నికల్ పరిశోధనల కోసం 85 బోర్ హోల్స్ అవసరం ఉండగా, కేవలం 6 బోర్ హోల్స్ మాత్రమే తవ్వారని మంత్రి ఉత్తమ్ వివరించారు. సిడిఓపై అధికారంలో ఉన్నవాళ్లు(బిఆర్‌ఎస్ ప్రభుత్వంసిఎం కెసిఆర్) నిరంతర జోక్యం చేసుకున్నట్లు నివేదిక స్పష్టం చేసిందన్నారు.

**మొదటి, తుది నివేదిక ఒక్కటే:** ఎన్‌డిఎస్‌ఎ మొదటి నివేదిక,ఇటీవల సమర్పించిన తుది నివేదిక ఒకే తరహా ఉన్నదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. మేడిగడ్డ ప్రారంభానికి ముందే ప్రాజెక్టులో లోపాలు బయటపడ్డాయని, కానీ బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఒప్పుకోలేదని,తద్వారా తీవ్ర నష్టం జరిగిందన్నారు. తమ్మిడిహట్టిని కాదని మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించడమే ప్రధాన లోపమని ఎన్‌డిఎస్‌ఎ తెలిపిందని, మేడిగడ్డ ప్రతిపాదనను సిడబ్ల్యూసి ప్రారంభంలోనే తోసిపుచ్చిందన్నారు. బ్యారేజీ నిర్మాణానికి మట్టి పరీక్షలు, నాణ్యత పరీక్షలు వంటివి ఏమీ చేయలేదని విమర్శించారు. అనేక లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా పట్టించుకోలేదని, తమ్మిడిహట్టి మార్పు వల్ల ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు నష్టం జరిగిందన్నారు.

**తెలంగాణ ప్రతిష్టను దెబ్బతిశారు:** కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణానికి ముందుగా రూ. 80 వేల కోట్లతో అనుమతులు తీసుకుని,లక్ష కోట్లు ఖర్చు చేశారని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ప్రాజెక్ట్‌ను అంత హడావుడిగా, తొందరపాటు, అసమర్ధతతో, కక్కుర్తి తో నిర్మించారని విమర్శించారు. నీటి పారుదల ప్రాజెక్ట్‌కు రుణాలు ఇవ్వలేదని, వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని, ప్రజలను నిండా ముంచారని మండిపడ్డారు.ఈ ప్రాజెక్ట్‌ల కారణంగా తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతిన్నదని, దీని ప్రభావం సీతారామ ప్రాజెక్ట్ అనమతిపైన పడిందని వివరించారు. మేడిగడ్డ బ్యారేజీ కుప్పకూలిందని, ఇక సీతారామ ప్రాజెక్ట్ ఎందుకని కేంద్రం అనుమతిని నిరాకరిస్తే, తాము సిడబ్ల్యుసితో అనుమతి తీసుకున్న విషయాన్ని ఉత్తమ్ వివరించారు. తమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవని గత ప్రభుత్వం అబద్దాలు,అవాస్తవాలను ప్రచారం చేసి, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ప్రాణహిత ప్రాజెక్ట్‌ను రీ డిజైన్ పేరుతో మేడిగడ్డకు తరలించారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లోపభూయిష్ట నిర్మాణంతో ప్రతి ఏటా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.16 వేల కోట్ల వడ్డీని చెల్లించాల్సివస్తుందన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎంపి బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అంతర్జాతీయ సదస్సుకు సిఎం కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : దక్షిణ కోరియాలో బొటానిక్ గార్డెన్స్ కన్సర్వేషన్ ఇంటర్నేషనల్ (బిజిసిఐ) ఆధ్వర్యంలో ''ఎడ్యుకేషన్ ఫర్ చేంజ్ బోటానిక్ గార్డెన్'' పై జూన్ 9 నుంచి జరిగే సమావేశాలలో పాల్గొనాల్సిందిగా తెలంగాణ ముఖ్యమంత్రి కార్యదర్శి జి.చంద్రశేఖర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ సమావేశంలో ఆయన సంస్కృతిని ప్రకృతితో అనుసంధానించే బొటానికల్ గార్డెన్స్ అంశంపై చర్చించనున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్‌లో చంద్రశేఖర్‌రెడ్డి 75 థీమ్ పార్క్‌లను ఏర్పాటు చేయించారు. ఇందులో సుమారు 2000 రకాలకు చెందిన మొక్కలు ఉన్నాయి. ఇందులో వృక్ష పరిచయ క్షేత్రం పేరుతో మొక్కలను పరిచయం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చిన్న పిల్లల నుంచి పెద్దవారందరికి రకరకాల మొక్కలను తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు.



## కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ మీదే
మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ప్రజాపక్షం/హుస్నాబాద్ : ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థులు కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ మీదేనని తెలంగాణ రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభకర్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రెసిడెన్షిల్ జూనియర్ కాలేజి ఎన్సాన్‌పల్లిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న హుస్నాబాద్ పట్టణానికి చెందిన రాధారపు వైష్ణవి ఎంపిసి ఎస్‌లో 470 మార్కులకు 468 సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, మంగళవారం వారి ఇంటి వెళ్లి విద్యార్థినిని అభినందించి, శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్య కోసం ప్రతి ఒక్కరిపై లక్ష పైచిలుకు ఖర్చు చేస్తుందని, ప్రతి గురుకులాల్లో ఉన్నతమైన విద్యతోపాటు మంచి భోజనం, కంప్యూటర్ శిక్షణ ఇస్తుందని అన్నారు. ఇలాంటి అవకాశాలను ప్రతి విద్యార్థీ వినియోగించుకుని, వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. మీపై ఎన్నో అశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు మీరు ఇచ్చే కానుక ఉన్నత చదువున్నారు.

గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచిన 150 మంది విద్యార్థులను అభింనందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతి విద్యార్థికీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోస ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మెన్ బ్లొలి శెట్టి శివయ్య, నాయకులు చిత్తారి రవిందర్, మార్కెట్ వైస్ చైర్మెన్ బంక చందు, మాజీ కౌన్సిలర్లు చిత్తారి పద్మ, రాజు, హసన్, ఐలయ్య, శ్రీనివాస్, విద్యార్థిని తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం

రైతులకు భూ భారతి చట్టం శ్రీరామరక్ష : మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం / హనుమకొండ ప్రతినిధి : భూ భారతి చట్టంలో ప్రతి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని.. రైతులకు భూ భారతి చట్టం శ్రీరామరక్ష అని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. భూ భారతి 2025 చట్టం పై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని నాని గార్డెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన భూభారత్ చట్టం అవగాహన సదస్సులో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యుఎంసి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడేలతో కలసి పాల్గొన్నారు. సభా ప్రారంభానికి ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించారు. ఈ సందర్భంగా భూభారతి చట్టంపై ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ అవగాహన సదస్సులో ముందుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టంలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించగా అందులోని అంశాలను జిల్లా కలెక్టర్ సత్య శారద కూలంకుషంగా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి దేశంలోని 18 రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించామని, దేశానికి రోల్ మోడల్‌గా భూభారతి చట్టాన్ని రాష్ట్రంలో అమల్లోకి తీసుకు వచ్చామని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని భూ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చామని, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చినట్లు తెలిపారు.

ఈ చట్టంలో ఫలితాలను చూడాలని రాష్ట్రంలోని నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. జూన్ రెండవ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ప్రభుత్వం మండలాల్లో భూభారతి చట్టం సదస్సును నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ మూడవ తేదీన ప్రతి రెవెన్యూ గ్రామానికి ప్రతి భూ సమస్యల పరిష్కారానికి చట్టం ద్వారా అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో చట్టాలను అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. భూభారతి చట్టం ద్వారా పేద ప్రజలకు తప్పని సరిగా న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్థకత ఏర్పడుతుందని అన్నారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులతో పాటు వరంగల్, ఖిలా వరంగల్ మండలాల్లోని రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్‌ల సస్పెన్షన్

తప్పుడు వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన అధికారులు

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి : జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తప్పుడు వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన ఆర్.ఐ డిప్యూటీ తహసీల్దార్‌లను తప్పుడు వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసినందుకు సస్పెన్షన్ చేశారు. వాస్తవికతకు విరుద్ధంగా తప్పుడు వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసినందుకు గాను గతంలో జహీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి, ప్రస్తుతం కల్హేర్, డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న బిటి వపన్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ యాదిలాల్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. జహీరాబాద్ మండలానికి చెందిన షెక్ అహ్మద్ తండ్రి బాసిత్ అహ్మద్ బతికే ఉన్నప్పటికీ, అతను చనిపోయినట్లు అతని కోడలు బిపాషాకు వారసత్వ ధ్రువీకరణ పత్రం ఆర్ ఐ యాదిలాల్ ఇచ్చిన పంచనామా నివేదిక మేరకు డిప్యూటీ తహసీల్దార్ వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. క్షేత్ర స్థాయిలో విచారణ జరపకుండానే బతికి ఉన్న వ్యక్తి చనిపోయినట్లు పంచనామా నివేదిక సమర్పించారు. వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన డిప్యూటీ తహసీల్దార్ బిటి. పవన్ కుమార్, తప్పుడు నివేదిక సమర్పించిన ఆర్.ఐ యాదిలాల్‌లను తెలంగాణ సివిల్ సర్వీసెస్ రూల్స్ 1991లోని రూల్ (8) సబ్ రూల్ (1,2)ప్రకారం విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐలను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు.

## నకిలీ విత్తనాల కట్టడికి సమగ్ర విత్తన చట్టం అత్యవసరం
రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోకుండా ఉండాలంటే సమగ్ర విత్తన చట్టం అత్యవసరమని, ఇందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో మంగళవారం చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కెవిఎన్.రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాములు నాయక్, భవానీరెడ్డి, భూమి సునీల్, గడుగు గంగాధర్, చెవిటి వెంకన్న యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, రైతు కమిషన్ ఏర్పడి నాటి నుంచి ఇప్పటి వరకు చేపట్టిన వివిధ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతర చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ గత 6 నెలలుగా రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా రైతు కమిషన్ పనిచేస్తూ అనేక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసిందని తెలిపారు. ప్రధానంగా ములుగు జిల్లాలో మొక్కజొన్న విత్తనోత్పత్తి విషయంలో మల్టీనేషనల్ కంపెనీలు చేసిన మోసాలను కమిషన్ వెలికితీయడమే కాకుండా, రైతులకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టి నష్టపరిహారం అందేలా చేసిందని తెలిపారు.. అలాగే సూర్యాపేటలో నకిలీ వరి విత్తనాలతో మోసపోయిన రైతులకు నష్టపరిహారం అందించేలా కమిషన్ కృషిచేసిందన్నారు. రైతు కమిషన్ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలను చేపట్టనున్నట్లు కోదండరెడ్డి వెల్లడించారు.

## గీత కార్మిక మహిళలను సంఘ బహిష్కరణ చేసిన వారిపై తక్షణమే చర్యలు
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ సత్యంకు తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం వినతి





ప్రజాపక్షం/హైదరాబాద్ : నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ డివిజన్ తాళ్ల రాంపూర్ గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా గీత కార్మిక మహిళలను పాల్గొనకుండా సంఘ బహిష్కరణ చేయడంతో పాటు గీత కార్మికులు పెంచుకున్న వందకు పైగా ఈత చెట్లను కాల్చి వేసిన సంఘటనపై తక్షణమే విచారణ జరిపించి, ఇందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించేలా కృషి చేయాలని కోరుతూ సిపిఐ శాసనసభా పక్ష నాయకుడు, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యంలకు తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలుగౌడ్, రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షుడు కెవిఎల్, సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, గీత పనివారుల సంఘం కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, నాగర్ కర్నూలు జిల్లా కార్యదర్శి కె.కేశవులతో కూడిన ప్రతినిధుల బృందం కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి సత్యంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని వారు హామీ ఇచ్చారు.

## గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం
**ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి, మరొకరి పరిస్థితి విషమం**







ప్రజాపక్షం/తల్లాడ : గ్యాస్ సిలెండర్ మారుస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన తల్లాడ మండలం, మిట్టపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో గుత్తికొండ వినోద్ చెల్లెలి మార్తెలు ప్రిన్సి (9), లింసీ (5) ఇద్దరూ వేసవి సెలవులు కావడంతో మిట్టపల్లి గ్రామంలోని మేనమామ ఇంటికి వచ్చారు. అలాగే గుత్తికొండ వినోద తల్లి సుశీల (70) పెద్ద కుమారుడు తరుణ్ (8), వరుణ్ (8) ఇద్దరు కవలపిల్లలు. వేసవి సెలవులు కావడంతో అందరూ ఇంట్లోనే ఉన్నారు. సోమవారం రాత్రి 8గంటల సమయంలో గ్యాస్ అయిపోయిందని గమనించిన గుత్తికొండ వినోద్ మరొక గ్యాస్ సిలెండర్‌ను బిగిస్తున్న సమయంలో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న దుస్తులకు మంటలు అంటుకుని దట్టమైన పొగలు వ్యాపించాయి. మంటల్లో చిక్కుకున్న వినోద్, సుశీల, వరణ్, ప్రిన్సి, లింసీలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108లో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, గుత్తికొండ వినోద్ చిన్నకుమారుడు తరుణ్ పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు 108 వాహనం ద్వారా హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

మంగళవారం చికిత్స పొందుతూ తరుణ్ మృతి చెందగా, గాయపడ్డ వారిలో తల్లి సుశీల ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమార్తె లింసీ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటన జరిగినప్పుడు పిల్లలు స్నానం చేసి అప్పుడే ఇంట్లోకొచ్చారని, ఇంతలోనే ఇలా గ్యాస్ అయిపోవడంతో మరొక గ్యాస్ సిలెండర్‌ను బిగిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ సమయంలో వినోద్ భార్య రేవతి సరుకులు కొనడానికి దుకాణానికి వెళ్లడంతో ప్రమాదం నుండి బయటపడింది. ఈ ఘటనతో మిట్టపల్లి గ్రామంలో, బాధితుల కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానిక పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భూ(దాన్) కుంభకోణం

ఐఎఎస్, ఐపిఎస్‌లకు శరగోపం
ఇడి దర్యాప్తులో వెలుగుచూసిన వైనం
45 కార్లు సీజ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : సంచలనం రేపిన భూదాన్ భూ కుంభకోణం కేసులో మధ్యవర్తులు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకే శరగోపం పెట్టారని ఇడి దర్యాప్తులో తేలింది. ఈ మేరకు మంగళవారం ఇడి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది. భూదాన్ భూములు ఖాదర్‌ఉన్నిసా పూర్వీకుల ఆస్తిగా చెప్పి రెవెన్యూ రికార్డులను మోసపూరితంగా మార్చేశారని ఇడి పేర్కొంది. కొంతమంది దళారులతో కలిసి భూమిని వివిధ సంస్థలకు విక్రయించారని, ఈ మధ్యవర్తులు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు అమ్మకాలు చేశారని ఇడి పేర్కొంది. అందుకోసం నకిలీ పత్రాలను సృష్టించి, భూ రెవెన్యూ రికార్డులను మార్చినట్లు విచారణలో తేలింది. నిషేధిత జాబితా నుండి పేర్కొన్న భూమిని డినోటిఫై చేయడంతో పాటు కొన్ని ప్రైవేట్ పార్టీలకు విక్రయించారు. ఖాదేరునిస్సా, మహమ్మద్ మునావర్ ఖాన్, మహమ్మద్ లతీఫ్ షర్ఫాన్, మహమ్మద్ అక్తర్ షర్ఫాన్, మహమ్మద్ సుకూర్లు ప్రభుత్వ భూమిని మోసపూరితంగా అమ్మకాలు, కొనుగోలు చేసిన పత్రాలు సీజ్ చేశామని ఇడి అధికారులు తెలిపారు. ఈమేరకు 23 లక్షల రూపాయల నగదు, విదేశీ కరెన్సీ 12000 దిర్హామ్ సీజ్ చేశారు. మహమ్మద్ ఫాంహౌజ్‌లో 45 కార్లు స్వాధీనం చేసుకున్నాము. ఈ కేసుకు సంబంధించి ఇంకా విచారణ కొనసాగుతుంది అని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేయడంపై విచారణ చేస్తున్నామని స్పష్టం చేసింది. నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించడంపై ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వ అధికారులపై తెలంగాణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు జరుపుతున్నామని ఇడి పేర్కొంది. మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో ఉన్న భూములు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించామని తెలిపింది.

## టీచర్ల అక్రమ అరెస్టులు ఆక్షేపణీయం
నందూరి కరుణకుమారి

ప్రజాపక్షం/హైదరాబాద్ : అంగన్‌వాడి టీచర్ల అక్రమ అరెస్టులను అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ కుమారి తీవ్రంగా ఖండించారు. మంగళవారం తెల్లవారు జామున 5గంటలకు పీర్జాదిగూడలో ఉన్న యూనియన్ రాష్ట్ర కోశాధికారి ప్యారీజాన్ ఇంటికి పోలీసు వెళ్ళి మహిళా పోలీసులు లేకుండానే అక్రమ అరెస్టుచేసి మేడిపల్లి పోలీస్ స్టేషన్ తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ఆందోళనలకు ఎలాంటి పిలుపునివ్వకున్నా ఎఐటియుసి అసోసియేషన్ రాష్ట్ర నాయకులను వివిధ ప్రాంతాలలో అక్రమంగా అరెస్టులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల మార్చి 7న కూడా ఇదే మాదిరిగా పిలుపులు ఇవ్వకున్నా అరెస్టులు చేశారని, అరెస్టులపై పోలీసులు మహిళలని చూడకుండా అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు.

# కర్రె గుట్టలపై యుద్ధ మేఘాలు

శాంతి కాదు సంపద తరలింపునకే కగార్
కగార్‌పై ఆపరేషన్ నిరసల వెల్లువ



ప్రజాపక్షం/ఖమ్మం : తెలంగాణ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల సరిహద్దు కర్రెగుట్టలపై యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. సరిహద్దులో ఉండాల్సిన యుద్ధ దృశ్యాలు దండకారుణ్యం కర్రెగుట్టలలో కనిపిస్తున్నాయి. సుమారు 25వేల మంది సైనిక బలగాలు కర్రెగుట్టలను చుట్టుముట్టారు. లోతైన, విశాలమైన కర్రెగుట్టల గుహాలలో ఉన్న మావోయిస్టులను వేటాడి వెంటాడి హతమార్చాలన్న లక్ష్యంతో సైనికులు ముందుకు సాగుతున్నారు. మోడీ, అమిత్‌షాల ధ్వయం మావోయిస్టులను దేశ పౌరులుగా కాకుండా శత్రు దేశ పౌరులుగా చూస్తుందన్న ఆరోపణల నేపథ్యంలో మావోయిస్టు పార్టీ నుంచి మూడు దఫాలుగా విడుదలైన శాంతి లేఖల గురించి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. శాంతి చర్చలకు తాము సిద్ధమంటూ మావోయిస్టులు మూడుసార్లు లేఖలు విడుదల చేశారు. కానీ ప్రభుత్వం కనీసం స్పందించకపోగా ఆపరేషన్ కర్రెగుట్టలను మరింత ఉధృతం చేసింది. దండకారుణ్యంలో వేలాది మంది సైనికులను దించి సామాన్య పౌరుల స్వేచ్ఛను సైతం హరించి వేస్తున్నారు. శత్రు దుర్భేద్యమైన 70 కిలో మీటర్ల విస్తీర్ణంలో జలపాతాలు, గుహాలు, ప్రకృతి రమణీయతతో కూడిన ఈ గుట్టలపై ఇప్పుడు బూట్ల చప్పుళ్లు దడదడలాడిస్తున్నాయి. ఒక్కో గుహాలో వెయ్యి మంది తలదాచుకునేవిధంగా ఉన్నాయని ఇప్పటికే అటువంటి గుహను తాము కనుగొన్నామని పోలీసుల నుంచి వస్తున్న సమాచారం. ఆ గుహలో ఆహారపు వస్తువులు కనిపించాయని కూడా చెబుతున్నారు. ఆర్మీ హెలికాప్టర్లు, డ్రోన్ల సహాయంతో పోలీసులు మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో సైనికులకు ఆహార సమస్యతో పాటు పలు సమస్యలు వెంటాడుతున్నాయి. అసలు కర్రెగుట్టలపై ఎంత మంది మావోయిస్టులు ఉన్నారు. వారు కర్రెగుట్టల్లోనే తలదాచుకుంటున్నారా అన్న సమాచారంపై ఇప్పుడు విస్తృత చర్చ సాగుతుంది. కర్రెగుట్టల గురించి తెలిసిన వారు సైనిక ఆపరేషన్ అంత తేలిక కాదని చెబుతున్నారు. ఇప్పటికే మావోయిస్టులు పలుమార్లు కర్రెగుట్టలపైన మందుపాతరలు అమర్చామని సామాన్య పౌరులు ఆవైపు రావద్దంటూ మూడు మాసాల క్రితమే హెచ్చరించారు. ఇప్పుడు మందుపాతరలను తాము నిర్వీర్యం చేస్తున్నామని పోలీసులు చెబుతున్నప్పటికీ ఆపరేషన్ కర్రెగుట్టలు అంతా తేలికైన విషయం కాదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా దండకారుణ్యం ఖనిజ సంపదలకు కాణాచి. విస్తారమైన ప్రాంతంలో ఇక్కడ ఖనిజాలు దాగి ఉన్నాయి. ఈ ఖనిజాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌కు తెరలేపిందని ఆ క్రమంలో నిర్దాక్షిణ్యంగా కాల్పులకు పాల్పడుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గడిచిన రెండేళ్లుగా ఎదురు కాల్పుల పేరిట వందల సంఖ్యలో మావోయిస్టులను సైనిక బలగాలు హతమార్చాయి. ఇందులో స్వల్ప సంఖ్యలో సైనికులు కూడా మృతిచెందారు. మావోయిస్టులపై ఏకపక్ష దాడులకు నిరసనగా రాజకీయ పక్షాలు ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తూనే ఉన్నాయి. కానీ అమిత్ షా 2026 మార్చినాటికి దేశంలో నక్సలిజాన్ని తుదముట్టిస్తామని ప్రకటనలు గుప్పిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్టుల నుంచి శాంతిలేఖ వెలువడిన తర్వాత రాజకీయ పార్టీలు ముఖ్యంగా వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. మేధావి వర్గం సైతం మావోయిస్టులపై ఏకపక్ష దాడులను నిలిపివేసి శాంతి చర్చలకు పిలవాలని డిమాండ్ చేస్తుంది. ముఖ్యంగా వామపక్ష పార్టీలు ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఆందోళన బాటపట్టాయి. మావోయిస్టులను తుద ముట్టించడం నేపథ్యంలో దండకారుణ్యంలో ఉన్న ప్రకృతి సంపదను మోడీ అనుయయులైన కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్ అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నాయి. దశాబ్దాల తర్వాత మావోయిస్టులు శాంతి చర్చల పేరుతో ఇచ్చిన లేఖకు స్పందించాలని మావోయిస్టులను భారత దేశ పౌరులుగానే చూడాలన్న డిమాండ్‌తో నిరసనలు ప్రారంభమయ్యాయి. ఈ దశలో ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఒక సిద్ధాంత భావాజలంతో కూడిన తీవ్రవాదాన్ని, ప్రజా మద్దతు కలిగిన పోరాటాన్ని తుద ముట్టించడం అంత తేలికైన విషయం కాదన్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తెరగాల్సి ఉంది.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్-ఎం, ఎల్‌బి నగర్ జోన్.

NIT No.02/SE-M/LBNR/GHMC/J2&J3/2025-26 షార్ట్ టెండర్ నోటీసు తేది: 28.04.2025

**పని పేరు:** జిహెచ్‌ఎంసి, ఎల్‌బినగర్ జోన్ (స్పోర్ట్స్ సెక్షన్)లో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా కార్మికులు-16 మంది, డ్రైవర్-1 (ఒకరు) నియామకం, **మొత్తం:** రూ.39,71,328.00, **బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 29.04.2025న మ.3.00గం.ల నుండి, **బిడ్ల దాఖలుకు ఆఖరి తేది:** 02.05.2025న మ.3.00గం.ల వరకు. సాంకేతిక బిడ్ ప్రారంభ తేది: 02.05.2025న మ.3.30గం.లకు, ప్రైస్ బిడ్ ప్రారంభ తేది: 02.05.2025న మ.3.45గం.లకు, **అధికారి పేరు & చిరునామా:** ఎస్‌ఇ-ఎం, ఎల్‌బిఎన్‌ఆర్ జిహెచ్‌ఎంసి జోనల్ కార్యాలయం, గడ్డిఅన్నారం, హైదరాబాద్. 9701362708. మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 993-PP/CL/ADVT/1/2025-26, Date: 29-04-2025

**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

EOI No. 5/ADVT/MS/2025/AE-6(ADVT)HO, ఆసక్తి వ్యక్తీకరణ తేదీ: 28.04.2025

**ఐటమ్ నెం.1, పని పేరు:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చార్మినార్ పాత బస్టాండ్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం. **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: ప్రారంభ తేది:** 03.05.2025న ఉ.10.00గం.ల నుండి, **ఆఖరి తేది:** 19.05.2025న సా.5.00గం.ల వరకు. **అధికారి పేరు:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ట్రాఫిక్ & ట్రాన్స్‌పోర్టేషన్, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు 'ఇ'ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు. ఏదైనా వివరణ అవసరమైతే, బిడ్డర్లు నం.7893066262, ఇ-మెయిల్: traffic 2024@gmail.com ని సంప్రదించవచ్చు.

సం/- అడిషనల్ కమిషనర్, (అడ్వర్టైజ్‌మెంట్ & ట్రాఫిక్), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 921-PP/CL/ADVT/1/2025-26 Date: 28-04-2025

**పురపాలక సంఘ కార్యాలయము - బాన్సువాడ, జిల్లా : కామారెడ్డి**

నెం.యం.సి.E1/54/2023-24 తేదీ : 29.04.2025

బాన్సువాడ మునిసిపాలిటి పరిధిలో ఈ క్రింద తెలిపిన అభివృద్ధి పనుల కొరకు సీల్ కొటేషన్స్ స్వీకరించుట

| క్ర.సం. | వివరములు |
|---|---|
| 1. | అశోక చక్రంతో పాటు కళాత్మక ఫైబర్ అశోక స్థూపం సరఫరా & అమర్చుట మరియు తగిన నిర్వచించిన పరిమాణం (3 అడుగుల ఎత్తు & 1 అడుగు వ్యాసం). |
| 2. | నీలిరంగు షీట్ బాక్‌గ్రౌండ్‌లో స్టెయిన్‌లెస్ స్టీల్ అక్షరాలతో 22x3 అడుగుల పరిమాణంలో వైకుంఠధామం (హిందూ శ్మశాన వాటిక) నేమ్ బోర్డును అందించడం మరియు ఏర్పాటు. |

పైన చూపబడిన వస్తువుల యొక్క సీల్ కోటేషన్స్ తేది. 03-05-2025 సాయంత్రం 4-00 గంటల వరకు పురపాలక సంఘ కార్యాలయము బాన్సువాడ యందు సమర్పించగలరు. మిగితా వివరాలకు కార్యాలయ పని వేళల యందు యందు ఫోన్ నెం. 9963583010 నకు సంప్రదించగలరు.

సం/- మునిసిపల్ కమిషనర్ పురపాలక సంఘం, బాన్సువాడ

DIPR R.O. No. : 991-PP/CL/ADVT/1/2025-26, Date: 29-04-2025

తెలంగాణ ప్రభుత్వం
**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, ఎంబి ఇన్ఫ్రా, డివిజన్, పెద్దపల్లి.**

నెం.DB1/14/2024-25 ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన - 2వ పిలుపు తేదీ : 28.04.2025

**పని పేరు:** పాలకుర్తి మండలంలో బమ్లానాయక్ హెచ్/ఓ. బమ్లా నాయక్ తండా గ్రామానికి త్రాగు నీరు సరఫరా మెరుగుదల. **అంచనా విలువ:** రూ.5.40లక్షలు, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌లో లభించు టెండర్ డాక్యుమెంట్లు:** 01.05.2025 నుండి 07.05.2025న మ.3.00గం.ల వరకు. **బిడ్ దాఖలుకు ఆఖరి తేది:** 07.05.2025న సా.5.00గం.ల వరకు, **ఆర్థిక బిడ్ ప్రారంభ తేది:** 08.05.2025న ఉ.11.00గం.లకు. పైన పేర్కొన్న పనులకు పెద్దపల్లి డివిజన్, ఎంబి ఇన్ఫ్రా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అధికారిని సంప్రదించవచ్చు. కాంట్రాక్టర్లు తమ వివరాలను జిప్ ఫార్మాట్‌లో అందించాలని అభ్యర్థిచడమైనది. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurment.gov.in నుండి పొందవచ్చు. ఇ-మెయిల్: eembintrapdpl@gmail.com

సం/- జి.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎంబి ఇన్ఫ్రా, డివిజన్ పెద్దపల్లి.

DIPR R.O. No. : 1012-PP/CL/ADVT/1/2025-26, Date: 29-04-2025

**హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్

బహిరంగ ప్రకటన U/s 15 (4) హెచ్ఎండిఏ చట్టం, 2008
(జీఓ ఎంఎస్ నెం.77 MA & UD విభాగం, తేదీ 28-03-2005)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008( 2008 యొక్క చట్టం నెం.8)లోని సెక్షన్ 15లోని సబ్ సెక్షన్ (1) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ ప్రభుత్వం ఇక్కడ రామచంద్రాపురం జోన్ సెగ్మెంట్‌లోని పూర్వపు నోటిఫైడ్ హుడా ఏరియా మాస్టర్ ప్లాన్‌లో ఊహించిన భూవినియోగానికి ఈ క్రింది వైవిధ్యాన్ని సూచిస్తున్నది. ప్రభుత్వం ఆమోదించిన జీవో ఎంఎస్.నెం. 288 MA&UD, తేదీ: 03-04-2008, ద్వారా ఆ సెక్షన్ యొక్క సబ్ సెక్షన్ (1) వైవిధ్యం అవసరమైనది.

ఇంతకు ముందు రామచంద్రాపురం జోన్ సెగ్మెంట్‌లోని హుడా ఏరియా మాస్టర్ ప్లాన్ లో నోటిఫైడ్ చేయబడి ప్రభుత్వ జీవో ఎంఎస్. నెం.288 MA&UD, తేదీ 03-04-2008 ప్రకారం ప్రస్తుతం కన్జర్వేటివ్ ఉపయోగం కోసం కేటాయించబడిన రంగారెడ్డి (జిల్లా), శేరిలింగంపల్లి (మండలం), గోపన్‌పల్లి గ్రామంలోని సర్వే నెంబర్లు 261/P లోని 28219.95 చదరపు మీటర్లు లేదా 6ఎకరాల 39 గుంటలలో విస్తరించబడిన స్థలాన్ని ప్రస్తుతం రెసిడెన్షియల్ ఉపయోగ జోన్‌గా మారుస్తూ గుర్తించబడింది.

పైన తెలపబడిన దానికి సంబంధించిన వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంటాయి.

సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (ఆర్ఆర్) హెచ్ఎండిఏ.

DIPR R.O. No. : 1062-PP/CL/ADVT/1/2025-26, Date: 29-04-2025

ప్రజాపక్షం
బుధవారం, ఏప్రిల్ 30

# భద్రతామండలి వడపోత తీర్మానం

పహల్గాంలో టెర్రరిస్టు దాడిని ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ''తీవ్రంగా ఖండిస్తూ'' శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. మతాన్ని ఎంచుకుని హత్యాకాండకు పాల్పడిన ఈ నీచమైన టెర్రరిస్టు దాడి స్వభావాన్ని ప్రపంచ దృష్టికి తేవటానికి ఈ తీర్మానం అవసరమే. అయితే తీర్మానం భాష ముసాయిదా నుంచి వడపోతకు గురైనట్లు, రాజీపూర్వకంగా అందరికీ అంగీకారయోగ్యమైన భాష ఉపయోగించినట్లు కనిపిస్తున్నది. పాకిస్థాన్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదానికి పదేపదే గురవుతున్న బాధిత దేశం మనది. భారత ప్రభుత్వం, రాజకీయ వ్యవస్థ, ప్రజలు స్పందించినంత ఆవేశపూరితంగా ప్రపంచంలోని దేశాలన్నీ స్పందించి ఖండనమండనలు జారీ చేయాలని ఆశించలేము. అందునా ప్రస్తుతం పాకిస్థాన్ భద్రతామండలిలో ఎన్నికైన నాన్ పర్మినెంట్ మెంబరుగా ఉంది. పాకిస్థాన్‌కు సర్వకాల సర్వావస్థల్లో ఆప్తమిత్రునిగా ఉన్న చైనా ప్రజారిపబ్లిక్, మండలిలో వీటో హక్కు కలిగిన శాశ్వత సభ్యురాలు. పహల్గాంలో టెర్రరిస్టు దాడి బాధ్యతను పక్కదారి పట్టించేందుకు పాకిస్థాన్ కోరుతున్న ''నిష్పాక్షిక విచారణ''ను ఇప్పటికే చైనా బలపరిచింది. పాకిస్థాన్ డిమాండ్‌ను చైనా బలపరిచింది కాబట్టి దాన్ని మన శత్రుదేశాల లిస్టులో చేర్చే తొందరపాటూ సరైనది కాదు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య పరిస్థితి చల్లబరిచేందుకు తీసుకునే ఏ చర్యనైనా బలపరుస్తామని చైనా సోమవారం స్పష్టం చేసింది. భద్రతామండలి తీర్మానం పహల్గాం టెర్రరిస్టు దాడిని ఖండించిందిగాని, ఆ దాడికి తొలుత బాధ్యత ప్రకటించుకున్న 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టిఆర్‌ఎఫ్)నుగాని, ఆ దాడికిగల సీమాంతర సంబంధాలనుగాని ప్రస్తావించలేదు. 'నిష్పాక్షిక విచారణకు' సిద్ధమన్న పాకిస్థాన్ పైభావంతో కూడిన భాషకు అభ్యంతరం తెలియజేయటం, దానికి చైనా మద్దతు కారణంగా ఆ భావం తీర్మానంలో చోటుచేసుకోలేదని భావించబడుతున్నది. అమెరికా కూడా టెర్రరిస్టు దాడిని ఖండించినా, భారత్–పాకిస్థాన్‌లే సమస్యను పరిష్కరించుకోవాలన్న వైఖరితో ఉంది. భద్రతామండలి ప్రస్తుత అధ్యక్షుడైన ఫ్రాన్స్ రాయబారి అమెరికా, రష్యా, యుకె సహా ఇతర సభ్యులనుంచి గట్టి తోడ్పాటు సాధించలేకపోయారు. సార్వత్రిక అంగీకారంగా తీర్మానం రూపొందించబడింది. భారత్–పాక్ యుద్ధాన్ని ఏ దేశమూ కోరుకోవటం లేదని విదితమవుతున్నది.

ఈ టెర్రరిస్టు దాడి పర్యవసానంగా భారత–పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఏ క్షణంలో ఏమి జరుగుతుందో ఊహించలేని సైనిక స్థితి నెలకొని ఉంది. టెర్రరిజం అణచివేతకు సైన్యానికిపూర్తి అధికారమిస్తున్నట్లు ప్రధాని మోదీ మంగళవారం ప్రకటించారు. ఇరుపక్షాల త్రివిధ దళాలు సర్వసన్నద్ధం చేయబడినాయి. రెండు దేశాలు తీవ్రమైన పరస్పర ఆంక్షలు విధించుకోవటంతో దౌత్యసంబంధాలు కనిష్టస్థాయికి అడుగంటాయి. కాగా జమ్మూ–కశ్మీర్‌లో భారత భద్రతా దళాలు టెర్రరిస్టులకోసం, వారికి ఆశ్రయమిచ్చిన, లాజిస్టిక్స్‌కు తోడ్పడిన ముష్కరులకోసం తీవ్రంగా గాలిస్తున్నాయి. దాదాపు అరడజను టెర్రరిస్టు ముఖ్యుల ఇళ్లు పేల్చివేశారు. ఎన్‌ఐఎ రంగంలో దిగి ప్రాథమిక సాక్ష్యాధారాలకోసం జల్లెడపడుతున్నది. ఇదిలావుండగా, జమ్మూ–కశ్మీర్ అసెంబ్లీ టెర్రరిస్టు దాడిని ఖండించి, హతులకు జోహార్లర్పించింది. కాగా బుధవారం ఢిల్లీలో భద్రతా వ్యవహారాలపై ఉన్నతస్థాయి సమావేశాలు, ఆ పైన కేంద్రమంత్రివర్గ సమావేశం జరగనున్నాయి.

భద్రతామండలి తీర్మానంతో భారత్ సంతృప్తి చెందకపోతే మరింత పరుషమైన పదజాలంతో కూడిన తీర్మానాన్ని ఐరాస జనరల్ అసెంబ్లీలో ప్రతిపాదించవచ్చు. మెజారిటీ సభ్యులు తీవ్రతను గ్రహించేలా చేసి తీర్మానానికి మెజారిటీ ఆమోదం పొందవచ్చు. ఉక్రేన్, గాజా సంఘర్షణ విషయంలో పలు దేశాలు అలాగే చేశాయి. పుల్వామా దాడి తర్వాత పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మొహమ్మద్ అధిపతి మసూద్ అజార్‌ను ఐరాస చే టెర్రరిస్టుగా ప్రకటింపజేయటంలో భారత్ సఫలమైంది. టెర్రరిస్టు సూత్రధారులను గుర్తించి ఇప్పుడూ ఆ ప్రయత్నం చేయవచ్చు. దర్యాప్తుకు సహకరిస్తామనే పాకిస్థాన్ మాటను నమ్మవలసిన పనిలేదు. ముంబయి(2008), పఠాన్‌కోట్ (2016), పుల్వామా (2019) దాడుల తదుపరి అది మాట నిలబెట్టుకోలేదు. అమెరికా నుంచి టెర్రరిస్టు తహవూర్ రాణాను భారత్‌కు రప్పించటానికి ప్రభుత్వం చూపిన ఓర్మి, సహనం ఇప్పుడూ అవసరం. అయితే పాకిస్థాన్‌పై ప్రతీకార చర్యకోసం రగులుతున్న భావోద్రేకాలను సంతృప్తి పరచటం ఎలా అని ప్రభుత్వం ఆలోచించేముందు, సైనిక చర్య అనివార్యమైతే రాగల పర్యవసానాలు గూర్చి, అంతర్జాతీయ అభిప్రాయం గూర్చి ప్రభుత్వం పలువిధాల ఆలోచించాలి.

# సంకెళ్ళులేని లోకంకోసం శ్రీ శ్రీ...!



శోభ రమేష్
8978656327

కష్టజీవికి రెండువైపులా అండదండగా నిలిచేవాడే నేటి కవి అని ఆధునిక కవికి అధునాతన నిర్వచనం ఇచ్చిన శ్రీ శ్రీ తెలుగ కవిత్యాన్ని మలుపు తిప్పిన శ్రీశ్రీగా ఎదిగి మహాకవిగా గుర్తింపు పొందిన శ్రీరంగ శ్రీనివాసరావు ఏప్రిల్ 30/1910 విశాఖపట్నంలో జన్మించారు. నేటికి 115 సంవత్సరాలు పూర్తయ్యాయి. కానీ శ్రీ శ్రీ రాసిన కవిత్వం మాత్రం నేటికీ బాధాతప్త హృదయాలను కదిలిస్తూ ముందుకుసాగమంటుంది.

తెలుగు కవిత్వాన్ని విప్లవీకరించి విప్లవాన్ని కవిత్వీకరించి తెలుగు జనం పాడుకునే సంగీతం లా మార్చిన వాడు శ్రీశ్రీ. దోపిడి వ్యవస్థ శతాబ్దాల తరబడి భయానకంగా ప్రజలను వంచిస్తున్న పాలకవర్గాలకు సాహితీ వీరుడు మహాప్రస్థానం కావ్యం. ఈ కావ్యం ఈనాటికి దివ్య ఔషధమే. అది కదిలేది, కదిలించేది పెను నిద్దర వదిలించేది... పదండి ముందుకు పదండి తోసుకు, నది నదాలు, అడవులు, కొండలు, ఎడారులా..? మనకడ్డంకి అంటూ అన్ని తరాలతో పాటు వయోవృద్ధులలో కూడా ఉత్సాహాన్ని ఉత్తేజాన్ని రేకెత్తించింది శ్రీశ్రీ కవిత్వం.

శ్రీశ్రీ ఎప్పుడూ.. తానున్న వర్తమాన ప్రపంచం లో జీవించడమే కాదు, ఆ సమాజాన్ని తన వెంట లాక్కొని తీసుకెళ్లాడు. ప్రజల ఆరాటాల పోరాటాల్లో ఆచరణాత్మకంగా. అంతర్భాగమయ్యాడు.

శ్రీకాకుళ ఉద్యమాన్ని గొంతెత్తి గానం చేశాడు. ధర్మంకోసం, న్యాయంకోసం సాగుతున్న గిరిజన రైతాంగ పోరాటంపై పాలకులు ఉక్కు పాదం మోపారు. రక్తపుటేరులు పారించారు. అప్పుడు శ్రీశ్రీ సత్యం చావదని ఎలుగెత్తి చాటాడు.

ప్రజల హక్కులను రక్షించే బాధ్యతను నెత్తికెత్తుకున్నాడు. పౌర హక్కుల సంఘమయ్యాడు. ప్రజల పక్షాన మాట్లాడిన వారిని నక్సలైట్లుగా ముద్ర వేసి అణచివేయ చూసినప్పుడు శ్రీశ్రీ నేను నక్సలైట్నని మెడలో ఓ బోర్డును వేలాడ తీసుకొని రోడ్డెక్కి తిరుగుతూ పాలకులకు ప్రశ్న సంధించాడు.

వాస్తవ జీవితంలో ఆచరించగలిగిన లేకున్నా అందరికీ గౌరవనీయంగా కనబడే కొన్ని ఆదర్శాలు అన్ని కాలాల్లోనూ ఉంటాయి. సాహిత్యం, సాహి త్య కారులు ప్రజల ప్రయోజనాల పక్షాన నిలబడగలగాలి, పాలకవర్గాలకు ప్రతిపక్షంగా ఉండాలి అనే ఆదర్శాలు కూడా అలాంటివే అని గుర్తించా లి. ఇలాంటి వాటికి ప్రేరణ ఇచ్చిన అంశాలు వేరువేరుగా ఉన్నప్పటికీ, అన్ని సామాజిక దశల్లోనూ ఈ ఆదర్శాలను ప్రకటించుకున్న సాహిత్యకారులు కొందరు ఉంటూనే వచ్చారు.

స్థలానికి, కాలానికి విడదీసి వ్యక్తి చైతన్యాన్ని గూర్చి మాట్లాడడం అనేది తెలియని తనమైన కావాలి లేదా కుత్సితత్వమైన కావాలి. తెలియనితనం అనేది నేరంగా భావించవద్దు. కానీ కుత్సితత్వమే అసలు మోసానికి దారితీస్తుంది. స్థల, కాలాలకు సందర్భానికి విడదీసి సమకాలిన సామాజిక సందర్భానుసారంగా ఆలోచన చేసి, లేని ఉద్దేశాలను శ్రీ శ్రీ కంటకట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఎవరైనా ఏ వ్యక్తి అయినా సమగ్ర సంపూర్ణ వ్యక్తిత్వం, జ్ఞానంతో ఉండాలని ఆశించాలి గాని నేడు పాలకవర్గాలకు అనుకూలంగా రచనలు చేయటం, వారి కనుసన్నల్లో ఉంటూ అది అత్యాశకు దురాశగా మారుతున్నాయి, అలాంటి వాటికి భిన్నమైన కవి శ్రీశ్రీ.

దిగంబర కవిత్వం, విప్లవ కవిత్వం వచ్చిన కొత్తలో ఆ కవిత్వాలు పనికిరావని అన్న వాళ్ళు ఉన్నారు. కొన్ని ఏళ్ల తర్వాత ఈ కవిత్వాలలో ఉండే గొప్పదనాన్ని అందరు గుర్తిస్తారని బలంగా చెప్పిన వ్యక్తి శ్రీశ్రీ. ఆ నమ్మకంతోనే దిగంబర కవిత్వాన్ని ఆహ్వానించాడు. విప్లవ కవితోద్యమంలో నడిచాడు. విప్లవ రచయితల సంఘానికి అధ్యక్షుడు అయ్యాడు. విరసం ఏర్పడ్డ కొద్దిరోజుల్లోనే పెన్ను గన్ను పట్టిన వెంపటాపు సత్యం మాస్టారిని, ఆదిభట్ల కైలాసాలను రాజ్యం ఎన్కౌంటర్ పేరుతో హత్య చేసింది. ప్రభుత్వం ఎందరు నక్సలైట్లను చంపిన నక్సలైట్ అనే పదాన్ని మాత్రం తొలగించలేరని విరసం అధ్యక్షుడిగా ఆనాడే శ్రీశ్రీ ప్రకటించగలిగాడు.



నేడు శ్రీశ్రీ 115వ జయంతి

దోపిడి చేసే, దోపిడీకి గురయ్యే పరస్పర విరుద్ధ వర్గాల వారి అవకాశాలు ఆలోచనలు, స్వభావాలు ఆచరణలు, వాటి ఫలితాలను యదార్థాన్ని శ్రీ శ్రీ కవితలు నేటికీ ప్రతిఫలింప చేస్తున్నాయి.

ధనిక పేద వర్గాల వ్యత్యాసపు లక్షణాలను చూపి అభివృద్ధి నిరోధకవర్గాలు వెలిసిపోవటం, ప్రగతిశీల శక్తులు వెలుగులోకి వస్తాయని నమ్మిన కవి కూడా శ్రీశ్రీ.

వర్గాధిపత్యాన్ని కాపాడటానికే దోపిడి వర్గాలచే న్యాయస్థానాలు, రక్షక బటవర్గాలు, చెరసాలలు, ఉరికొయ్యలు నెలకొల్పడ్డాయని చెప్పిన కవి. వర్గ దోపిడీని దాని తీరును నాటకీయ దృశ్యంలా కళ్ళ ముందు కదలాడే కవిత్వం రాశాడు. దోపిడీ దౌర్జన్యాల దుర్మార్గ వ్యవస్థను అంతంగావిస్తేనే నర జాతికి పరివర్తన నవజీవన శుభ సమయం వస్తుందన్నాడు.

ప్రపంచవ్యాప్తంగా వర్గ పోరాటం చేస్తూ బలిపీఠంపై నిలబడ్డప్పుడే సమ సమాజం సాధ్యమన్నాడు.

మనమంతా బానిసలం, గానుగులం, పీనుగు లం అని గుర్తు చేస్తూ మనది ఒక బ్రతుకేనా సందులలో పందుల వలె అని శ్రీ శ్రీ కవిత్వం నిరంతరం ప్రశ్నిస్తూ ఉంటుంది. కానీ కొందరు కవులు ప్రశ్నలు మరిచారు.

శ్రీ శ్రీ కవిత్వం అభ్యుదయం, విప్లవాత్మకమైన ది. ఆయన ప్రయోగించిన ప్రతీకలేన్నో దానికి తిరుగులేని సాక్ష్యాలుగా ఉన్నాయి. శ్రీ శ్రీ విప్లవ లక్ష్యం పీడిత ప్రజల్ని బానిసలుగా సందులలో పందులు గా మార్చిన నేటి కుళ్ళు వ్యవస్థ స్థానంలో అభ్యుదయకరమైన శ్రమ జీవనపు సౌందర్యాపు సాంస్కృతిక పునాదులపై సమ సమాజం నెలకొల్పాలని ఆశించిన కవిగా మనం గమనించాలి.

ఎవరేమిటో దిక్కుతోచని సందిగ్ధానికి కొంద రు కవులు రచయితలు లొంగిపోయారు. మరికొందరు ఒకవైపు ప్రజల హక్కుల కోసం మాట్లాడుతునే ప్రభుత్వం చేత శాలువాలు కప్పించుకుంటున్నారు, అవార్డులు ఇప్పించుకుంటున్నారు. ఇంకొందరు ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక రాజకీయ దోపిడి విధానాలను వ్యతిరేకించడం తమ పని కాదని వాళ్లు అనుకుంటున్నారు.

ఇదంతా గమనించినప్పుడు.. రచయితల్లారా ఎటువైపు..? అన్న విశాఖ విద్యార్థుల ప్రశ్నకు కాలం చెల్లిపోయింది అని అనుకుందామా..? ఇది ఎంతమాత్రం కాకూడదు. కానీ అలాంటి అవకాశం సన్నగిల్లుతుందని గుర్తించక తప్పదు. డెబ్బై నాటి వలె ఖచ్చితమైన ధ్రువీకరణకు ఈనాటి సాహిత్యకారులు సిద్ధంగా లేరని అర్థం చేసుకోవచ్చు. అయినా సరే సాహిత్య చరిత్రలోనే ప్రతి మలుపులోనూ ఈనాటి కవుల చేతలకు ఆ ప్రశ్న నిరంత రం గుర్తుకు రావాలి.

'రెండు రెళ్లు నాలుగు అన్నందుకు గుండాలు గుండ్రాళ్లు విసిరే ఈ నేలలో' అన్న శ్రీ శ్రీ కాలం నుంచి, ఎక్కడో నట్టడవిలో జరిగే ఎన్కౌంటర్ కథనాల్లోంచి సమాజం చాలా దూరం వచ్చింది. ఇప్పుడు గుండ్రాళ్ళు కాదు మానవ రహిత విమానాలతో బాంబుల వర్షం కురిపించాలని ప్రయత్నిస్తున్నారు.

మనుషులను గ్రీన్ హంట్‌ల పేర వేటాడుతూ ఎన్కౌంటర్లను నడినగరంలోకి తీసుకొచ్చారు. ఈ తెలుగు నెలలో కవులు, రచయితలు నిర్బంధించబడుతున్నారు. ఇనుప పడగ నీడలో ప్రపంచమే ఆర్తనాదాలు చేస్తుంది.

ఎందరో శ్రీశ్రీలు వచ్చి తమతో గొంతు కలుపుతారని ఈ తెలుగు నేల ఎదురుచూస్తుంది. శ్రీశ్రీలా కష్టజీవికి ఇరువైపులా ముందు వెనుక అన్ని తానే అయిన శ్రీశ్రీ లాంటి వారసుల కోసం నేటి సమాజం ఎదురుచూస్తోంది.

### మహాప్రస్థానం

మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచింది!
పదండి ముందుకు,
పదండి త్రోసుకు!

పోదాం, పోదాం పైపైకి!

కదం త్రొక్కుతూ,
పదం పాడుతూ,
హృదయాంతరాళం గర్జిస్తూ –

పద పోదాం,
వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం?
దారిపొడుగునా గుండె నెత్తురులు

తర్పణ చేస్తూ పదండి ముందుకు!
బాటలు నడచీ,
పేటలు కడచీ,
కోటలన్నిటినీ దాటండి!
నదీ నదాలూ,

అడవులూ, కొండలూ
ఎడారులా మనకడ్డంకి?

పదండి ముందుకు!
పదండి త్రోసుకు!

# సృజనాత్మక ఆర్థికవ్యవస్థలో మనస్థానమెక్కడ?



జనక మోహన రావు దుంగ
8247045230

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు వేగంగా మారుతున్నాయి. ఒకప్పుడు వ్యవసాయం, పరిశ్రమలు మాత్రమే ఆర్థిక ప్రగతికి మూలస్తంభాలుగా భావించేవారు. ఆ తర్వాత సేవల రంగం, సమాచార సాంకేతికత రంగం ఆధిపత్యాన్ని నెలకొల్పాయి. నేడు, ఇరవై ఒకటవ శతాబ్దంలో మానవ మేధస్సు, కల్పనాశక్తి, ప్రతిభావ్యుత్పత్తుల నుండి ఆవిర్భవిస్తున్న సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ఒక నూతన శక్తిగా అవతరిస్తోంది. ఆర్థికాభివృద్ధిని, అభివృద్ధిని సృష్టించే సామర్థ్యం కలిగిన సృజనాత్మక ఆస్తుల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఆర్థిక వ్యవస్థను సృజనాత్మక ఆర్థిక వ్యవస్థగా నిర్వచించవచ్చు.

**సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ–విస్తృతి:**

సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ఆదాయ ఉత్పత్తిని పెంపొందిస్తుంది, ఉద్యోగాల కల్పనకు దోహదం చేస్తుంది, ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాన్ని వృద్ధి చేస్తుంది. అదే సమయంలో సామాజిక సమ్మిళితత్వాన్ని, సాంస్కృతిక వైవిధ్యాన్ని, మానవ అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. సాంకేతిక పరిజ్ఞా నం, మేధో సంపత్తి హక్కులు, పర్యాటక లక్ష్యాలతో పరస్పరం అనుసంధానమై పనిచేసే ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక అంశాలను ఇది కలిగి ఉంటుంది. స్థూల, సూక్ష్మ స్థాయిలో దేశంలోని సమగ్ర ఆర్థిక వ్యవస్థతో విస్తృతమైన అనుసంధానాలు కలిగిన జ్ఞాన ఆధారిత ఆర్థిక కార్యకలాపాల సముదాయమిది. వినూత్నమైన, బహుళ విషయాలను కలిగి ఉండే విధాన ప్రతిస్పందనలను, వివిధ మంత్రిత్వ శాఖల సమన్వయంతో కూడిన చర్యలను ఇది ఆశిస్తుంది.

సృజనాత్మక పరిశ్రమలలో సృజనాత్మకత, మేధో సంపత్తి ప్రధాన ముడిసరుకులుగా ఉంటాయి. సృజనాత్మక అంశాలు ఆర్థిక విలువను, మార్కెట్ లక్ష్యాలను కలిగి, కనిపించని మేధోపరమైన లేదా కళాత్మక సేవలను అందిస్తాయి. ఇది జ్ఞానంపై ఆధారపడిన పనుల సముదాయం, ప్రత్యేకించి కళలపై దృష్టి సారిస్తుంది, తద్వారా వ్యాపారం, మేధో సంపత్తి హక్కుల ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తుంది. ఇది చేతివృత్తుల రంగం, సేవల రంగం, పారిశ్రామిక రంగాల మధ్య ఒక కీలకమైన కూడలిగా పనిచేస్తుంది. సామాజిక చేరికను, సాంస్కృతిక వైవిధ్యాన్ని, మానవ అభివృద్ధిని ప్రోత్సహిస్తూ ఆదాయ ఉత్పత్తిని, ఉద్యోగాల సృష్టిని, ఎగుమతి ఆదాయాలను గణనీయంగా పెంచుతుంది. వ్యక్తిగత సృజనాత్మకత, ప్రత్యేక నైపుణ్యం, విశిష్ట ప్రతిభ ఆధారంగా అభివృద్ధి చెందే విభిన్న పరిశ్రమల సమాహారమిది. మేధో సంపత్తి ద్వారా ఇది ఆర్థిక విలువను సృష్టిస్తుంది.

హస్తకళలు, చిత్రలేఖనం, శిల్పకళ, సంగ్రహాలయాలు, చారిత్రక ప్రదేశాలు వంటి కళలు సాంస్కృతిక వారసత్వంలో భాగం; సంగీతం, నృత్యం, నాటకం, ఒపేరా వంటి ప్రదర్శన కళలు; పుస్తకాలు, వార్తాపత్రికలు, మ్యాగజీన్‌లు, రేడియో, టెలివిజన్ వంటి మీడి యా ప్రచురణలు; చలనచిత్రాలు, యానిమేషన్, డాక్యుమెంటరీలు, వీడియో కంటెంట్; ఆర్కిటెక్చర్, డిజైన్, గ్రాఫిక్ డిజైన్, ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్, ప్రకటనలు, మార్కెట్ పరిశోధన; కంప్యూటర్ గేమ్స్, సాఫ్ట్‌వేర్ డిజైన్, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ వంటి విభిన్న రంగాలు ఈ వ్యవస్థలో అంతర్భాగంగా ఉన్నాయి.

డిజిటల్ విప్లవం, అంతర్జాల వ్యాప్తి సృజనాత్మక ఉత్పత్తులు, సేవలు ప్రపంచవ్యాప్తంగా మరింత వేగంగా చేరుకోవడానికి మార్గం సుగమం చేశాయి.

**ప్రపంచంలో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ స్థితి:**

సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను అంచనా వేయడం ఆర్థిక సహకారం, ఉపాధి అవకాశాలు, సృజనాత్మక కార్యకలాపాలలో సామాజిక భాగస్వామ్యం వంటి అనేక అంశాలతో ముడిపడి ఉంటుంది. యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యుఎన్‌సిటిఎడి) క్రియేటివ్ ఎకానమీ ఔట్‌లుక్ 2024 నివేదిక ప్రకారం, 2022లో సృజనాత్మక సేవలలో ప్రపంచ వాణిజ్యం $1.4 ట్రిలియన్లకు చేరుకుంది, ఇది 2017 నుండి 29% వృద్ధిని సూచిస్తుంది. సృజనాత్మక వస్తువుల ఎగుమతులు కూడా 19% పెరిగి మొత్తం $713 బిలియన్లకు చేరుకున్నాయి. మొత్తంగా, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం వార్షికంగా $2 ట్రిలియన్లకు పైగా ఆదాయాన్ని ఉత్పత్తి చేస్తోంది, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50మిలియన్ల ఉద్యోగాలకు మద్దతునిస్తోంది. ఈ రంగానికి ప్రధాన సహకారులుగా సాఫ్ట్‌వేర్ సేవలు (41.3%), పరిశోధన మరియు అభివృద్ధి (30.7%), ప్రకటనలు మరియు మార్కెట్ పరిశోధన నిర్మాణం (15.5%) ఉన్నాయి. కోవిడ్19 మహమ్మారి అనంతర కాలంలో డిజిటలైజేషన్ వేగవంతం కావడంతో ఈ రంగం మరింత ఊపందుకుంది. ఈ గణాంకాలు సృజనాత్మకత ఎంత శక్తివంతమైన ఆర్థిక వనరుగా మారిందో స్పష్టం చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలతో పాటు, అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఈ రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకుంటున్నాయి.

**భారతదేశానికి ఎందుకు కీలకం?**

భారతదేశం అపారమైన సాంస్కృతిక వారసత్వం, విభిన్నమైన కళారూపాలు, నైపుణ్యం కలిగిన హస్తకళాకారులతో ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. మన దేశంలో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తూ ప్రస్తుతం దాని విలువ $30 బిలియన్లుగా ఉంది, దేశ స్థూల జాతీయోత్పత్తికి దాదాపు 2.5% తోడ్పడుతుంది, 8% మంది శ్రామిక శక్తికి జీవనోపాధిని కల్పిస్తోంది. ఒక్క ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ రంగం విలువ 3,375 కోట్ల రూపాయలుగా ఉంది. రెండు లక్షలకు పైగా పూర్తిసమయ కంటెంట్ సృష్టికర్తలు ప్రపంచ వేదికపై భారతదేశ ఉనికిని చాటుతున్నారు. గౌహతి, కొచ్చి, ఇండోర్ వంటి నగరాలు దేశవ్యాప్తంగా వికేంద్రీకృత సృజనాత్మక విప్లవానికి ఊతమిస్తూ సృజనాత్మక కేంద్రాలుగా ఎదుగుతున్నాయి. ఇది కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే కళాకారులు, హస్తకళాకారులకు కూడా ఉపాధి అవకాశాలను అందిస్తోంది. ముఖ్యంగా యువతకు, మహిళలకు ఇది విశేషమైన అవకాశాలను కల్పిస్తోంది, పర్యాటకం వంటి అనుబంధ రంగాలను కూడా ప్రోత్సహిస్తుంది. మన సృజనాత్మక ఉత్పత్తులు, సేవలకు అంతర్జాతీయ మార్కెట్‌లో గణనీయమైన డిమాండ్ ఉంది, సరైన విధానాలు అనుసరిస్తే, ఇది మన ఎగుమతులను గణనీయంగా పెంచగలదు.

**సవాళ్లు:**

ఈ రంగం ప్రధానంగా అసంఘటిత రంగంగా కొనసాగుతోంది. చిన్న తరహా హస్తకళాకారులు, కళాకారులు సరైన ప్రోత్సాహం, మార్కెటింగ్ మద్దతు లేకుండా తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ఈ ఆర్థిక వ్యవస్థను సమగ్రంగా గుర్తించి, ప్రోత్సహించడానికి ఒక స్పష్టమైన, ఏకీకృత జాతీయ విధానం లేకపోవడం ఒక పెద్ద లోటు. చిన్న సృజనాత్మక సంస్థలు, వ్యక్తులు పెట్టుబడి పొందడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, బ్యాంకులు సాధారణంగా సృజనాత్మక ప్రాజెక్టులకు ఆర్థికంగా మద్దతు ఇవ్వడానికి వెనుకాడుతున్నాయి. కాపీరైట్ ఉల్లంఘనలు (పైరసీ), పేటెంట్, ట్రేడ్‌మార్క్‌ల ఉల్లంఘనలు సృజనకారుల ఆదాయాన్ని, ప్రోత్సాహాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి, బలహీనమైన చట్ట అమలు ఒక ప్రధాన సమస్య. సృజనాత్మక కార్యకలాపాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అందుబాటులో లేవు. సాంప్రదాయ కళారూపాలలో నైపుణ్యం ఉన్నప్పటికీ, డిజిటల్ యుగానికి అవసరమైన నూతన నైపుణ్యాలు తగినంత సంఖ్యలో లేవు. స్థానిక, అంతర్జాతీయ మార్కెట్లకు సృజనాత్మక ఉత్పత్తులను అనుసంధానం చేయడంలో అనేక ఇబ్బందులు ఉన్నాయి, సరైన మార్కెటింగ్, బ్రాండింగ్ వ్యూహాలు లేకపోవడం ఒక పెద్ద లోటు. అంతేకాకుండా ఈ రంగం యొక్క కచ్చితమైన పరిధి, ఆర్థిక సహకారం, ఎగుమతులు, దిగుమతులపై సమగ్రమైన, నిరంతర గణాంకాలు ఇంకా అందుబాటులో లేవు, ఈ డేటా కొరత విధానాల రూపకల్పనకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది.

**సవాళ్లను అధిగమించడం:**

సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను ఒక కీలకమైన రంగంగా గుర్తించి దాని అభివృద్ధికి ఒక సమగ్రమైన జాతీయ విధానాన్ని రూపొందించాలి. ఇది వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించాలి. సృజనాత్మక ప్రాజెక్టుల కోసం ప్రత్యేక నిధులు, గ్రాంట్లు, సులభ వడ్డీకి రుణాలు అందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వెంచర్ క్యాపిటల్, ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులను ఈ రంగంలోకి ఆకర్షించాలి. కఠినమైన చట్టాలు రూపొందించి, వాటిని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా పైరసీని అరికట్టాలి. సృజనకారులకు వారి హక్కులపై అవగాహన కల్పించాలి. సృజనాత్మక కేంద్రాలు, ఇంక్యుబేటర్లు, సహోద్యోగ స్థలాలు, ప్రదర్శన వేదికలు, డిజిటల్ ల్యాబ్‌లను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయాలి. సాంప్రదాయ నైపుణ్యాలతో పాటు, డిజిటల్ కంటెంట్ క్రియేషన్, గ్రాఫిక్ డిజైన్, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ అందించే ప్రత్యేక కోర్సులను రూపొందించాలి. పాఠశాల స్థాయి నుంచే సృజనాత్మకతను ప్రోత్సహించాలి. సృజనాత్మక ఉత్పత్తులను ప్రదర్శించడానికి, విక్రయించడానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లను ప్రోత్సహించాలి. అంతర్జాతీయ ప్రదర్శనలలో పాల్గొనడాన్ని సులభతరం చేయాలి. ఈ రంగంపై సమగ్రమైన, కచ్చితమైన డేటాను సేకరించడానికి, విశ్లేషించడానికి ఒక పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. భవిష్యత్తులో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ మరింత కీలక పాత్ర పోషించనుంది. డిజిటలైజేషన్, కృత్రిమ మేధస్సు, వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి సాంకేతికతలు సృజనాత్మక ప్రక్రియలను, పంపిణీని సమూలంగా మార్చివేయనున్నాయి, ఇది అనేక నూతన అవకాశాలను సృష్టిస్తుంది.

**'వికసిత్ భారత్' కు చోదక శక్తి:**

సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ కేవలం కళలు, సంస్కృతికి పరిమితం కాదు. ఇది ఆర్థికాభివృద్ధికి, లక్షలాది మందికి ఉపాధి కల్పనకు, దేశ గౌరవాన్ని పెంచే శక్తిమంతమైన సాధనం. మన సాంస్కృతిక శక్తిని, యువత నైపుణ్యాలను ఉపయోగించి ఆర్థికంగా ఎదగవచ్చు. ఇది సామాజిక సమ్మిళితత్వానికి, ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పడుతూ 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

# నాట్యంతో విద్య, వినోదం, అద్భుత అనుభూతులు!



నాట్యం ఓ విశ్వ భాష. ప్రపంచ ప్రజలను ఏకం చేయగల శక్తివంతమైన సాంస్కృతిక సాధనం. నాట్యాన్ని మెచ్చని నరులుండరు. నాట్యం చేయడానికి వేదికను ఎక్కడం లేదా నాట్యాన్ని వీక్షించడానికి కళాభిమానిగా ప్రేక్షకుల్లో ఉంటూ కళను ఆస్వాదించడం తరుచుగా చేస్తున్నాం. ఒక మహాద్భుత అనుభూతిని, ప్రేరణను, అమితానందాన్ని అందిస్తున్నది నాట్య కళ. వివిధ ప్రాంతాల, దేశాల ప్రజలు వేరు వేరు నాట్య రూపాలను ప్రోత్సహిస్తున్నారు లేదా ప్రచారం చేస్తూ ప్రదర్శనలు ఇస్తున్నారు. నాట్య కళ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఏట 29 ఏప్రిల్ రోజున విశ్వవ్యాప్తంగా అంతర్జాతీయ నాట్య దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ డాన్స్ డేను యునెస్కోతో కలిసి ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా 1982 నుంచి నిర్వహించడమే ఆనవాయితీగా మారింది. ప్రపంచ ప్రఖ్యాత నాట్య కళాకారులు జీన్స్ జార్జెస్ నవ్వేరీ జన్మదినం సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు.

**నాట్యకళకు 9,000 ఏండ్ల చరిత్ర:**

స్వయం ప్రకటనకు నిలువెత్తు నిదర్శనం నాట్యం మాత్రమే. దాదాపు 9,000 ఏండ్ల క్రితమే ప్రారంభమైన నృత్య కళ నేడు అంతర్జాతీయ స్థాయి లో కూడా ప్రజల మన్ననలు పొందుతున్నది. సాంస్కృతిక సరిహద్దులు చెరుపుతూ విశ్వవ్యాప్తం కావడం, వైవిధ్యభరితమైన మానవాళిని ఒకే వేదికపైకి తీసుకురావడం, కళాభిమానులకు మానసిక ప్రశాంతతను చేకూర్చడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన నాట్యకళ ఆనందాలు పంచుతూ దేహం, మనసు, హృదయం, ఆత్మలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. నాట్యం ద్వారా వ్యక్తిగత అభినయం, శరీర భాగాల సమన్వ యం, భావోద్వేగాలను ఆకర్షణీయంగా వ్యక్తీకరించడం, మానసిక ఒత్తిడిని తగ్గించడం జరుగుతుంది.

**భారతంలో వైవిధ్యభరిత నాట్యకళ:**

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్న సువిశాల భారతంలో ఎన్నో శాస్త్రీయ, జానపద నాట్యాలు ప్రజాదరణను పొందాయి. భారత సంగీత అకాడమీ గుర్తించిన ఎనిమిది శాస్త్రీయ నృత్య కళల్లో భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, కథక్, ఒడిసి, మోహినీయాట్టం, మణిపురి, సత్రియాలు వస్తాయి. భారత దేశవ్యాప్తంగా 29 జానపద నాట్య కళారూపాలను గుర్తించినప్పటికి రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుళ ప్రచారం పొందిన జానపద నాట్యాల్లో విలాసిని, భామాకలాపం, వీర నాట్యం, డప్పు, తప్పెటగుళ్లు, లంబాడి, ధింసా, కోలాటం, పేరిణి, బుర్ర కథ, గుస్సాడి, చిందుల బాగోతం, బుట్ట బొమ్మలు, బోనాలు లాంటివి ఉన్నాయి. డిజిటల్ యుగంలో నాట్య కళను సజీవంగా కొనసాగించడానికి ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థలు, స్వచ్ఛం ద సంస్థ లు చొరవ చూపాలి. నాట్యకళను యువతలో ప్రోత్సహించాలి. నాట్య కళాకారులను తగు రీతిలో గుర్తించడం, చిన్నారులకు నాట్య శిక్షణ ఇప్పించడం, నాట్య కళాశాలలను ఏర్పాటు చేయడం, నాట్య శిక్షణ ఇచ్చే గురువులను ప్రోత్సహించడం, నాట్య కళ పట్ల సమాజంలో చిన్న చూపును రూపుమాపడం లాంటి చర్యలు తీసుకొని మన నాట్యకళా వారసత్వ సంపదను రాబోయే తరానికి అందించే ప్రయత్నా లు జరగాలి.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# అవినీతికి తావులేకుండా అర్హులకే ఉద్యోగాలు

లేఖ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించే వేల ఉద్యోగాలకు లక్షలాది మంది యువత క్రమం తప్పకుండా దరఖాస్తు చేసుకుంటున్నారు.వీరిలో చాలామందికి అవసరమైన అర్హత కంటే ఎక్కువ విద్యార్హతలు కలిగిన వారే ఎక్కువ మంది ఉన్నారు. కఠినమైన పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి పల్లెటూర్ల నుంచి రైతు కుటుంబాల యువత నగరాలకు రావడం జరుగుతుంది.ఊర్లో వ్యవసాయం గిట్టుబాటు కాక, పండించిన రైతుకు నష్టాలు రావడంతో విసుగు చెందిన రైతులు తమ పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని ఆశతో పిల్లలను నగరాలకు పంపుతున్నారు. లక్షలాది రూపాయలు ఇచ్చి కోచింగ్ సెంటర్లకు హాజరు అవుతున్నారు.

పేపర్ లీకులు కావడం, స్వార్థపరులు చేసే అవినీతి వలన పరీక్షలు,నియామకాలు రద్దు కావడం మన వ్యవస్థలో ఉన్న లోపాలను బహిర్గతం పరుస్తున్నాయు.

2016 సంవత్సరంలో పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 25,753 మంది టీచింగ్,నాన్ టీచింగ్ ఉద్యోగాల నియామకాలు జరిగాయి.ఇట్టి నియామకాల్లో 400 కోట్ల రూపాయలకు పైగా అవినీతి కుంభకోణం ఆరోపణల ఆధారంగా సుప్రీం కోర్టు ఈ నియామకాలు రద్దు చేసింది. ఈ కుంభకోణంలో అభ్యర్థుల గుర్తింపు కార్డులను నకిలీ చేయడం,స్కోర్ మార్కు లను మార్చి వేయడం, ఓ ఎం ఆర్ షీట్లను మార్చడంలో అధికారులకు లంచాలు చెల్లించడం లాంటి ఆరోపణలు ఉన్నాయి.

ఇలాంటి ఉద్యోగ నియామకాల్లో ఉద్యోగం పొందని వారు ఆత్మ హత్యలకు పాల్పడటం జరుగుతుంది. ప్రభుత్వాలు ఉద్యోగ నియామకాల్లో అవినీతికి తావులేకుండా అర్హత పొందిన వారికే ఉద్యోగం ఇవ్వాలి.

ఆళవందార్ వేణు మాధవ్

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## నేడు కేంద్ర కేబినెట్

**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుసగా కీలక భేటీలు నిర్వహిస్తోంది. ఇప్పుడు తొలిసారిగా కేంద్ర మంత్రివర్గం బుధవారం భేటీ కానుంది. దీనికి ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షత వహించనున్నారు. కాగా ఉగ్రదాడి జరిగిన తరువాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన తొలిసారి గత బుధవారం ఢిల్లీలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఎస్) పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నరమేధానికి పాల్పడిన ముష్కరులను శిక్షించడంతో పాటు వారిని ఎగదోస్తున్న శక్తులనూ బాధ్యులుగా నిలబెడతామంటూ పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించింది. సీమాంతర ఉగ్రవాదాన్ని వీడే వరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. దౌత్య సంబంధాల స్థాయినీ తగ్గించింది. సింధూ జలాల ఒప్పందం అమలును తక్షణమే నిలిపివేసింది. సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయిన సంగతి తెలిసిందే. పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది.

# పాత వీడియోలతో తప్పుడు పోస్టులు

### పహల్గామ్ దాడి నేపథ్యంలో పెద్ద ఎత్తున ఫేక్ పోస్టులు

**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత తప్పుడు సమాచారం వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వం 16 పాకిస్థానీ యూట్యూబ్ ఛానెళ్లను బ్లాక్ చేసింది. అయితే, ధృవీకరించని అనేక పోస్టులు తప్పుడు, రెచ్చగొట్టే కథనాలను వ్యాప్తి చేస్తున్నందున సోషల్ మీడియా వేదికలపై నకిలీ వార్తల వరద కొనసాగుతోంది. ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పిటిఐ) తనిఖీ విభాగం విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న 10 వాదనలను పరిశీలించింది. వీటిలో తొమ్మిది ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో ఒకటి ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్నాయి. ఈ పోస్టుల్లు ఏప్రిల్ 22న కాశ్మీర్‌లో జరిగిన విషాదం తర్వాత పెరిగిన ఉద్రిక్తతలు, ప్రతీకార దాడులు, అంతర్గత అశాంతిని తప్పుగా చిత్రీకరించాయి. ఈ ఘటనలో 26 మంది మరణించారు.

**ఈ 10 వాదనలు కూడా తప్పుదోవ పట్టించేవి లేదా పూర్తిగా అవాస్తవమైనవిగా తేల్చారు.**

**ఒకటి:** పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్(పిఒకె)లో లీపా వ్యాలీలో భారత సైన్యానికి చెందిన రెండు చెక్‌పోస్టులను పాకిస్తాన్ సైన్యం ధ్వంసం చేసిందని ఒక వైరల్ మెసేజ్ తెలిపింది. ఈ పోస్టులతో పాటు కొండల్లో మంటలు చెలరేగుతున్న చిత్రం ఉంది. ఈ చిత్రాన్ని 2025లో ఉత్తర ఐర్లాండ్‌లోని మౌర్నే పర్వతాలలో జరిగిన కార్చిచ్చుకు సంబంధించిందిగా పిటిఐ పరిశీలనలో గుర్తించింది. ఇది ఎలాంటి సైనిక చర్యకు సంబంధించినది కాదు. ఏప్రిల్ 27న 'పాకిస్తాన్' అనే పేరుతో ఉన్న 'ఎక్స్' వినియోగదారుడు షేర్ చేసిన ఈ ఫోటో ఇప్పటివరకు 54,000 వ్యూస్‌ను పొందింది, మరో 61 మంది వినియోగదారులు దీనిని రీపోస్ట్ చేశారు.

**రెండు:** పాకిస్తాన్‌తో వ్యవహరించడానికి నిరాకరించారనే ఆరోపణలపై ఒక భారతీయ విలేఖరి ఆర్మీ అధికారులను నిలదీస్తున్నట్లుగా ఉన్న మరో వీడియో ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. అయితే, ఈ దృశ్యాలు పటియాలాలో కల్నల్ దాడి కేసులో పంజాబ్ పోలీసు డిజిపి గౌరవ్ యాదవ్ , వెస్టర్న్ కమాండ్ హెడ్‌కార్వర్ట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ మోహిత్ వాధ్వా మార్చి 2025లో నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశానికి సంబంధించినవి. పంజాబోబ్‌లోని పటియాలాలో మార్చి 13,14 మధ్య రాత్రి పార్కింగ్ వివాదంపై కల్నల్ పుష్పిందర్ సింగ్ బాత్ ,ఆయన కుమారుడు అంగద్ సింగ్ బాత్‌లపై పోలీసు సిబ్బంది దాడి చేశారని ఆరోపించారు.

**మూడు:** నియంత్రణ రేఖ (ఎల్‌ఒసి) వెంబడి పాకిస్తాన్ సైనిక పోస్టులు భారీ నష్టాలను చవిచూశాయని ఒక పోస్ట్ ఆరోపించింది, దీనికి షెల్లింగ్ దృశ్యాలు జత చేశారు. ఈ వీడియో మే 2023 నాటిదని తేలింది. ఇది పాకిస్తాన్‌లో ఇమ్రాన్ ఖాన్ విడుదల కోసం డిమాండ్ చేస్తూ జరిగిన నిరసనల సమయంలో భద్రతా దళాలు, పాకిస్తాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పిటిఐ) మద్దతుదారుల మధ్య జరిగిన ఘర్షణలను చూపుతోంది.

**నాలుగు:** జమ్మూ కాశ్మీర్‌లో భారత సైన్యం అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుని వారి ఇళ్లను కూల్చివేసిందనే వాదనలు కూడా అవాస్తవమని తేలింది. ఈ నిర్మాణాలు ఈ ప్రాంతంలో పనిచేస్తున్న పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదులతో సంబంధం కలిగి ఉన్నాయని వార్తా దృశ్యాలు, నివేదికలు నిర్ధారించాయి.



**ఐదు:** పర్వతాలలో పేలుడును చూపే ఒక వీడియోను పాకిస్తాన్ సైన్యం సరిహద్దులోని భారత వైపు ఉన్న భారత సైనిక పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేసిందని పేర్కొంటూ షేర్ చేశారు. అయితే, ఈ వీడియో 2020 నుండి ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉందని, ఎల్‌ఓసి వెంబడి పాకిస్తాన్ సైన్యం చేసిన దాడికి సంబంధం లేదని దర్యాప్తులో తేలింది.

**ఆరు:** ఎల్‌ఓసి వద్ద ఇటీవల నలుగురు భారతీయ సైనికులు మరణించారని తప్పుగా పేర్కొన్న ఒక చిత్రం వాస్తవానికి 2020లో కాశీర్‌లోని హంద్వారా ప్రాంతంలో జరిగిన ఆపరేషన్‌కు సంబంధించినది. ఆ 18 గంటల పాటు జరిగిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో ఒక కల్నల్, ఒక మేజర్ , ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్‌లతో సహా ఐదుగురు భద్రతా సిబ్బంది , ఇద్దరు గుర్తు తెలియని ఉగ్రవాదులు మరణించారు.

**ఏడు:** సింధు జలాల ఒప్పందం ఉల్లంఘనకు ప్రతిస్పందనగా చైనా భారతదేశానికి నదులను అడ్డుకుంటుందనే నిరాధారమైన ఆరోపణకు ఎటువంటి విశ్వసనీయ మూలం లేదు. నిజనిజాల తనిఖీ బృందం ప్రముఖ భారతీయ, పాశ్చాత్య వార్తా వెబ్‌సైట్లను పరిశీలించింది. అయితే ఈ వాదనను సమర్థించే ఎటువంటి సమాచారం లేదా వార్తా కథనాలు కనుగొనబడలేదు.

**ఎనిమిది:** పహల్గామ్ దాడికి భద్రతా లోపాలను నిందిస్తూ ఒక సీనియర్ భారతీయ ఆర్మీ అధికారి మాట్లాడుతున్నట్లుగా ఉన్న ఒక కల్పిత వీడియో విస్తృతమైన ప్రాచుర్యం పొందింది. పిటిఐ సంప్రదించిన ఒక సీనియర్ ఆర్మీ అధికారి ఆ వీడియో నకిలీదని ధృవీకరించారు.

**తొమ్మిది:** ఒక క్షిపణి భవనాన్ని ఢీకొడుతున్న దృశ్యాన్ని పిఒకేలో భారత చర్యగా తప్పుగా ఆపాదించారు. ఇది వాస్తవానికి 2024లో లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు సంబంధించిన దృశ్యాలు.

**పది:** భారత వైమానిక దళం భారతీయ పౌరులపై సర్జికల్ స్ట్రైక్స్ చేసిందని, దీనివల్ల ప్రాణనష్టం జరిగిందని ఒక వీడియో పేర్కొంది. వాస్తవానికి, 2025 ఏప్రిల్ 25న, మధ్యప్రదేశ్‌లో ఐఎఎఫ్ విమానం నుండి పేలుడు లేని డ్రాప్ ట్యాంక్ అనుకోకుండా పడిపోయింది. దీనివల్ల ఒక ఇల్లు దెబ్బతింది, కానీ ఎవరికీ గాయాలు కాలేదు. ఈ విషయాన్ని స్థానిక జిల్లా యంత్రాంగం ధృవీకరించింది. వాస్తవ తనిఖీ బృందం వీడియో, ఫోటో మెటాడేటా విశ్లేషణ, రివర్స్ ఇమేజ్ సెర్చ్‌లు, ధృవీకరించబడిన వార్తా నివేదికలతో క్రాస్ రెఫరెన్స్, వాదనలు, మూలాలు, ప్రామాణికతను నిర్ధారించడానికి క్షేత్రస్థాయిలోని మూలాలతో సంప్రదింపులపై ఆధారపడింది. ఇలాంటి వాదనలను ఈ బృందం చురుకుగా పరిశీలిస్తుంది. పరిశీలన అభ్యర్థనల కోసం వాట్సాప్‌లో +918130503759 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# పార్లమెంట్‌ను సమావేశపర్చండి

### ప్రధాని మోదీకి ఖర్గే, రాహుల్ లేఖలు



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రవాద దాడిపై చర్చించడానికి, సమష్టిగా మన సంకల్పాన్ని చాటేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారు. గత వారం పహల్గామ్‌లో పర్యాటకులపై పాశవికంగా ఉగ్రవాదుల దాడి చేయడంతో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత పలువురు ప్రతిపక్ష ఎంపిల నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు వ్యక్తవుతున్నాయి. ఈ దాడి ప్రజల్లో తీవ్ర రేకెత్తించింది. కాగా, ఐక్యత, సంఘీభావం అవసరమైనతరుణంలో పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని వీలైనంత త్వరగా ఏర్పాటు చేయడం ముఖ్యమని ప్రతిపక్షాలు విశ్వసిస్తున్నాయని ఖర్గే ప్రధానమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో అమాయక పౌరులపై జరిగిన క్రూరమైన ఉగ్రవాద దాడిని ఎదుర్కోవడానికి మన సమష్టి సంకల్పం, సంకల్ప శక్తికి ఇది బలమైన చాటింపు అవుతుందన్నారు. అందువల్ల పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తారని తాము ఆశిస్తున్నామని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. అదే విధంగా రాహుల్ గాంధీ కూడా ఇదే అభ్యర్థనతో మోడీకి ఒక లేఖ రాశారు. పహల్గామ్ విషాదం ప్రతి భారతీయుడిని ఆగ్రహానికి గురిచేసిందని అన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఎల్లప్పుడూ కలిసి ఉంటామని అందరికీ తెలియజేయాలన్నారు. పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షం భావిస్తుందని, దీంతో సభలో ప్రజాప్రతినిధులు తమ ఐక్యత దృఢ సంకల్పాన్ని చాటి చెబుతారన్నారు. వీలైనంత త్వరగా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞపి చేస్తున్నామన్నారు. ఎక్స్‌లో ప్రధానికి రాసిన లేఖను రాహుల్‌గాంధీ షేర్ చేస్తూ... ఈ క్లిష్ట సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మనం ఎల్లప్పుడూ కలిసి నిలబడతామని అందరికీ తెలియజేయాలన్నారు. అయితే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. సమావేశాలు ఏర్పాటు చేసే అవకాశాన్ని వర్గాలు తోసిపుచ్చాయి. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఉభయ సభలలోని ప్రతిపక్ష నాయకుల లేఖలను షేర్ చేశారు. 'ఇది మన దేశ చరిత్రలో చాలా సున్నితమైన క్షణం. 'మనం ఐక్యత, సంఘీభావం, సంఘటిత సంకల్పం, పరిస్థితిని ఎదుర్కోవడానికి సమష్టి సంకల్పం ప్రదర్శించాలి. లోక్‌సభ, రాజ్యసభ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించడం కంటే మెరుగైన మార్గం ఏమిటి' అని రమేష్ పిటితో మాట్లాడుతూ ప్రశ్నించారు. రాజకీయ సంస్థలకు పార్లమెంట్‌కు సుప్రీం అని, గతంలో కూడా పార్లమెంట్ సమావేశాలు ప్రత్యేకంగా సమావేశమయ్యాయని, ఇప్పుడే కొత్త కాదన్నారు. ఇది రాజకీయ చర్చకు, ఘర్షణలకు సందర్భం కాదన్నారు. ప్రజలు ఆందోళనకు, వేదనకు గురవుతురని చెప్పారు. పహల్గామ్‌లో జరిగింది బాధాకరమైన సంఘటన, ఇది మొత్తం దేశాన్ని ప్రభావితం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అఖిలపక్ష సమావేశం జరిగినా ప్రధాని హాజరు కాలేదన్నారు.

# కశ్మీర్‌లో 48 పర్యాటక కేంద్రాలు మూసివేత

### మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశమున్న నేపథ్యంలో మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన

**శ్రీనగర్ :** పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి తర్వాత భారత భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ముష్కరులను పట్టుకునేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈక్రమంలో కశ్మీర్‌లో మరిన్ని ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. పహల్గామ్ దాడి అనంతరం కశ్మీరీ లోయలో స్లీపర్ సెల్స్ యాక్టివేట్ అయినట్లు తెలిపాయి. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత జమ్ముకశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాదుల ఇళ్లను సైన్యం పేల్చేస్తుండడంతో దానికి ప్రతీకారంగా వారు పెద్దఎత్తున దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని.. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే భద్రతా బలగాలకు సమాచారం ఇవ్వాలని సూచించాయి. దీంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కశ్మీర్ వ్యాప్తంగా ఉన్న మొత్తం 87 టూరిస్టు కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కశ్మీర్‌లోని ప్రధాన ప్రదేశాలు గుల్మార్గ్, సోనామార్గ్ దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన పర్యాటక ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించాయి. ఏప్రిల్ 22న పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. దీంతో అక్కడినుంచి పర్యాటకులను ప్రత్యేక విమానాల్లో తరలించి.. ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం మళ్లీ పర్యాటకులు కశ్మీర్‌కు వస్తున్న నేపథ్యంలో నిఘా వర్గాలు తాజా హెచ్చరికలు చేశాయి. పహల్గామ్ ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పలు వీడియోలు, సమాచారం అందడంతో వాటి ఆధారంగా.. ఉగ్రవాదులను గుర్తించడానికి విచారణను వేగవంతం చేసింది.

### కశ్మీరులో ఉగ్రవాదాన్ని విస్తరించడానికి

# పాక్ సైన్యంలో శిక్షణ

### పహల్గామ్ ఉగ్రదాడిలో హషిమ్ ముసా కీలకపాత్ర

### ప్రధాన నిందితుడుతోపాటు నలుగురి ప్రత్యక్షహస్తం

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ సైన్యమే ఉగ్రవాదులను పెంచిపోషిస్తోందని చెప్పడానికి మరో బలమైన సాక్ష్యం లభించింది. పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిగిన కాల్పుల దాడిలో హషిమ్ ముసాను ప్రధాన ఉగ్రవాదిగా సందేహిస్తున్నారు. లష్కరే తోయిబా ఉగ్రవాదసంస్థలో చేరి కశ్మీరు ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాలు ఉద్ధృతం చేసి సంస్థను పటిష్టం చేయాలని పాకిస్థాన్ సైన్యం చేసిన విజ్ఞప్తి మేరకు ముసా భారత్‌లోకి జొరబడి ఉంటాడని భద్రతావర్గాలు తెలియజేశాయి. పహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో ముసాతోపాటు అలీభాయ్, ఇద్దరు స్థానికులు ఆదిల్ థోకెర్, ఆసిఫ్ షేక్‌లకు ప్రత్యక్ష జోక్యం ఉందని ఎన్‌ఐఎ దర్యాప్తు అధికారులు ధృవీకరించారు. మరింతమంది ఉగ్రవాదులకు ఈ దాడితో సంబంధం ఉందని ఇంటరాగేషన్ సందర్భంగా వాస్తవాలు వెల్లడయ్యాయి.

అసలు హషిమ్ ముసా ఎవరంటే, పాకిస్థాన్ మాజీ సైనికుడు. పాకిస్థాన్ సైన్యంలో ఉన్న ప్రత్యేక దళం సోల్జర్‌గా పనిచేశాడని గుర్తించారు. ఐతే హషిమ్ ముసా నిషేధిత లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థలో చేరాడు. అంతడు అందులో చేరిన తర్వాత తమకు ఎలాంటి సంబంధం లేదని అతడు తమ సైన్యంలో పనిచేయలేదనీ పాకిస్థాన్ వర్గాలు తిరస్కరిస్తున్నాయి. 2023 సెప్టెంబరునెలలో అతగాడు భారత్‌లోకి జొరబడ్డాడు. శ్రీనగర్ సమీపంలోని కశ్మీర్ బుద్గామ్‌జిల్లాలో ప్రాథమిక కార్యకలాపాలు నిర్వహించడం నిమిత్తం వచ్చాడు. పాకిస్థాన్ సైన్యంలో బాగా శిక్షణ పొందిన ముసా సంప్రదాయేతర యుద్ధరీతులలో నిపుణుడనీ, పారా కమాండో శిక్షణ పొందాడనీ బలంగా భావిస్తున్నారు. ఈ విధంగా శిక్షణపొందినవారు మాత్రమే అత్యాధునిక ఆయుధాలను అలవోకగా ఉపయోగించగలశక్తిసామర్థ్యాలు కలిగి ఉంటారు. చాలా ఉద్రిక్త పరిస్థితుల్లో చేయి చేయి కలిపి యుద్ధం చేయడానికి, సంక్లిష్ట సమయాల్లో బతకడానికి తగిన నైపుణ్యాలను పాటించగలశక్తిసామర్థ్యాలు వారికి ఉంటాయని భద్రతాఅధికారి ఒకరు చెప్పారు. పాకిస్థాన్ ఆర్మీ స్పెషల్ సర్వీస్ గ్రూపు (ఎస్‌ఎస్‌జి)నకు చెందిన ముసా లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థలో చేరి కశ్మీరుకు వచి పహల్గామ్‌లో హింసాకాండ సృష్టించాడు. ఉగ్రవాదులకు డబ్బు, ఆహారం, ఆవాసం, సైనికుల కదలికలు గురించి చెబుతూ సహాయ సహకారాలు అందించిన (ఓజిడబ్ల్యు) 14 మంది కశ్మీరు వ్యక్తులను విచారణ చేసినప్పుడు పాకిస్థాన్ ఆర్మీ స్పెషల్ సర్వీస్ గ్రూపు హస్తం గురించి బయటపడింది. పాకిస్థానీ ఉగ్రవాదులకు ఈ ఓజిడబ్ల్యులు అవసరమైనవన్నీ సమకూర్చారనీ, హింసాకాండ సృష్టించిన ప్రదేశం గురించిన వివరాలు తెలియడంలో సహకరించారని భావిస్తున్నారు. పాకిస్థాన్ సైన్యం పాత్ర, ఐఎస్‌ఐ పాత్ర ఇప్పుడు ప్రత్యక్షంగా కళ్ళకు కట్టినట్టు కనిపిస్తోందని భద్రతావ్యవస్థ వర్గాలు తెలియజేశాయి. 2024 అక్టోబరులో కశ్మీరులోయలో ఆరుగురు స్థానికేతరులు హతులయ్యారు. వీరిలో ఒక వైద్యుడు, ఇద్దరు భారత సైనికులు, మరో ఇద్దరు ఆర్మీ పోర్టర్లు ఉన్నారు. 2024లో జరిగిన మూడు దాడులలోనూ ముసా కూడా పాల్గొన్నాడు. ఓజిడబ్ల్యుల ద్వారా స్థానికంగా అన్ని రకాలుగా సహాయం పొంది గత ఏడాదిలో కూడా ఇలాగే ఉగ్రవాదులు దాడులకు పాల్పడ్డారు. దాడికి అవసరమైన ఆయుధాలను రవాణా చేయడంలో అన్నివిధాలుగా ఓజిడబ్ల్యుల ద్వారా సహాయం పొందారనీ, ఓజిడబ్ల్యులు కూడా ఈ పహల్గామ్ దాడిలో భాగస్వాములయ్యారని ఎన్‌ఐఎ ఇన్వెస్టిగేటర్లు ధృవీకరించారు. స్థానికులే ఈ ఉగ్రవాదుల బృందానికి మార్గదర్శకంగా మారారు. ఆవాసం సమకూర్చారు. ఇతర సహాయం అందించారు.



# పర్యాటకుల భద్రతపై లోపాలను ఎత్తిచూపిన అఖిలేశ్



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై సమాజ్‌వాది పార్టీ (ఎస్పి) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విమర్శలు సంధించారు. పర్యాటులకు భద్రత లోపించడంపై ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వం ప్రజా భద్రత కంటే విఐపి రక్షణకు ప్రాధాన్యత ఇస్తోందని ఆయన ఆరోపించారు.ఉగ్రదాడి నుంచి బయటపడిన పర్యాటకుల ఆందోళనను అఖిలేష్ ఎక్స్‌లో వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఉన్న ప్రజలను రక్షించడానికి ఎవరూ ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. సోషల్ మీడియా పోస్ట్‌లో ప్రభుత్వ భద్రతా విధానాలను ఆయన ప్రశ్నించారు. పిఎంఐ అధికారిగా నటిస్తూ భద్రతా ముసుగులో కశ్మీర్‌ను సందర్శించారని ఆరోపించిన గుజరాత్ మోసగాడు కిరణ్ పటేల్‌ను ప్రస్తావిస్తూ మోసగాళ్లుగా మారిన కొంతమంది వ్యక్తులకు ప్రభుత్వం ఎందుకు పటిష్ట భద్రతను కల్పిస్తోందని ప్రశ్నించారు. ఉత్సవాలను ఇష్టపడే బిజెపి సున్నితమైన ప్రాంతాల్లో వివాదాస్పద ప్రైవేట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పుడు, ఇతరుల గొంతు వినిపించడమే పనిగా పెట్టుకున్న దాదాపు 250 మంది వివిఐపిల భద్రత కోసం వేలాది మంది భద్రతా సిబ్బందిని మోహరిస్తారని విమర్శించారు. సొంత ఉనికి లేని, కోర్టులను కూడా అగౌరవపరిచే వ్యక్తులు పర్యాటకులను కాకుండా భద్రతను ఎందుకు పొందుతున్నారని యుపి మాజీ ముఖ్యమంత్రి ప్రశ్నలు సంధించారు.

### పాకిస్థాన్ దుష్టదేశమని

# వాళ్ళ మంత్రే ఒప్పుకున్నాడు

### ఐక్యరాజ్యసమితిలో భారత్ విమర్శ



**న్యూయార్క్ :** పాకిస్థాన్ ఒక దుష్టరాజ్యమని, దుర్మార్గాలకు పాల్పడే దేశమని, ప్రపంచ ఉగ్రవాదానికి ఆజ్యంపోసి ఆ ప్రాంతాన్ని అస్థిరపరచిందని వారి రక్షణమంత్రే బాహాటంగా అంగీకరించాడని,ప్రపంచంలో పాకిస్థాన్ ఉగ్రవాదానికి ఆజ్యం పోస్తోందని ఐక్యరాజ్యసమితిలో భారతదేశం స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితిలో భారతదేశ శాశ్వత ప్రతినిధి (డిప్యూటీ), దౌత్యవేత్త యోజనాపటేల్ మంగళవారం జరిగిన సమావేశంలో గట్టిసమాధానం చెప్పారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఉగ్రవాద బాధితులతో కూడిన ఒక సంఘాన్ని ఐక్యరాజ్యసమితిలో ఏర్పాటు చేశారు. ''విక్టిమ్స్ ఆఫ్ టెర్రరిజం అసోసియేషన్ నెట్‌వర్క్ (వోటాన్) పేరుతో ఈ వేదికను ప్రారంభించిన సందర్భంగా జరిగన కార్యక్రమంలో పాకిస్థాన్‌కు చెందిన ఐక్యరాజ్యసమితి ప్రతినిధి పహల్గామ్ సంఘటను ప్రస్తావించినప్పుడు యోజనాపటేల్ పైవిధంగా గట్టి బదులిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద దాడిలో బాధిత కుటుంబాలు ఈ ''వోటాన్''లో సభ్యులుగా ఉంటాయి.

''తప్పుడు ప్రచారం చేయడానికి ఈ అత్యున్నత వేదికను ఒక దేశానికి చెందిన ప్రతినిధి దుర్వినియోగం చేయడం అత్యంత దురదృష్టకరం, ఈ విధమైన తప్పుడు ప్రచారం ద్వారా ఈ వేదిక విలువను ఆయన దిగజార్చారు, భారత్‌కు వ్యతిరేకంగా నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు'' అని యోజనాపటేల్ పాకిస్థాన్ ప్రతినిధిపై మండిపడ్డారు. ''యావత్ ప్రపంచం పాకిస్థాన్ చేసిన పనిని అసహ్యించుకుంటున్నది, పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ చేసిన ప్రకటన యావత్ ప్రపంచానికీ తెలిసింది, ఉగ్రవాదులకు పాకిస్థాన్‌లో శిక్షణ ఇచ్చామనీ, ఉగ్రవాద సంస్థలకు నిధులు ఇచ్చామని ఇటీవల టెలివిజన్ ఇంటర్వ్యూలో ఆ దేశ రక్షణమంత్రి చెప్పిన విషయాన్ని యోజనాపటేల ఐక్యరాజ్యసమితిలో మరోసారి గుర్తుచేశారు. ''ఈ విధంగా బాహాటంగా పాకిస్థాన్ రక్షణమంత్రి ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చినట్లు ఒప్పుకోవడం ఎవరికీ ఆశ్చర్యం కలిగించలేదు, తద్వారా పాకిస్థాన్ ఒక ''దుష్టరాజ్యం'' అనే విషయం ప్రపంచానికి తెలిసివచ్చింది, ప్రపంచదేశాలు ఇంకెంతోకాలం వాస్తవాలు చూడకుండా కళ్ళుమూసుకుని కూర్చోదు, ఇక ఈ విషయంలో నాకు చెప్పడానికి ఏమీలేదు'' అని యోజనా పటేల్ అన్నారు.పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడిచేసిన తర్వాత ప్రపంచ దేశాల నాయకులు భారతదేశానికి బలమైన, తిరుగులేని మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించారనీ ఆమె చెప్పారు.ప్రపంచదేశాలు ఎంత మాత్రం ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోవనడానికి పహల్గామ్ ఘటనపై వ్యక్తం చేసిన వ్యతిరేకతే ఒక ప్రత్యక్ష తార్కాణమని చెప్పారు.

స్కై న్యూస్‌కు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో పాకిస్థాన్ రక్షణమంత్రి ఆసిఫ్, ''మూడు దశాబ్దాలపాటు అమెరికాకోసం, అలాగే బ్రిటన్ సహా పశ్చిమ దేశాలకోసం మేం చాలా చెత్తపనులు చేస్తూ వచ్చాం, అదంతా గతం, మీకు తెలుసు'' అని చెప్పారు. ఉగ్రవాద సంస్థలకు శిక్షణ ఇచ్చి వారికి నిధులు సమకూర్చిన సుదీర్ఘ చరిత్ర పాకిస్థాన్‌కు ఉంది అని ఆయన అంగీకరించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.2008లో ముంబయిలో జరిగిన భయానకమైన ఉగ్రవాదుల హింసాకాండకు పెద్దసంఖ్యలో సామాన్యపౌరులు బలయ్యారని, దాని కొనసాగింపుగానే పహల్గామ్‌లో హింసాకాండ జరిగిందని యోజనా పటేల్ విమర్శించారు. పాకిస్థాన్ సరిహద్దుల్లోంచి జరుగుతున్న ఉగ్రవాదానికి అనేక దశాబ్దాలుగా భారతదేశం బలి అవుతోందనీ, దీర్ఘకాలంగా బాధితులు, వారి కుటుంబాలపై ఈ విధమైన చర్యలు చూపిస్తున్న ప్రభావాన్ని భారతదేశం పూర్తిగా అర్థం చేసుకుందనీ చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, రష్యా అధ్యక్షుడు పుతిన్, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు మేక్రాన్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తదితరులు పహల్గామ్ ఘటనను తీవ్రంగా ఖండించారని ఆమె గుర్తుచేశారు. ఉగ్రవాద దాడికి బలైన బాధితులకోసం ఏర్పాటు చేసిన ఈ ''వోటన్'' ఆవిర్భావం ఎంతో ముఖ్యమైన ఘట్టమని, అనివార్యమని, ఉగ్రవాదానికి ప్రపంచ ప్రతిస్పందనకు ఇది వేదికగా ఉంటుందన్నారు.

## నాలుగోసారి ట్రైనీలపై ఇన్ఫోసిస్ వేటు

**న్యూఢిల్లీ :** దేశీయ ఐటి దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ ఇటీవలే తరచూ వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. ఉద్యోగులకు లేఆఫ్స్, ఫ్రెషర్స్ విషయంలో సంస్థ తీరు, శాలరీ హైక్‌లు వంటి కారణాలతో నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోంది. ఇటీవలే కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు క్యాంపస్‌లో శిక్షణ పొందుతున్న వందలాది మంది ట్రైనీలను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా మరింతమంది ట్రైనీలపై వేటు వేసింది. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో ఉత్తీర్ణత సాధించకపోవడంతో వారిని తొలగించినట్లు జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. దాదాపు 195 మంది ట్రైనీలను తొలగించినట్లు మనీకంట్రోల్ నివేదించింది. ఈ మేరకు ఇవాళ ఈమెయిల్ ద్వారా ఆయా ట్రైనీలకు తొలగింపు సమాచారాన్ని అందించినట్లు పేర్కొంది. సిస్టమ్ ఇంజినీర్, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజనీర్ విభాగంలోని ట్రైనీలు తొలగింపుకు గురైనట్లు తెలిపింది. ఇలా ట్రైనీలను తొలగించడం ఈ ఏడాది ఇది నాలుగోసారి కావడం గమనార్హం. తొలుత ఈ ఏడాది ఫిబ్రవరిలో బెంగళూరు మైసూర్ క్యాంపస్ నుంచి దాదాపు 300 కంటే ఎక్కువ మంది ట్రైనీలను తొలగించింది. ఆ తర్వాత మార్చిలో 35, ఏప్రిల్‌లో 240 కంటే ఎక్కువ మందిని ఇంటికి సాగనంపింది. ఇప్పుడు మరో 195 మంది ట్రైనీలపై వేటు వేసింది. తాజా పరిణామంతో ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకూ సంస్థ దాదాపు 800 మంది ట్రైనీలను తొలగించినట్లు మనీకంట్రోల్ నివేదించింది.

### 21వ శతాబ్దపు అవసరాలకనుగుణంగా

# విద్యా వ్యవస్థ ఆధునీకరణ

### దేశ భవిష్యత్తుకు యువతను సిద్ధం చేయడంలో విద్యా వ్యవస్థ కీలక పాత్ర : ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ :** దేశ భవిష్యత్తుకు యువతను సిద్ధం చేయడంలో విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వం దానిని ఆధునీకరించడానికి కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత మండపంలో జరిగిన వైయుజిఎం ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్‌లో మోదీ మంగళవారం ప్రసంగించారు. ఆలోచన నుండి నమూనాకు ఉత్పత్తికి సాధ్యమైనంత తక్కువ సమయంలో ప్రయాణం పూర్తి కావడం కీలకమని మోదీ అన్నారు. ఎఐ, క్వాంటం కంప్యూటింగ్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, స్పేస్ టెక్, హెల్త్‌టెక్, సింథటిక్ బయాలజీని నిరంతరం ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ప్రధాని ఉద్ఘాటించారు. ఎఐ అభివృద్ధి, స్వీకరణలో భారత అగ్రగామి స్థానాన్ని మోదీ ప్రధానంగా పేర్కొన్నారు. 21వ శతాబ్దపు అవసరాలను తీర్చడానికి భారతదేశ విద్యా వ్యవస్థను ఆధునీకరించే ప్రయత్నాలను మోదీ తెలియజేశారు. కొత్త జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం ప్రపంచ విద్యా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిందన్నారు. ఇది భారత విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన ముఖ్యమైన మార్పులను ఆయన ప్రస్తావించారు. రాబోయే 25 సంవత్సరాలలో అభివృద్ధి చెందిన భారతదేశం అనే లక్ష్యాన్ని చేరుకునే ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, 'ఆలోచన నుండి నమూనాకు ఉత్పత్తికి ప్రయాణం సాధ్యమైనంత తక్కువ సమయంలో పూర్తి కావడం చాలా ముఖ్యమన్నారు. ప్రయోగశాల నుండి మార్కెట్‌కు దూరాన్ని తగ్గించడం వల్ల పరిశోధన ఫలితాలు ప్రజలకు వేగంగా అందుతాయన్నారు. విద్యాసంస్థలు, పెట్టుబడిదారులు, పరిశ్రమ పరిశోధకులకు మద్దతు ఇవ్వాలని, మార్గనిర్దేశం చేయాలని ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు. నేటి యువత పరిశోధన, అభివృద్ధిలో మాత్రమే కాకుండా, వివిధ రంగాలలో పరిశోధనలకు భారతదేశ యువ తరం పరివర్తనాత్మక సహకారాన్ని నొక్కి చెబుతూ సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రపంచంలోనే అతి పొడవైన హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్, ఇండియన్ రైల్వేస్ సహకారంతో ఐఐటి మద్రాస్‌లో అభివృద్ధి చేయబడిన 422 మీటర్ల హైపర్‌లూప్ వంటి మైలురాళ్లను ప్రస్తావిస్తూ, నానోస్కేల్‌లో కాంతిని నియంత్రించడానికి ఐఐఎస్‌సి బెంగళూరు శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన నానోటెక్నాలజీ, మాలిక్యులర్ ఫిల్మ్‌లో 16,000 కంటే ఎక్కువ కండక్షన్ స్టేట్స్‌లో డేటాను నిల్వ చేసి ప్రాసెస్ చేయగల 'బ్రెయిన్ ఆన్ ఎ చిప్' టెక్నాలజీ వంటి సంచలనాత్మక విజయాలను ప్రధాని ప్రశంసించారు. జాతీయ లక్ష్యాలను సాధించడానికి భారతదేశ పరిశోధన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేసే ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు, 2013–14లో రూ. 60,000 కోట్ల నుండి రూ. 1.25 లక్షల కోట్లకు పైగా పరిశోధనష అభివృద్ధిపై స్థూల వ్యయాన్ని రెట్టింపు చేయడం, అత్యాధునిక పరిశోధన పార్కుల ఏర్పాటుష దాదాపు 6,000 ఉన్నత విద్యా సంస్థలలో పరిశోధన, అభివృద్ధి కణాల ఏర్పాటును ప్రస్తావించారు. ప్రతిభ, స్వభావం, సాంకేతికత అనే త్రిమూర్తులు భారతదేశ భవిష్యత్తును మారుస్తాయి అని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు, ఇప్పటికే పనిచేస్తున్న 10,000 ప్రయోగశాలలతో అటల్ టింకరింగ్ ల్యాబ్స్, పిల్లలకు ముందస్తు అవగాహన కల్పించడానికి ఈ సంవత్సరం బడ్జెట్‌లో 50,000 మరిన్నింటిని ప్రకటించడం వంటి చొరవలను ప్రధాని గుర్తుచేశారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## విద్యుత్ సంస్థల్లో ప్రమోషన్స్ ఇవ్వొద్దు : హైకోర్టు

**హైదరాబాద్ :** తెలంగాణ విద్యుత్ సంస్థలైన జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎస్పీడిసిఎల్, ఎన్పీడిసిఎల్ పనిచేసే సిబ్బందికి ప్రమోషన్స్ ఇవ్వరాదని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సోమవారం జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగిన 2014 జూన్ 2 నుంచి ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులు కల్పించడం వల్ల నష్టపోయిన ఒసి, బిసి ఉద్యోగులకు కూడా సీనియార్టీ మేరకు పదోన్నతులు కల్పించాలని 2018లో వెలువడిన ఉత్తర్వులపై రివ్యూ చేయాలన్న పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున పిటిషనర్లకు ఏవిధమైన ఉత్తర్వులు జారీ చేయవద్దన్న ఆయా విద్యుత్ సంస్థలు చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ ఉత్తర్వులు వెలువడి ఏడేండ్లు అయ్యిందని, ఇప్పటి వరకు అమలు కాలేదని, రివ్యూ పిటిషన్‌పై తుది ఉత్తర్వులు వెలువడే వరకు పదోన్నతులు కల్పించరాదని తేల్చిచెబుతూ మధ్యంతర స్టేఆదేశాలను జారీ వెలువరించింది.

## మా భూములన్నీ చట్టబద్ధమైనవే

### హైకోర్టులో ఐపిఎస్‌లు అప్పీళ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూదాన్ భూములపై ఇటీవల సింగిల్ జడ్జి జస్టిస్ భాస్కర్‌రెడ్డి వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ పలువురు ఐపిఎస్‌లు హైకోర్టులో అప్పీల్ పిటిషన్లు వేశారు. పిటిషనర్ మల్లేశ్ పిటిషన్‌లో అభ్యర్థించని అంశాల్లోకి జడ్జి వెళ్లి ఉత్తర్వులు ఇవ్వడం చెల్లదన్నారు. ఐపీఎస్ ఆఫీసర్లు రవి గుప్త, తరుణ్ జోషి, బీకే రాహుల్ హెగ్డే, జితేందర్ కుమార్ గోయల్ భార్య రేణుగోయల్, ఐఏఎస్ అధికారి జనార్దన్‌రెడ్డి కొడుకు రాహుల్ బుసిరెడ్డి, ఐపీఎస్ అధికారులు మహేష్ మురళీధర్ భగవత్, సౌమ్యా మిశ్రా, స్వాతి లక్రా, ఉమేశ్ షరాఫ్ భార్య రేఖ షరాఫ్, వ్యాపారవేత్త వీరన్నగారి గౌతంరెడ్డి వేర్వేరుగా నాలుగు అప్పీళ్లను దాఖలు చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం సర్వే నంబర్ 181, 194, 195లో భారీ భూ కబ్జాలపై ఫిబ్రవరి 16న, మార్చి 8న సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేశ్ హైకోర్టును ఆశ్రయించారు.26 మంది ఉన్నతాధికారులు భూ కబ్జాలో ఉన్నందున ఈ అంశంపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలన్నారు. దీనిపై సింగిల్ జడ్జి.. ఆ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు వెలువరించారు. నాగారం గ్రామంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని అధికారులను ఆదేశించడాన్ని ఐపీఎస్ అధికారులు అప్పీల్ పిటిషన్లలో సవాల్ చేశారు. ఈ అప్పీళ్లను డివిజన్ బెంచ్ విచారణ చేయనుంది.

## ప్రభాకర్‌రావే ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చారు

### హైకోర్టులో పోలీసుల వాదన

**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన మాజీ ఎస్ఐబీ ఆఫీసర్, రిటైర్డు ఐపిఎస్ అధికారి ప్రభాకర్‌రావు కు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని ప్రభుత్వం, పోలీసులు హైకోర్టులో వాదించారు. ముందస్తు బెయిలు పిటిషన్‌ను జస్టిస్ జె.శ్రీనివాసరావు మంగళవారం విచారించారు. ప్రభుత్వం, పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థలూత్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరావు వాదించారు. జడ్జీలు, జర్నలిస్టుల, రాజకీయనేతలపై ఫోన్ ట్యాపింగ్ చేయించడంలో ఆయనది కీలక పాత్ర అన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల్లో ఓడిపోగానే హార్డ్ డిస్కలను ప్రభాకర్‌రావు ఆదేశాలతో ధ్వంసం చేశారన్నారు. మార్చి 10న రెడ్‌కార్నర్ నోటీసు జారీ అయిందన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా రాజకీయ నాయకులు, జర్నలిస్టులతో సహా పలువరు ప్రైవేటు వ్యక్తుల ఫోన్‌లపై నిఘా పెట్టారనారు. రాజకీయ నేతల అవసరాల మేరకు నిందితుడు ప్రభాకర్‌రావు పనిచేశారన్నారన్నారు. ముందస్తు బెయిలు పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. ప్రభాకర్‌రావు బెయిలు పిటిషన్‌లో తనను ప్రతివాదిగా అనుమతించి తమ వాదనలు కూడావినాలని, ప్రభాకర్‌రావు బెదిరించి బీఆర్ఎస్ ఎలక్షన్ బాండ్లను కొనిపించారని సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. ఇందుకు ప్రభాకర్‌రావు న్యాయవాది అభ్యంతరం చెప్పారు. విచారణ బుధవారానికి వాయిదా పడింది.

## అజారుద్దీన్‌కు ఊరట

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కు అజహరుద్దీన్ పేరును తొలగించాలన్న అంబుడ్స్‌మెన్ జస్టిస్ ఈశ్వరయ్య ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేయాలని హైకోర్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)ను ఆదేశించింది. నార్త్ స్టాండ్‌కున్న అజహరుద్దీన్ పేరును తొలగించాలన్న ఉత్తర్వులను రద్దు చేయాలంటూ అజారుద్దీన్ వేసిన పిటిషన్‌పై జూన్‌లో పూర్తి స్థాయి విచారణ చేస్తామంది. అప్పటి వరకు పేరు తొలగింపు చర్యలు తీసుకోవద్దని జస్టిస్ కార్తీక్ ఆదేశించారు.

## తల్లీ,బిడ్డలకు వైద్యం అందజేయండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమ కుమార్తెకు మానసిక వైద్యం అందజేయించే విషయంలో తల్లిదండ్రులు సందేహాన్ని వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. తమ కుమార్తె ప్రాణాలకు ముప్పు ఉందనే భయాన్ని కూడా పిటిషనర్లు వ్యక్తం చేశారు. మియాపూర్ పోలీసులకు ఇచ్చిన వినతి పత్రంపై చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ గుంటూరుకు చెందిన తండ్రి శ్రీనివాసరావు, ఆయన సతీమణి వేసిన పిటిషన్‌ను జస్టిస్ వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. గర్భిణి అయిన వాళ్ల కుమార్తెను, ఆమె రెండేళ్ల కొడుకు గాంధీ ఆస్పత్రిలో చేర్పించి వైద్య పరీక్షలు–వైద్యం చేయించాలని మహిళా శిశ్ర సంక్షేమ శాఖను ఆదేశించారు. దీనిపై గతంలోనే న్యాయమూర్తి, హైకోర్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిని ఆదేశించి నివేదిక తెప్పించుకున్నారు. గర్భిణి అయిన పిటిషనర్ కుమార్తె ఇంటికి కార్యదర్శి వెళ్లి వాస్తవాలను పరిశీలన చేసి ఇచ్చిన నివేదికలో, ఆమె ఎనిమిది మాసాల గర్భిణి అని, బలహీనంగా ఉందని, నరాల సమస్యతో నీరసంగా పాలిపోయి ఉందని, రక్తహీనత కూడా ఉందని తెలిపారు. ఆమె 2 ఏళ్ల కొడుకు కూడా బలహీనంగా ఉన్నాడని తెలిపారు. ఆమె భర్త ఆమెకు చేయిస్తున్న వైద్య వివరాలు ఇచ్చారని, కోర్టుకు కూడా చెబుతానని అన్నారని కూడా నివేదికలో ఉంది. మెడికల్ రిపోర్టులు, మందుల వివరాలను ఆమె భర్త అందజేశారని చెప్పారు. ఈనివేదికను న్యాయమూర్తి పరిశీలన చేశారు. గర్భిణి, ఆమె గర్భంలోని పిండం బాగానే ఉన్నాయని, గర్భంలోని పిండానికి జీవించే హక్కు ఉందని చెప్పారు. గాంధీ ఆస్పత్రిలో వైద్యం అందజేయించాలని ఉత్తర్వులు జారీ చేశారు. పేరెంట్స్‌ను కాదని ఆమె పెండ్లి చేసుకున్న కారణంగా ఆమె భద్రతకు పోలీసులు చర్యలు తీసుకోవాలని, ఆమెను చూసేందుకు భర్తను మాత్రమే అనుమతించాలని ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను వాయిదా వేశారు.

## పవన్ కళ్యాణ్‌పై కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ ఆగ్రహం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి 140 ఏళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. నలుగురు వచ్చి పార్యటకులను కాల్చిపోతే పిట్ట కథలు చెప్పుకుంటూ తిరుగుతున్నారని, నలుగురు ముష్కరులు 28 మందిని చంపితే వారం రోజుల నుండి అరెస్టు చేయకుండా ఎవరి వైఫల్యం జరిగిందో పవన్ కళ్యాణ్ అడగాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యమా? ఇంటెలిజెన్స్ వైపల్యమా?, కాశ్మీర్‌లో 370 పెట్టి ప్రశాంత వాతావరణం తీసుకొచ్చిట్లు ప్రకటించిన ప్రధాని మోదీ సమాధానం చెప్పాలన్నారు. ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నాయకుడు ఆలోచించి మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని, భారతదేశాన్ని కాపాడే పార్టీ అని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీని ప్రసన్నం చేసుకోవాలనుకుంటే 7 రేస్ కోర్స్‌లో డాన్స్ వేసుకుంటూ కూర్చోవాలని, లేకుంటే రాజకీయాలు మానేసి, రెండు సినిమాలు తీసి మోదీని ప్రసన్నం చేసుకోవాలని ఆయన సూచించారు. ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇష్టం వచ్చినట్లు మాట్లాడి ప్రజల, కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడవద్దన్నారు. బిజెపి నేతల మాదిరిగా కాంగ్రెస్ పార్టీ కుల మతాల మధ్య చిచ్చు పెట్టట్లేదని, నిజంగా నిలదీయాలంటే ప్రధాని మోదీని నిలదీయాలన్నారు.

# ఆపరేషన్ కగార్ ఆపండి

### మావోయిస్టులతో కేంద్రం తక్షణమే చర్చలు జరపాలి

### ఆదివాసీ ప్రాంతాల్లో ప్రత్యేకపరిపాలనా విధానాలు ఉంటయ్

### వారి హక్కులను ఎవరూ కాలరాయొద్దు

### ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కతో భారత్ బచావో ప్రతినిధుల భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క కోరారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలని సూచించారు. ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కతో భారత్ బచావో సంస్థ ప్రతినిధులు గాదె ఇన్నయ్య, డాక్టర్ ఎంఎఫ్.గోపినాథ్, జంజర్ల రమేష్‌బాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసేలా తన వంతు ప్రయత్నం చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, ఛత్తీస్ గఢ్ సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని నిలువరించేలా చొరవ చూపాలని కోరారు. వేల సంఖ్యలో కేంద్ర బలగాలు కర్రెగుట్ట ప్రాంతాల్లో సంచరిస్తుండటంతో.. ఆదివాసీలు భయాందోళనకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే ఆపరేషన్ కగారును నిలిపివేయకపోతే పెద్ద ఎత్తునప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలన్నారు. మధ్యభారతంలోని ఆదివాసీ ప్రాంతాలు రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయని, అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక పరిపాలన విధానాలు, హక్కులు ఉంటాయన్నారు. అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే పనిచేయాలని సూచించారు. బలప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర భయాందోళనతో ఉన్నారన్నారు. వారి హక్కులను ఎవరూ కాలరాయొద్దు అన్నారు. ఆజాతి బిడ్డగా ఆదివాసీలకు అండగా నిలుస్తాను అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మావోయిస్టులతో చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలన్నారు. రెండు వైపుల ప్రాణనష్టం నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయన్నారు.

## 'తదుపరి సిజెఐగా' జస్టిస్ బిఆర్.గవాయ్ నియామకం

### నోటిఫికేషన్ జారీ చేసిన న్యాయ మంత్రిత్వ శాఖ

### మే 14న 52వ భారత ప్రధాన న్యాయమూర్తిగా గవాయ్ ప్రమాణస్వీకారం

**న్యూఢిల్లీ :** తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తి(సిజెఐ)గా జస్టిస్ భూషణ్ రామ్‌క్రిష్ణ (బిఆర్) గవాయ్ మంగళవారం నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా పదవీ విరమణ చేసిన ఒక రోజు తర్వాత ఆయన సిజెఐగా మే 14న తన కార్యాలయంలోకి అడుగుబెట్టనున్నారు. 52వ భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బిఆర్.గవాయ్ నియామకాన్ని ప్రకటిస్తూ న్యాయ మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. 'భారత రాజ్యాంగం ఆర్టికల్ 124లోని క్లాజ్ (2) ద్వారా సంక్రమించిన అధికారాల మేరకు తగిన కసరత్తు జరిపి ప్రస్తుతం న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ బిఆర్.గవాయ్‌ను భారత ప్రధాన న్యాయమూర్తిగా నియమించడంపై రాష్ట్రపతి సంతోషిస్తున్నారు' అని న్యాయ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తిగా బిఆర్.గవాయ్ మే 14వ తేదీ నుంచి కొనసాగుతారని నోటిఫికేషన్ తెలిపింది. నిర్దేశించిన విధానం ప్రకారం జస్టిస్ రామ్‌క్రిష్ణ భూషణ్ గవాయ్ పేరును భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా ఏప్రిల్ 16న కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. సుప్రీంకోర్టు జడ్జిగా 2019, మే 24న బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ బిఆర్.గవాయ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 6నెలలకుపైగా కొనసాగి, 65ఏళ్ల వయసు పూర్తి కానున్న నేపథ్యంలో ఆయన నవంబర్ 23న సిజెఐగా పదవీవిరమణ చేయనున్నారు. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సంజీవ్ ఖన్నా తర్వాత జస్టిస్ బిఆర్. గవాయ్ రెండవ సీనియర్‌మోస్ట్ సుప్రీంకోర్టు జడ్జిగా ఉన్నారు. అమరావతిలో 1960, నవంబర్ 24న జస్టిస్ బిఆర్.గవాయ్ జన్మించారు.

## రాష్ట్రంలో రెండు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రెండురోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. బుధవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహమూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందన్నారు.

**రాష్ట్రంలో మండుతున్న ఎండలు..** మరో వైపు రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రత రోజు రోజుకూ పెరుగుతున్నాయి. మంగళవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో 44.3 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లా మెందోరాలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చాలా జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్లోనూ ఎండ పెరిగింది. దాంతో జనం తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బందిపడుతున్నారు.

# ఆర్‌టిసిని కెసిఆర్ కనుమరుగు చేశాడు

### కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసిని కెసిఆర్ కనుమరుగు చేశాడని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తే దాన్ని కెసిఆర్ తప్పుపట్టడం ఎంత వరకు సమంజమని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. సీటు దొరకని వాళ్ళు తిట్టుకుంటుండొచ్చు ..సీట్లు కూర్చున్న మహిళలు మెచ్చుకుంటారు కదా..? అని అన్నారు.కెసిఆర్ విమర్శిస్తున్నారు అంటే ఉచిత బస్సు సక్సెస్ అయినట్టే.. ఆయనకు నష్టం కలుగుతుంది కాబట్టి ఆర్‌టిసి ఉచిత ప్రయాణం వేస్ట్ అనే అంటాడు అని ఎద్దేవ చేశారు. మా దగ్గర నుండి మహిళ రైతులు గుడిమల్కాపురం వరకు వస్తున్నారు. ఏడాదికి 4 వేల కోట్లు మహిళలకు ఇస్తున్నాం..తప్పా అని అన్నారు. ఉచిత బస్సు తీసేయండి అంటున్నారా..? కెసిఆర్ క్లారిటీ ఇవ్వాలని అడిగారు. ఉచిత బస్సు ఎత్తేయండి అని కెసిఆర్ అంటున్నారు.. మహిళలు ఆలోచించాలన్నారు. బిఆర్ఎస్ హయంలో మమల్ని అరెస్టులు చేసే సభలను అడ్డుకునే వారు. మా పోలీసులు మీరు రోడ్ల మీద డాన్స్‌లు చేసుకుంటూ సభలకు పోయినా.. ఏమనలేదని గుర్తుచేశారు. కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలి... మంచిగా ఉండాలి.. ఎప్పుడూ ప్రతిపక్షంలోనే ఉండాలి అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. పదహారు నెలలు నుండి ఇంట్లనే ఎందుకు ఉన్నావు అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. సమస్యలు ఉంటే ఇన్ని రోజులు ఎందుకు స్పందించలేదని అడిగారు.

**కెసిఆర్‌కు సవాల్..**

ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.22 వేల కోట్ల రుణమాఫీ చేసిందని, రైతు రుణమాఫీపై టైమ్ ఫిక్స్ చేయండి ఏ ఊరు పోదాం అనేది చెప్పండి అని కెసిఆర్‌కు సవాల్ విసిరారు. మా తరపు నుంచి ఎవరు వస్తారో చెబుతాం అని అన్నారు. పదకొండేళ్లలో కెసిఆర్ చేసిన మాఫీ 20వేల కోట్లేనని ఎవరు గొప్ప అనేది..రైతులే ఆలోచించండి అని అన్నారు. రైతులు 500 బోనస్ తో సంతోషంగా ఉన్నారు..ఐదెకరాల రైతుకు 75 వేలు బోనస్ వస్తుందని స్పష్టం చేశారు.

# ఉద్యమ ఆకాంక్షల సాధనే జన సమితి లక్ష్యం

### టిజెఎస్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పిఎల్.విశ్వేశ్వర రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనే తమ లక్ష్యమని తెలంగాణ జన సమితి(టిజెఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర రావు అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మంగళవారం టిజెఎస్ ఏడవ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన పిఎల్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన సమితి గత ఏడేళ్లలో నిరుద్యోగ సమస్యపై పోరాటం, ఆదివాసీ హక్కుల పరిరక్షణ, జాబ్ క్యాలెండర్ కోసం ఉద్యమాలు చేసిందని గుర్తు చేశారు. ధర్నా చౌక్ రక్షణ ఉద్యమం వంటి అనేక ప్రజా ప్రయోజన కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. బిఆర్ఎస్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగించడంలో పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వం, జన సమితి పాత్ర కీలకమైందన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా జన సమితి నిలుస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, పల్లె వినయ్ కుమార్, ఆశప్ప, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య, మహిళా జన సమితి అధ్యక్షురాలు లక్ష్మి, ఎస్సి సెల్ అధ్యక్షుడు చంద్రగిరి సత్యనారాయణ, బిసి సెల్ అధ్యక్షుడు జస్వంత్ కుమార్, నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, యువ జన సమితి నాయకులు కొత్త రవి, ఎర్ర వీరన్న విద్యార్థి జన సమితి అధ్యక్షులు మాసంపల్లి అరుణ్, ప్రశాంత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యులు కె.ఆర్.సురేష్ రెడ్డి మంగళవారం సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను కలిసి వివిధ రైలు అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు.

## మతిభ్రమించి మాట్లాడుతున్న కెసిఆర్

### టిడిపి సికింద్రాబాద్ అధ్యక్షుడు సాయిబాబా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ రజితోత్సవ సభలో కెసిఆర్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తెలంగాణ అనే పదాన్ని నిషేధించారని మాట్లాడటం కెసిఆర్ రెండు నాల్కాల దోరణికి నిదర్శనమని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఆవిర్భవించిందన్నారు. నాటి నుండి తెలుగు దేశం ప్రజల కోసం పోరాడుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం ఎక్కడుంటుందో తెలుగుదేశం అక్కడ ఉంటుందన్నారు. కేవలం వాపును చూసి బలుపు అనుకోవద్దన్నారు.



## ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో భారీ పేలుడు

### ఇద్దరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/మోటకొండూరు:** యాదాద్రి జిల్లా మో టకొండూరు మండలంలోని కాటేపల్లిలో ప్రమీయర్ ఎక్స్ ప్లోజివ్ కంపెనీలో ప్రమాదవశా త్తు బాంబు పేలి ఇ ద్దరు మృతి చెంద గా 4 గురికి తీవ్ర గాయాలు అయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా రు. వివరాలోకి వెలితే కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్పోజివ్ కంపనీలో గత కొంత కాలంగా పనిచేస్తున్న మోటకొండూరుకు చెందిన దేవి చరణ్,కాటేపల్లి కి చెందిన గూనుగుంట్ల సందీప్ ప్రమాదంలో మృతి చెందగా, పరిసర ప్రాంత ఉద్యోగులు బి శ్రీకాంత్, లింగస్వామి, ఆర్.శ్రీకాంత్, మహేష్‌లు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా బాదిత కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కంపనీలో ముందు దర్నాకు దిగారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శ కాటపల్లి ప్రీమియర్ ఎక్స్ క్లోజివ్ కంపెనీలో జరిగిన ప్రమాదంపై స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సందర్శించి మృతుల కుటుంబ సభ్యులను, క్షతగాత్రుల కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని అన్నారు. ప్రమాదం జరిగిన తీరును యాజమాన్యం తో చర్చించి వివరాలు తెలుసుకున్నారు.

## రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ అద్భుతం

### జార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శిల్పి నేహా టిర్కీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు 'సన్నాబియ్యం పంపిణీ అద్భుతమైన కార్యక్రమాన్ని జార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయం, పశుసంవర్ధక, సహకార శాఖ మంత్రి శిల్పి నేహా టిర్కీ ప్రశంసించారు. హైదరాబాద్‌లోని పౌరసరఫరాల రాష్ట్ర కార్యాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రిని పౌరసరఫరాల శాఖ కమిషనర్‌డి.ఎస్. చౌహాన్ సాధారంగా ఆహ్వానించారు. అనంతరం జార్ఖండ్ మంత్రి శిల్పి నేహా టిర్కీ పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారుతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డుల ద్వారా లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం, ఇందుకు అవసరమైన బియ్యాన్ని సేకరించేందుకు రైతులకు అదనపు ప్రయోజనం కల్పించేందుకు సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చోప్పున బోనస్ ఇవ్వడం ప్రభుత్వ జవాబుదారీతనం, పారదర్శకతకు నిదర్శనమన్నారు. మహాలక్ష్మి పథకం కింద సబ్సిడీ ధరలకు ఎల్‌పిజి సిలిండర్ పంపిణీ చేయడం ఇలా పేదల కోసం పనిచేయడం అపారమైన సంతృప్తిని ఇస్తుందని పేర్కొన్నారు. జార్ఖండ్ రైతుల జీవితాలను వెలుగు నిపేందుకు కృషి చేస్తామని,అంతర్‌రాష్ట్ర సహకారానికి ఆసక్తితో ఉన్నామని మంత్రి వెల్లడించారు. అంతకు ముందు ధాన్యం సేకరణ, పిడిఎస్ ద్వారా అందజేస్తున్న బియ్యం సరఫరా, నాణ్యత ప్రమాణాల మెరుగు పర్చేందుకు చేపట్టిన పలు సంస్కరణలను కమిషనర్ చౌహాన్ జార్ఖండ్ మంత్రిశిల్పి నేహా టిర్కీకి వివరించారు.

# 3వ తేదీ నుంచి 'రాక్ బే నేచర్ క్యాంప్'

### టిజిఎఫ్‌డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్ నాయక్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో 'డెక్కన్ వుడ్స్ ట్రైల్స్' పేరుతో నాలుగు వివిధ రకాల కార్యక్రమాలు వివిధ చోట్ల నిర్వహించబోతున్నట్లు టిజిఎఫ్‌డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 3వ తేదీ నుంచి 'రాక్ బే నేచర్ క్యాంప్' నిర్వహినుంచనున్నామని, ఇందులో టీం బిల్డింగ్, టెంట్ పిచింగ్, రాత్రి పూట అడవిలో నడక, నైట్ క్యాంపింగ్, క్యాంప్ ఫైర్ ఉంటుందని తెలిపారు. ప్రతి శనివారం ఎకో బస్ టూర్ కార్యక్రమం ఉంటుందని, బోటానికల్ గార్డెన్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇందులో 75 థీమ్ పార్క్ లు గల 'వృక్ష పరిచయ క్షేత్రం' కి తీసుకువెళ్లి మొక్కలు మరియు థీమ్ పార్క్ డ్రోన్ ఫోటోలు చూపించి ఈ థీమ్ ల యొక్క ప్రాముఖ్యత గురించి వివరించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పాముల, జీవవైవిధ్యంలో వాటి యొక్క ప్రాముఖ్యత గురించి ఫ్రెండ్స్ అఫ్ స్నాక్ సొసైటీ వారు వివరిస్తూ వాటి మీద వున్నా అపోహల గురించి వివరిస్తారు. అక్కడ నుండి మళ్ళీ బోటనికల్ గార్డెన్ కు తిరుగు ప్రయాణం అవుతారని తెఇపారు.మే 4వ తేదీన ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి 9.30 గంటల వరకు ఫారెస్ట్ ట్రెక్ పార్క్, మంచిరేవులలో బర్డ్ వాక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే వేసవి లో బోటానికల్ గార్డెన్ లో సమ్మర్ డే క్యాంప్ ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. మొదటగా 8 గంటల నుండి 9 గంటల వరకు బర్డ్ వాక్, నేచర్ ట్రయల్, 9 నుండి 10 గంటల వరకు విషపూరీత మరియు విషం లేని పాముల పై అవగాహన, 10 గంటల నుండి 11 గంటల వరకు గార్డెన్ లోని 75 రకాల అరుదైన థీమ్ పార్క్స్ సందర్శన, 11 గంటల నుండి 12.30 గంటల వరకు వర్చ్యువల్ వైల్ లైఫ్ సఫారీ సందర్శణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు మరిన్ని వివరాల కోసం 94935 49399, 9885298980 నెంబర్లపై సంప్రదించాలని ఆయన కోరారు.

## కుమ్మరులు... ఆరోగ్యప్రదాతలు

**ప్రజాపక్షం/భువనగిరి :** రాష్ట్ర ప్రభుత్వం కుమ్మరి కులస్తులను అన్ని రకాలుగా ఆదుకుంటుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. భువనగిరి పట్టణంలో మట్టి పాత్రలను(కుండలను) ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోనుగులు చేశారు. మట్టి పాత్రలో ఏ వంట చేసిన అద్భుతంగా ఉంటుందని, మట్టితో చేసిన పాత్రల్లో వంట వండుకోవడం ఆరోగ్యానికి కూడా చాలా మంచిదని పేర్కొన్నారు. కుమ్మరి వాడాలో తాదూరి కృష్ణ వద్ద ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మట్టితో చేసిన వంట పాత్రలను స్వయంగా కారు దిగి కోనుగులు చేశారు. కుమ్మరి కులస్తుల యొక్క స్థితి గతులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



## నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ క్రియాశీల కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని, రాబోయే ఎన్నికల్లో నిజాయితీగా పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చి అవకాశం కల్పించాలన్నారు. కింది స్థాయిలో కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించడం నాయకుల బాధ్యత అని స్పష్టం చేశారు. వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. బీఆర్ఎస్ గత పది సంవత్సరాలు అబద్ధాలు చెప్పి అధికారం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎన్నో అద్భుతమైన పథకాలు అమలైనాయని గుర్తు చేశారు. ముఖ్యంగా సన్న బియ్యం పథకం అద్భుతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు.





## రైతులు ఎండాకాలం ఇబ్బంది పడొద్దు

### రైతులకు స్వయంగా మజ్జిగ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలం ఎదుల్లగూడెం గ్రామం పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ హనుమంత రావు సందర్శించి రైతులకు స్వయంగా మజ్జిగ పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ పిలుపుమేరకు రైతులకు మజ్జిగ పంపిణీ చేసేందుకు ఆదర్శ రైతు వెంకటేష్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. వేసవికాలంలో రైతులకు వడదెబ్బ కొట్టకుండా మజ్జిగ ఉపయోగ పడుతుందన్నారు. తోటి రైతులు రైతు వెంకటేష్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఆదర్శంగా నిలిచిన రైతు వెంకటేష్‌ను అభినందిస్తూ వెంకటేష్‌తో పాటు అతని తండ్రి అంజయ్యను సన్మానించారు. ఎండాకాలంలో రైతులు ఇబ్బంది పడకుండా ఉండాలంటే తోటి రైతుల సహకారం ఎంతో అవసరం అన్నారు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులు ధాన్యం దగ్గరే ఉండి ధాన్యాన్ని చూసుకుంటారని రైతులు బయటికి వెళ్లే పరిస్థితి ఉండదని, అందుకోసం వేడిని తట్టుకునేలా మజ్జిగ ద్రావణం అవసరమన్నారు. రైతుల కోసం ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నీడ, చల్లని మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి రైతుల కోసం ప్రత్యేకంగా మజ్జిగ అందించి వారి దాతృత్వాన్ని చాటుకోవాలన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** పెన్‌పహాడ్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ పెన్‌పహాడ్ మండలం చిదెళ్ల పిఏసిఎస్ వైస్ చైర్మన్ వావిళ్ల రమేష్‌గౌడ్ మంగళవారం జిల్లా పరిషత్ సిఇవో వివి అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 29 గ్రామ పంచాయతీలుండగా ఇందిరమ్మ కమిటి సభ్యులు ఎక్కువ భూములున్న వారికి, పక్కా ఇళ్లు ఉన్న వారికి ఇండ్లు కేటాయిస్తూ లేని వారిని జాబితాలో చేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారికి, సంపన్నులకు ఇళ్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల అర్హులైన వారికే కేటాయిస్తామని పదే పదే ప్రభుత్వ పెద్దలు చెబుతుంటే, ఇందిరమ్మ కమిటి సభ్యులు మాత్రం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటి సభ్యులు డబ్బులు దండుకుని అనర్హులను ఎంపిక చేశారని, దీనిపై ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కమిటిల ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను గ్రామ పంచాయతీలలో ప్రజలకు అందుబాటులో ఉంచాల్సి ఉండగా గోప్యత పాటిస్తున్నారని అన్నారు. ఈ అక్రమాలపై పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంగారపు శ్రీనివాస్, భూక్య అశోక్, భూక్య వెంకటేశ్వర్లు, చంటినాయక్ పాల్గొన్నారు.

## యువజన హక్కుల సాధనకు ఉద్యమం

**ప్రజాపక్షం/వలిగొండ :** అఖిల భారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా రెండవ మహాసభలు యాదగిరిగుట్టలో జరుగుతున్నాయి. ఈ మహాసభలకు వలిగొండ మండల కేంద్రం నుండి భారీగా తరలి వెళ్లారు. వలిగొండ మండలం కార్యదర్శి పోలేపాక యాదయ్య జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన హక్కుల సాధనకు సామాజిక అభివృద్ధికి పాటుపడుతూ యువజన ఉద్యమాలకు వేదికగా ముందుకు సాగుతుందని వారన్నారు. ఈ కార్యక్ర మంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మారోజు నరసింహ చారి, సుద్దాల సాయికుమార్ , ఏఐవైఎఫ్ మాజీ నాయకులు కట్ల యాదగిరి, నాయకులు మేడి దేవేందర్, నార్కట్పల్లి మచ్చ గిరి, మామిడికాయల నరేష్, నూకల ఉదయ్, అంతటి రాము, చిరబోయిన శంకర్, రచ్చ శివరాజ్, బొడ్డు గౌతం, కందుకూరి సాయి తేజ పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై పోరాటాలు

**ప్రజాపక్షం/చండూరు :** ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య అన్నారు. మంగళవారం చండూరు మండలం కొండాపురం సిపిఐ గ్రామ శాఖ మహాసభకు మండల పార్టీ కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్‌తో కలిసి ముఖ్య అతిథిగా హజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకుఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని అన్నారు. ఇల్లులేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులు , ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొండాపురం గ్రామంలో సిపిఐ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి చేయాలని అన్నారు. మే 12న దోనిపాముల లో జరుగు మండల మహాసభను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ గ్రామశాఖ నూతన కార్యదర్శిగా గడ్డం నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికైయారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , మండల పార్టీ సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు , మండల పార్టీ కార్యవర్గ సభ్యులు బండమీది వెంకన్న, కర్నాటి వెంకటేశం , బరిగెల వెంకటేశం , సిహెచ్ ఊషయ్య , ఇరిగి సంజీవ , నాయకులు బరిగెల శ్రవన్ కుమార్ పాల్గొన్నారు.



# భూసమస్యల పరిష్కారానికే భూభారతి

### ఎంపి చామల కిరణ్ కుమార్



**ప్రజాపక్షం/నల్లగొండ (శాలి గౌరారం):** భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌లో భూ సమస్యలకు పరిష్కారం లేదని, అలాంటిది భూ భారతిలో రైతుల భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలలో భాగంగా మంగళవారం శాలిగౌరారం మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ధరణిలో సమస్యలు పరిష్కరించేందుకు అధికారులకు కూడా అవకాశం ఉండేది కాదని, భూ భారతిలో సమస్యలను పరిష్కరించే అధికారం తహసీల్దార్ నుండి మొదలుకొని జిల్లా కలెక్టర్ వరకు ఇవ్వడం జరిగిందని, 80 శాతం సమస్యలు తహసీల్దార్ వద్దనే పరిష్కారం అవుతాయని ఎంపి అన్నారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ మాట్లాడుతూ మనిషికి జీవనాధారమైన భూమి సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చిందన్నారు. ధరణి వలన కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి తీసుకొచ్చిందన్నారు. ధరణిలో కొంతమంది మాత్రమే లబ్ధి పొందారని, తమ ప్రభుత్వం భూ సమస్యలకు పరిష్కారం కల్పించే విధంగా స్పష్టమైన చట్టం భూభారతిని తీసుకువచ్చిందన్నారు. జూన్ 2 నుండి భూ భారతి పోర్టల్ అమల్లోకి వస్తుందని, చట్టం ఇదివరకే అమలులో ఉందని చెప్పారు. రైతులు భూములను ఎవరు అన్యాక్రాం తం చేసుకోవడానికి భూ భారతిలో అవకాశమే లేదని, సరైన ఆధారాలు రికార్డులు కలిగి ఉండి మోక మీద ఉంటే చాలు అన్నారు. శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, తహసిల్దార్ సైదులు , మార్కెట్ కమిటీ అధ్యక్షులు శంకర్ రెడ్డి ,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు మురళి, వైస్ చైర్మన్ నరసింహ పాల్గొన్నారు.

## భూభారతి చట్టం రైతులకు చుట్టం

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపి చామల

**ప్రజాపక్షం/తుర్కపల్లి:** భూ వివాదాల పరిష్కారం కొరకు పుట్టిందే భూభారతి చట్టం అని, భూభారతి చట్టం రైతులకీ చుట్టమని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతితులుగా పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీలతో పాటుగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హాజరయ్యారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన నిర్వహించి భూభారతి చట్టం పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఆధార్ లాగా ప్రతి భూమికి భూదారని చెప్పారు.భూమి రికార్డులను మోసపూరితంగా మార్చి ప్రభుత్వ, భూధాన్, అసైన్డ్, దేవాదాయ, భూములను ఎవరైనా పట్టా చేసుకుంటే వాటిని రద్దు చేసేలా సిసిఎల్ఏకి అధికారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మార్వో దేశ్య, ఎంపిడిఓ జాన్సీ లక్ష్మి , నాయకులు శంకర్ నాయక్ పాల్గొన్నారు.



# పోరాటాల ద్వారానే సమూలమైన మార్పులు

### ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే ఆలోచనలే ఈ దేశంలోని బలహీన వర్గాలకు నిమ్న జాతులకు బలమైన ఆయుధాలని వాటి ద్వారానే సమసమానత్వం సాధ్యమని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గడియారం చౌరస్తాలో పూలే అంబేద్కర్ జన జాతర బహిరంగ సభ నిర్వహించడం జరిగింది. పూలే,అంబేద్కర్ మహనియులకు పూలమాలలు వేసి సభ ప్రారంభించారు.ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ 200 సంవత్సరాల క్రితం పుట్టిన మహాత్మ జ్యోతిరావు పూలే అర్థం చేసుకున్నది ఏమిటంటే ఈ దేశంలో ఒక కులం ఏర్పడి ఉన్నది.ఈ దేశంలో బ్రాహ్మణీయ అధిపత్య వర్గాలు అంతరాలు సృష్టిస్తూ లబ్ధి పొందుతున్నారని ఈ వ్యవస్థను అర్థం చేసుకోలేనంత కాలం మనం మనుగడ సాధించలేమన్నారు. అంబేద్కర్ పూలే అనే మహనీయులు ఈ దేశ చరిత్రలో నిలిచిపోయారంటే వారు అభ్యసించిన విద్య మాత్రమేనని దాని ద్వారానే సమూలమైన మార్పులు సృష్టించబడతాయని నిరూపించారని వారన్నారు.దోపిడీకి పీడనలకు వ్యతిరేకమైన అనేక అంశాలను తొలగించుకుంటూ ఈ పాలకులు వస్తున్నారన్నారు. కాశ్మీర్ ఫైల్స్, రజాకార్ ఫైల్స్ వంటి సినిమాలు తీసి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు అన్నారు. ఈ సభకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున చేయగా, జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను అధ్యక్షత వహించంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు ,ఈ కార్యక్రమం లో సామజిక ప్రజా, సంఘాల నాయకులు డాక్టర్ రాజు, రిటైర్డ్ ఐఏఎస్ చోలేటి ప్రభాకర్,తాళ్లపల్లరవి, రుద్రాక్షి దుర్గయ్య ,వెంకటేశ్వర్లు,పివెంకులు,పాలడుగు ప్రభావతి, సాగర్, బకారం శ్రీను పందుల సైదులు మానుపటి బిక్షం, కత్తులు షణ్ముఖ్, సయ్యద్ హాశం కత్తుల జగన్, ఐతాగొని జనార్దన్, వైద్యులు సత్యనారాయణ,కొండమడుగు నర్సింహ్ గంజి మురళీదర్ పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఇన్చార్జ్ రెవెన్యూ అదనపు రెవెన్యూ కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ కోరారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా 33 మంది పిర్యాదుదారులు ఫిర్యాదులను సమర్పించారు. ఇందులో 19 వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు రాగా, 14 రెవెన్యూ శాఖకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. ఫిర్యాదుల స్వీకరణ సందర్భంగా ఆయన జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యల పరిష్కారం నిమిత్తం సమర్పించే దరఖాస్తులను జిల్లా అధికారులు ప్రత్యేకంగా పరిశీలన చేయాలని, ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వారి శాఖ పరిధిలో పరిష్కరించేవి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఒక వేళ పై స్థాయిలో ఫిర్యాదు పరిష్కారమయ్యేలా ఉంటే పై స్థాయికి వెంటనే పంపించాలని చెప్పారు.స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ పీడి రాజకుమార్ ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,చండూరు ఆర్ డి ఓ శ్రీదేవి, ఇతర అధికారులు ఈ కార్యక్రమానికి హాజరై ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

## విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు

### యాదాద్రి భువనగిరి జిల్లా డిఆర్‌డిఏ నాగిరెడ్డి




**ప్రజాపక్షం/మోటకొండూరు :** విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాదాద్రి భువనగిరి జిల్లా డిఆర్‌డిఏ నాగిరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మోటకొండూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 4వ విడత సామాజిక తనిఖీ ప్రిసైడింగ్ అధికారిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 2024 ఏప్రిల్ 1 నుండి 31మార్చి 2025 వరకు జరిగిన 294 పనులకు గాను 2కోట్ల 47 లక్షలు కూలీలకు ఖర్చు చేసినట్లు, పంచాయతీ రాజ్ శాఖ నుండి 1 కోటి 60 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. గత 10 రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలలో పర్యటించి కూలీలలతో గ్రామసభలు నిర్వహించి, తుది జాబితాను సామాజిక తనిఖీ బృందం చదివి వినిపించినట్లు, ఎక్కడ అవినీతి అక్రమాలకు తావులేకుండా పకడ్బందీగా ఉపాది హామీ పథకం అమలు జరుగుతుందని తెలిపారు. పని వత్తిడి వలన సిబ్బంది కొలతలలో తేడాలు నిర్వహించినట్లు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందికి మొత్తం రూ.13,822 పెనాల్టి వేసినట్లు నాగిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఉపేందర్ రెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ఆదిత్య వర్ధన్, ఎస్‌ఆర్‌పి తిరుపతి, ఎంపిడిఒ ఇందిర, ఎపిఓ అరుణకుమారి, ఇంచార్జి ఎపిఓ జూనియర్ ఇంజనీర్ గోవార్ధన్, ఎంపిఒ చంద్రశేఖర్, సామాజిక తనిఖీ బృందం డిఆర్‌పిలు, పంచాయతీ కార్యదర్శులు, టిఏలు, సిఓలు, క్షేత్ర సహయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాషపై పట్టు సాధించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** విద్యాద్వారానే సమాజం మార్పు చెంది పేదరికం తొలగిపోయి దేశం అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూర్యాపేట డివిజన్ నియోజకవర్గ పరిధిలోని సూర్యాపేట, ఆత్మకూర్, పెన్‌పహడ్, చివ్వెంల, మోతె మండలాలకి చెందిన ఎంఇవో, స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో, ఉపాధ్యాయులతో, పౌండేషన్ లీటరిస న్యూమరసి (ఎఫ్ఎల్‌యన్) పై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన చదువు బోధిస్తామని విద్యార్థుల్లో నమ్మకం కల్గించి వచ్చే విద్యా సంవత్సరంకి ఎక్కువ మంది విద్యార్థుల నమోదు అయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు బాధ్యతగా ఉంటూ గత సంవత్సరంలో జరిగిన వైఫల్యాలు సరిచేసి వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రాథమిక పాఠశాలలో తెలుగు బాష రాయడం, చదవటం అలాగే ఇంగ్లీష్, మాథ్స్‌లో కనీస సామర్థ్యాలు కల్పించేలా కృషి చేయాలని అన్నారు. ఇక నుండి ప్రతి సంవత్సరం మంచిగా చదివిన విద్యార్థులకు, మంచి ప్రదర్శన చూపెట్టిన ఉపాధ్యాయులకు మండల స్థాయిలో బహుమతి, జిల్లా స్థాయిలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఇప్పటి నుండి ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా అందరూ ప్రతి విద్యార్థివి అసెస్‌మెంట్ రిపోర్టు, వార్షిత పరీక్షల రిపోర్టు, విద్యార్థుల పనితీరు, తెలుగు, ఇంగ్లీష్, గణితంలో కనీస సామర్థ్యాలు, ఎల్ఎఫ్ఎన్ వార్షిక పరీక్షలపై రిమార్కులపై ఎప్పటికప్పుడు మండల విద్యాధికారికి సమర్పించాలని కోరారు. ఈ సమావేశంలో డిఇవో అశోక్, క్వాలిటి కోఆర్డినేటర్ జనార్ధన్, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రవణ్‌కుమార్, ఇంక్లూజీవ్ కోఆర్డినేటర్ రాంబాబు, జనరల్ ఈక్వాలిటి కోఆర్డినేటర్ పూలమ్మ, ఎంఇఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# వాడవాడలా మేడే వేడుకలు నిర్వహిద్దాం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ప్రపంచ కార్మిక పోరాట దినం 139వ మేడేను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించి మేడే పోరాట చరిత్రను కార్మికులకు వివరించాలని ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు బొలగాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరిలో 139వ మేడేకు సంబంధించిన గోడపత్రికాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను రద్దుచేస్తూ, పని గంటలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 12 గంటలుగా మార్చుటకు కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని విమర్శించారు. నేడు దేశంలో అసంఘటితరంగా కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వారికి కనీసం పని భద్రత, ఎలాంటి సౌకర్యాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్, సహాయ కార్యదర్శులు గనబోయిన వెంకటేష్, కూరేళ్ల మచ్చ గిరి, గోపగాని రాజు, కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, పల్లె శ్రీనివాస్, పుట్ట రమేష్, కౌన్సిల్ సభ్యులు చొప్పరి సత్తయ్య, దుబ్బాక సంజీవ, దాసరి లక్ష్మ య్య, పాపగళ్ల శంకరయ్య, బస్వయ్య, గౌరవంతల శ్రీనివాస్, పురుగుల రవి, ఎస్. కే.మన్సూర్ పాషా పాల్గొన్నారు.




ఫోటో: 29ఎంఎల్‌జీ 3 ఏఐటీయూసీ జెండాకు పెయింటింగ్ వేస్తున్న నాయకులు

### మేడేను విజయవంతం చేయాలి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు సయీద్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్ పిలుపునిచ్చారు. కారు, జీపు అడ్డా వద్ద పట్టణంలోని ప్రధాన కూడలిలో సీపీఐ, ఏఐటీయూసీ దిమ్మెలకు పెయింటింగ్ వేస్తున్న సందర్భంగా ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను పాలక ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్పు చేసే ప్రయత్నాన్ని కార్మికులు తిప్పి కొట్టాలన్నారు. మేడే వేడుకలను వాడవాడలా నిర్వహించాలన్నా రు. ఈ కార్యక్రమంలో జీపు, కారు యూనియన్ ప్రధాన కార్యదర్శి అఫ్జర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపానాయక్, కోశాధికారి వెంకన్న, శ్రీనివాసరాజు, జానయ్య, రఫి, పాషా, హాజీ పాల్గొన్నారు.



## బొలెరో వాహనం ఢీ... ఇద్దరు విద్యార్థులు దుర్మరణం



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధిః** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బిఎస్పీ నర్సింగ్ కాలేజీలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కాలేజీ ముగించుకొని ఆశకు తిరిగి ప్రయాణమవుతుండగా మృతి రూపంలో బొలెరో వాహనం ఢీకొని ఇద్దరు విద్యార్థినిలు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో చోటుచేసుకుంది. గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం రోజు వారీగా కళాశాలకు వెళ్లి సాయంత్రం ఐదు గంటలకు కళాశాల పూర్తయిన తర్వాత సమీపంలోని న్యూ హౌసింగ్ బోర్డ్ టర్నింగ్ దగ్గర బస్ కోసం వేచి ఉండగా ఎర్రవల్లి చైరస్తా నుంచి అతివేగంగా వచ్చిన బొలెరో వాహనం విద్యార్థుల పైకి దూసుకెళ్లడం తో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందగా మరో నలుగురు విద్యారినీలకు తీవ్ర గాయాలయ్యాయి. బీఎస్పీ మూడో సంవత్సరం చదువుతున్న మక్తల్ కు చెందిన మహేవ్వరి (20), వనపర్తికి చెందిన మనిషా శ్రీ (21) నీ బొలెరో వాహనం సమీపంలోని కరెంటు పోల్ కు తీసుకు వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. వైర్లు సైతం తెగిపడ్డాయి. అక్కడే పానిపూరి బండిని ఢీకొట్టడంతో అక్కడ నిలుచున్న ఓ బాలుడు పై గ్యాస్ సిలిండర్ ఆయిల్ పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ విద్యార్థినీలను తక్షణమే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సంతోష్ కుమార్, ఎస్పీ శ్రీనివాస రావు, ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి , జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని మృతి చెందిన విద్యార్థినీల కుటుంబాలను పరామర్శించి, తీవ్రంగా గాయపడ్డ విద్యార్థినీలకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి ఆదేశించారు. కలిసిమెలిసి చదువుకుంటున్న విద్యార్థినీలు కళ్ల ఎదుట మృత్యువు కబలించడంతో తోటి విద్యార్థినీలు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రికి పెద్ద ఎత్తున బాధిత కుటుంబాలు, తోటి విద్యార్థినీలు చేరుకొని విగత జీవులుగా పడి ఉన్న తన స్నేహితురాళ్ళను చూసి కన్నీటి పర్యంతం అవడంతో ఎమ్మెల్యే, కలెక్టర్ వారిని ఓదార్చారు.

## ఆలయభూములు కాపాడాలని వినతి



ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ : మండలపరిధిలోని రఘుపతిపేట రామగిరిదేవాలయ భూములను కాపాడాలని దేవాదాయశాఖ ఆడిషనల్ కమీషనర్ కృష్ణవేణికి గ్రామస్తులు, బిజెపి నాయకులు వినతిపత్రం అందజేశారు. దేవాలయ భూములకు 540 ఎకరాలకు సంబంధించిన భూములలోని వంద ఎకరాలకుపైగా ఉన్న గుట్టను కొంతమంది కాంట్రాక్టర్ ఇష్టరీతిన మట్టిని అక్రమంగా తరలించడం జరుగుతుందని, మట్టిని అక్రమంగా తవ్విన కాంట్రాక్టర్లపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిజెపిరాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలిదుర్గాప్రసాద్, మండలఅధ్యక్షులు నరేష్‌గౌడ్, మాజీటౌన్ ప్రెసిడెంట్ బోడనర్సింహ్మ, పిఎసిఎస్‌వైస్‌చైర్మన్ శ్యామ్‌సుందర్, రఘుపతిపేట గ్రామస్తులు మల్లిఖార్జున్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లక్కీ డ్రా ద్వారా బార్ల కేటాయింపు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని వీడియోకాన్ఫరెన్స్‌హాల్లో అచ్చంపేట మున్సిపాలిటి పరిధిలోని మద్యం దుకాణాలను సంబంధించి జిల్లా ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ అధికారి గాయత్రి, జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం ఆధ్వర్యంలో రద్దయిన బార్ల లాటరీ పద్ధతిన కేటాయించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అచ్చంపేట మున్సిపాలిటిపరిధిలోని రద్దయిన బార్లస్థానంలో తిరిగి ఏర్పాటు సంబంధించి (02) మద్యం దుకాణాలు ఉండగా 18 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. బార్ల కేటాయింపు ప్రక్రియ లక్కీడ్రా పద్ధతిన పూర్తి పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు.

## ఆర్టీఐ యాక్టివిస్ట్స్ ఫోరమ్ అధ్యక్షులుగా వెంకటేశ్వర్లు





ప్రజాపక్షం/అడ్డాకుల: సమాచార హక్కు చట్టం ఆక్టీవిస్ట్స్ ఫోరమ్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు గా అడ్డాకుల మండలానికి చెందిన మంగరాయి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నాడు రాష్ట్ర అధ్యక్షులు బత్తు ల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైయినా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటే జిల్లాలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుకు కృషి చేస్తానని, ఆర్టీఐ పై అవగాహన కార్యక్రమాలు చేపడతానని సొసైటీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సహ చట్టం ద్వారానే ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత జవాబుదారీ తనం సాధ్యమన్నారు. తన పైన ఉన్న నమ్మకంతో తనకు బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు, కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.



## పదోన్నతితో విధులపట్ల మరింత బాధ్యత

### ఎస్పీ యోగేష్ గౌతమ్

ప్రజాపక్షం/ నారాయణపేట్ : పదోన్నతి విధుల పట్ల ఉత్సాహాన్ని పెంచడంతో పాటు మరింత బాధ్యతను పెంచుతుందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ అన్నారు. మక్తల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న 1984 బ్యాచ్ కి చెందిన ఎఎస్ఐ. ఎండి ఖాజా మసియొద్దీన్ ఎస్సైగా పదోన్నతి పొంది మంగళవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌత మ్ ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఎస్పీ, అదనపు ఎస్పీ ఎండి. రియాజ్ లు నూతనంగా పదోన్నతి పొందిన ఎఎస్ఐ కి, ఎస్సై రెండు స్టార్స్ తొడిగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి విధుల పట్ల మరింత బాధ్యతను పెంచుతోందని భవిష్యత్‌లోనూ ప్రజలకు ఉత్తమ పోలీసు సేవలను అందించాలని తెలిపారు. ఎస్ఐ గా పదోన్న తి పొందిన మాసియొద్దీన్ హైదరాబాద్ సిఐడి విభాగానికి బదిలీ అయ్యారు.

**మత్తు పదార్థాల నిర్మూలనకు ఆకస్మిక తనిఖీలు**



మంగళవారం రోజు ఉట్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని జిల్లా యోగేష్ గౌతమ్ ఐపిఎస్ తెలిపారు. గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన గురించి, అక్రమ రవాణా జరగకుండా ఉట్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ముఖ్యం గా కిరాణా షాపులలో, అనుమానంగా ఉన్న ప్రధాన చౌరస్తాలో, తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్న లేదా రవాణా చేసిన, సరఫరా చేసిన వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీ సులకు సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్కూరు పోలీసులు విజయ్, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పరమేష్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/వంగూర్:మండలపరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మల్లెపాకుల పెద్దమైసయ్య అనారోగ్యంతో గతకొన్ని రోజులనుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు విష్ణు, మల్లెపాకుల వెంకటయ్య, ప్రసాద్, సైదులు, అనిల్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

### ఎమ్మెల్యే జియంఆర్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: జిల్లాలో బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని పటిష్టం చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. అనంత రం తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ కొత్వాల్ తో కలిసి మీడియాతో మాట్లాడుతూ గత అసెం బ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం తరువాత స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీని విజయం వైపు నడిపించేందుకు గ్రామస్థాయిలో బూత్ కమిటీల నుండి జిల్లా కమిటీ వరకు సమావేశ నిర్వహిస్తూ కమిటీలను పునర్‌నిర్మిస్తూ బలోపేతం చేసేందుకు ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అధికారం కోల్పోయిన టిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం పై విష ప్రచారం చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు నమ్మే స్థితిలో లేరని వారు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా పార్టీ పరిస్థితి సాంబయ్య మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తరువాత ధన బలంలో వరంగల్లు ప్రజలను సమీకరించి కాంగ్రెస్ పార్టీని విమర్శించడం తప్ప కేసీఆర్ 10 సంవత్సరాల పనులు ప్రజలకు ఏమి చేశారో చెప్పలేకపోయారని విమర్శించారు. కెసిఆర్ 10 సంవత్సరాల పాలనలో ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదు, విద్యార్థులకు కాస్మోటిక్ మిస్ ఛార్జీలు ఎందుకు పెంచలేదు, ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేయలేదు, కుల గణాంకన ఎందుకు చేపట్టలేదు ప్రజలకు వివరించి ఉండే కొంతైనా ఆయనపై సానుభూతి వస్తుందదన్నారు. మహిళల కు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకు ఉచిత కరెంటు ఇచ్చినందుకు రైతు రుణమాఫీ చేసినందుకు కుల గణన చేపట్టినందుక ఎందుకు కెసిఆర్ బాధపడుతున్నారు. విలేకరుల సమావేశంలో పిసిసి కార్యదర్శి వినోద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బేకరీ అనిత, మధుసూదన్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు లక్ష్మ ణ్ యాదవ్, సాయిబాబా తదితరులు పాల్గోన్నారు.



## సమాచారహక్కు చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన

### అదనపు కలెక్టర్ దేవసహాయం





ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: సమాచారహక్కు చట్టంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం తెలిపారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసిహాలులో సమాచార హక్కు చట్టం, గ్రామసభ నిర్మాణ సామర్థ్యంపై పంచాయతీ కార్యదర్శులకు డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చెందించడంలో పంచాయతీ కార్యదర్శులు ముఖ్యపాత్ర పోషిస్తారని కావున పంచాయతీ కార్యదర్శులు అందరూ సమాచారహక్కుచట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

కేంద్ర, రాష్ట్రప్రభుత్వా లు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఇద్దరుచొప్పున పంచాయతీ కార్యదర్శులకు సమాచారహక్కుచటపై, గ్రామసభ నిర్వహణ సామర్థ్యంపై శిక్షణ తరగతులు ఏర్పాటుచేయడం జరిగిందని వాటిని సద్వినియోగపర్చుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామఅభివృద్ధి గ్రామసభపై ఆధారపడి ఉంటుందని గ్రామసభ నిర్మాణం, నిర్వహణపై పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామంలోని ప్రజలందరిని గ్రామసభలో భాగస్వాములు చేయాలని సూచించారు. సమాచారహక్కు చట్టం, గ్రామసభల నిర్మాణ సామర్థ్యంపై సంవత్సరం పొడుగునా అధికారులకు ప్రజాప్రతినిధులకు మహిళా సంఘాలకు సంబంధితశాఖల అధికారులకు శిక్షణ నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

ఈశిక్షణ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పంచాయతీ జిల్లా అధికారి పంచాయతీరాజ్, జిల్లా అధికారి రాంమోహన్‌రావు, రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ ఎస్. హన్మంతు, రీసోర్స్‌పర్సన్స్ కృష్ణ, కోటేశ్వరరావు, నర్సిరెడ్డి, పంచాయతీ కార్యదర్శు లు పాల్గొన్నారు.

**గ్రామాలలో పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణ**

నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో సంబంధితశాఖల అధికారులతో గ్రామీణ నీటిసరఫరా పారిశుద్ధ్యానికి సంబంధించిన పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ దేవసహాయం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దేవసహాయం మాట్లాడుతూ భూగర్భజలాలు పెంపొందించడానికి ఇంకుడు గుంతల నిర్మాణం అత్యంత ఆవశ్యకమైనదని, నీటి అవసరాలను తీర్చడమేకాకుండా భవిష్యత్తుతరాలకు నీటిని అందించడానికి నీటి కొరతను నివారించడానికి ఉపయోగపడుతుందన్నారు. డిసెంబర్ 2025 నాటికి అన్ని గ్రామాలు ఓడిఎఫ్‌ప్లస్ మోడల్ గ్రామాలుగా మార్చాలని అధికారులని ఆదేశించారు. గ్రామాలలోని ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలను విస్తృతంగా ఏర్పాటుచేయాలని, మురుగునీరు నిల్వ ఉండే చోటు గుర్తించి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు.

గ్రామాల్లో శుభ్రత పాటించాలని పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలని తెలిపారు. గ్రామాలలో ఏర్పాటుచేసిన వ్యర్థపదార్థాల నిర్వహణ సక్రమంగా జరిగేటట్లు చర్యలు చేపట్టాలని, గ్రామాల్లోని ప్రజలందరికి సురక్షితమైన మంచినీటిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మిషన్‌భగీరథ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఉండే డ్రైనేజి వ్యవస్థను మెరుగుపర్చాలని, మురుగునీరుచేరే చివరిప్రాంతంలో ఇంకుడు గుంతలు ఏర్పాటుచేయాలని తద్వారా మంచివాతావరణం పెంపొందించాలని తెలిపారు. జిల్లా నీటి, పారిశుద్ధ్య మిషన్ గ్రామీణ నీటి, పారిశుద్ధ్య కమిటిప్రతినెల సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

గ్రామాలలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు పకడ్బందీగా నిర్వహించాలని తెలియజేశారు. గ్రామాలలో మురుగునీటి వ్యవస్థ సక్రమంగా నిర్వహించి గ్రామాన్ని పరిశుభ్రవంతంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. నిధులకు ఎటువంటి కొరతలేదని అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

ఈసమావేశంలో డిఆర్‌డిఏ పిడిచిన్న ఓబులేసు, డిపిఓ రాంమోహన్‌రావు, డిఇఓ రమేష్‌కుమార్, డిఎఓ చంద్రశేఖర్, డిడబ్ల్యూఓ రాజేశ్వరి, డిటిడబ్ల్యూఓ ఫిరంగి, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

## మానసిక వికాస వేదికలుగా వేసవికాల నృత్యశిక్షణ శిబిరాలు

ప్రజాపక్షం/కల్వకుర్తి: బాలల్లో మానసికవికాసానికి వేదికగా వేసవినృత్య శిక్షణ శిబిరాలు ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, మాజీమంత్రి చిత్తరంజన్ దాస్ అన్నారు. పట్టణంలోని కంచిపురంమాల్ ఎదురుగా మాలిక్‌బైక్‌పాయింట్‌దగ్గర జెఎస్ అకాడకమిడ్యాన్స్ మాస్టర్ శేఖర్ ఆధ్వర్యంలో వేసవికాలనృత్య శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈశిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, మాజీమంత్రి చిత్తరంజన్‌దాస్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 17 సంవత్సరాలనుండి కల్వకుర్తి పట్టణంలో ఎంతో మంది నృత్యకళాకారులను తీర్చిదిద్దివారిని సినీరంగంలో ఉన్నతస్థాయిలో తీర్చిదిద్దారని అన్నారు. నరేందర్‌ను అద్భుతమైన డ్యాన్స్ మాస్టర్‌లాగా అందించిన ఏకైక సంస్థ జెఎస్‌డ్యాన్స్ అకాడమి విద్యార్థిని, విద్యార్థులను, యువతీ యువకులనుశారీరక మానసిక ఉల్లాసంకోసం వారిలో సృజనాత్మకతశక్తిని పోటితత్వాన్ని పెంపొందించడం కొరకు వేసవికాలం నూతన శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌చైర్మన్ మనీలా సంజీవ్‌కుమార్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీసర్పంచ్ జిల్లెల రాములు, మార్కెట్‌డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, మాజీకౌన్సిలర్లు, సూర్యప్రకాష్‌రావు, మధు, శ్రీనివాసులు, ఎజాజ్, శాన్‌వాజ్ ఖాన్, బిజెపి నాయకులు దుర్గాప్రసాద్, బాబి, సీఐ నాగార్జున, డాక్టర్ శివరాం, ఎంఈఓ శంకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## నేడు వనపర్తికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



ప్రజాపక్షం/వనపర్తి : ఈ నెల 30న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వనపర్తికి రానున్నారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు హెలిపాడ్ ద్వారా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2.10 గంటలకు మెడికల్ కళాశాల వద్ద నూతనంగా నిర్మించిన బాలికల వసతి గృహాన్ని, కళాశాల ప్రధానాచార్యుల నివాస సముదాయాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2.20 గంటలకు వనపర్తి ఎంపిడిఓ కార్యాలయ సముదాయంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభిస్తారు. రేవల్లి, ఏదుల, శ్రీరంగాపురం మండలాలకు నూతనంగా మంజూరైన తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణాలకు ఇక్కడే శంకుస్థాపన చేస్తారు. ఎస్సీ రెసిడెన్షియల్ వసతి గృహ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీ కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ కళాశాల బిసి వసంతి గృహం పునరుద్ధరణ పనులను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2.40 గంటలకు నల్ల చెరువు మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు పట్టణంలోని కళ్యాణ సాయి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. వేసవి శిక్షణ శిబిరాలకు క్రీడా సామాగ్రి పంపిణీ చేయు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం వనపర్తి మండల భూ భారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ గోవర్ధన్ సాగర్, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య పాల్గొంటారు.

### ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్



మహబూబ్ నగర్ ప్రతినిధి: భూ భారతి చట్టం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సి.సి. కుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ శివారులో కురుమూర్తి దేవస్థానం వద్ద బుధవారం నిర్వహించే భూ భారతి ఆర్.ఓ. ఆర్ చట్టం అవగాహన సదస్సుకు హాజరవుతున్న రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నాందున కురుమూర్తి దేవస్థానం వద్ద భూ భారతి అవగాహన సదస్సు నిర్వహణ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, దేవరకద్ర నియోజకవర్గం శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డితో కలిసి పర్యవే క్షించారు. కురుమూర్తి దేవస్థానం వద్ద నిర్వహించే భూ భారతి అవగాహన సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూ భారతి అవగాహన సదస్సుకు స్టేజి, సీటింగ్, సౌండ్ సిస్టం, పారిశుధ్యం ఏర్పాట్ల పై కలెక్టర్ అధికారుతో చర్చించి సూచనలు చేశారు. హెలిపాడ్ ను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్.డి.ఓ నవీన్, డి.ఆర్.డి.ఓ నర్సింహులు, డి.పి. ఓ పార్థ సారథి, ఆర్అండ్‌బి ఇఇ దేశ్యా నాయక్, డి.పి. ఆర్.ఓ శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫ ర్మేషన్ ఇంజినీర్ ఇస్రా నాయక్ తదితరులు ఉన్నారు.

## అన్ని వసతులతో ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు ఏర్పాట్లు

### కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు కేటాయించే స్థలాన్ని అన్ని వసతులతో త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండాపూర్ తుమ్మల కుంట తండా, రేగడి పట్టి తండా, చిన్నగుట్ట తండా, శామ గడ్డ, తండా ఒంటి గుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రం లో ఇండ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు అవార్డు అందుకున్న వారందరికి పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం, వారి అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్ కమ్యూనిటీ హాల్స్ , పార్కులను, ఓవర్ హెడ్ ట్యాంక్, మిషన్ భగీరథ పైపులు వంటి మౌలిక సదుపాయాలు త్వరితగతిన పూర్తయ్యేలా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ పైపులైన్లు ఇచ్చిన గడువులోగా త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మోహన్ రావు, స్పెషల్ కలెక్టర్(ఎల్.ఎ) మధుసూదన్ రావు, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్,మిషన్ భగీరథ, సర్వే ల్యాండ్ రికార్డు, పంచాయతీరాజ్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

### డిపిఆర్ఓ రషీద్



ప్రజాపక్షం/ నారాయణపేట్ : ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది సహజమని జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి రషీద్ అన్నారు. నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని బిసి బాలుర కళాశాల వసతి గృహ వార్డె న్ మొహమ్మద్ మాసూద్ పదవి విరమణ కార్యక్రమం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపుదారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో మంగళవారం వివిధ శాఖల అధికారులు, ఉద్యోగు లు, వసతి గృహాల సిబ్బంది, మసూద్ కుటుంబ సభ్యుల మధ్య ఎంతో ఆర్భాటంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిపిఆర్ఓ మాట్లాడుతూ. ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన రోజు పదవి విరమణ తేది కూడా నిర్ణయించబడుతుందని చెప్పారు. పదవి విరమణ అనేది కేవలం ఉద్యోగానికే కానీ, వయసుకు కాదన్నారు. మసూద్ శేష జీవితం ఆయురారోగ్యాలతో ఎంతో సంతోషంగా గడపాలని డిపిఆర్ఓ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన బి. సి సంక్షేమ అభివృద్ధి అధికారి అబ్దుల్ ఖలీల్ మాట్లాడుతూ మసూద్ అందించిన సేవలు గుర్తు చేశారు.

ప్రతీ ఉద్యోగికి పదవి విరమణ తప్పదని, కానీ ఉద్యోగ పరంగా మనం ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి ఉమాపతి, సిపిఒ యోగానంద్, రిటైర్డ్ సూపరిఇన్‌డెంట్ అబ్దుల్ నయి మ్, రిటైర్డ్ డిబిసిడిఒ నిర్మల, సుబ్బారెడ్డి, వసతి గృహాల వార్డెన్లు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫార్మాసిస్టుల హర్షం



ప్రజాపక్షం/కల్వకుర్తి: కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో తెలంగాణప్రభుత్వం ఫార్మాసిస్టులపట్ల తీసుకున్న నిర్ణయానికి హర్షం వ్యక్తంచేస్తూ ఫార్మాసిస్టులకుశుభాకాంక్షలు తెలుపుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం కేక్‌కట్ చేయించారు. గతంలో గ్రేడ్1ఫార్మాసిస్టు, గ్రేడ్2 ఫార్మాసిస్టు అని పిలవబడుతుండేవారు అయితే జివోఎంఎస్ నెం.71 ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వులలో గ్రేడ్1 ఫార్మాసిస్టులను సీనియర్ ఫార్మాసి ఆఫీసర్స్, గ్రేడ్2 ఫార్మాసిస్టులను ఫార్మాసి ఆఫీసర్లుగా పేర్కొనడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు యశోద, పాండురంగ, ఉదయ్, నర్సింగ్ సూపరింటెండెంట్ శిరోమణి, నర్సింగ్ సీనియర్ ఆఫీసర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం /పాన్‌గల్ :పాన్‌గల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత ప ఆఠశాలలో 1998/1999 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని కేఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళ ం కార్యక్రమంలో నాటి గురువులకు పూర్వవిద్యార్థులు పూలమాలలువేసి శాలువాలతో ఘనంగా సన్మానం చేసి మెమెంటోలను అందజేశారు. నాటి గురువులతో విద్యాబోధనను స్వీకరించుకున్న విద్యార్థులు నేడు వివిధ హోదాలలో ఉద్యోగాలను, ఇతరత్రా పనులను చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఒకరినొకరు పరిచయం చేసుకొని సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు నాటి మధుర జ్ఞాపకాలను స్మరించుకోవడం జరుగుతుందని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాటి గురువులు దామోదర్ రెడ్డి, పుల్లారెడ్డి, నారాయణ రెడ్డి, అలీ, భద్రాశెనయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో

ప్రజాపక్షం/వీపనగండ్ల:మండల పరిధిలోని గోవర్ధనగిరిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వెంటనే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ మంగళవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. గత వారం రోజుల నుంచి రైతులు తీసుకొచ్చిన వరి ధాన్యంలో మట్టి ఉందని, తాలు ఉందని, రైస్ మిల్లర్స్ తిరస్కరిస్తున్నారని, రైతు మిల్లుల యజమానుల సాకు వ్యవహారాన్ని రైతులపై రుద్ది అదనపు తూకం చేయించుకోవాలని , రైస్ మిల్లర్స్ , ఉన్నతాధికారులు రైతులను దోపిడి చేయాలని, పన్నాగం వేసి, ఇతర కారణాలు చెప్పి కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారని రైతులు వాపోయారు. దీన్ని నిరసిస్తూ గోవర్ధనగిరి గ్రామ రైతులు వరి మిషన్‌ను రోడ్డుపై పెట్టి గతంలో మాదిరిగానే రైతుల నుంచి వరి కొనుగోలును ఎలాంటి అదనపు నిబంధనలు పెట్టకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు సమస్యలతో కూడిన పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బుధవారం నుంచి కొనుగోలు ప్రారంభమయ్యేలా ప్రయత్నిస్తానని రైతులకు భరోసా కల్పించారు. దీంతో రైతులు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు ఎం. ఆంజనేయులు, భాస్కర్ రెడ్డి, మోహన్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, చిన్న బిచ్చారెడ్డి, ముంత పరమేష్ , మహబూబ్ పాషా, రమణయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

ఫోకస్

# మహిళ

## ప్రాంతాల వారీగా..

మహిళల అభ్యున్నతి, వారి ఆర్థిక స్వేచ్ఛ, సమానత్వం వంటి పదాలు కేవలం కాగితాలకే పరిమితమన్నది తరతరాలుగా మారని వారి జీవన పరిస్థితులే స్పష్టం చేస్తున్నాయి. విజ్ఞానశాస్త్రం ఎంతగా వికసించినా, అభివృద్ధి ఎన్ని కొత్త పుంతలు తొక్కుతున్నా, కొద్దిపాటి తేడాతో మహిళలు సమస్యలు ఎదుర్కొంటునే ఉన్నారు. తక్కువ, ఎక్కువ అనే వ్యత్యాసాన్ని పక్కకుపెడితే, ప్రపంచంలోని అన్ని ప్రాంతాల వారీగా మహిళల గురించిన వివరాలు పరిశీలించినప్పుడు వారి సమస్యలు పూర్తిగా తీరలేదనే విషయం స్పష్టమవుతుంది.

**భూభాగాల వారీగా మహిళల పరిస్థితి**

**1. ఆఫ్రికా:** బాలికల విద్యలో భారీ వెనుకబాటు ఉంది, ముఖ్యంగా ఉపసహారా ఆఫ్రికాలో. బాల్యవివాహాలు, పేదరికం ప్రధాన అవరోధాలు. మహిళలు వ్యవసాయం, చిన్నచిన్న వ్యాపార రంగాల్లో ప్రధానంగా ఉన్నారు. అయితే, ఆర్థిక స్వాతంత్ర్యం పరిమితంగానే ఉంది. ప్రసవ సంబంధిత మరణాలు అత్యధికం. ఆరోగ్య సేవలు మహిళలకు అందుబాటులో లేవు. రువాండా వంటి దేశాలు అత్యధిక మహిళా పార్లమెంటు సభ్యులతో రాజకీయాల్లో మహిళల మెగురైన ప్రాతినిధ్యానికి ఉదాహరణగా నిలుస్తున్నాయి.

**2. ఆసియా:** తూర్పు ఆసియాలో (చైనా, జపాన్) మహిళల విద్యార్హతలు మెరుగుపడినా, దక్షిణాసియాలో (భారతదేశం, పాకిస్థాన్) ఇంకా చిన్న బాలికల చదువులో తేడాలు ఉన్నాయి. మహిళలు సేవల రంగంలో ప్రగతిచేశారు, కానీ వేతన వ్యత్యాసం కొనసాగుతుంది. గర్భధారణ సేవలు, మాతృసంరక్షణ సేవలు మెరుగుపడుతున్నా, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా నాణ్యత లోపిస్తోంది. భారతదేశం, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో మహిళలు ప్రధానమంత్రి పదవులు అధిష్ఠించారు, కానీ స్థానిక స్థాయిలో పురుష ఆధిపత్యం ఎక్కువగానే ఉంది.

**3. యూరప్:** ఐరోపా ఖండంలోని చాలా దేశాల్లో మహిళలు పురుషులకన్నా అధిక విద్యార్హతలు సాధిస్తున్నారు. ఆర్థిక అవకాశాలు:మహిళలు కార్పొరేట్ రంగంలో అధిక పదవులు చేపడుతున్నా, సిఇఒ వంటి టాప్ లెవెల్స్‌లో మాత్రం తక్కువ ప్రాతినిధ్యం ఉంది. ఆరోగ్య సేవలు అత్యుత్తమంగా అందుతున్నాయి. స్కాండినేవియన్ దేశాలలో (స్వీడన్, నార్వే, ఫిన్లాండ్) మహిళలు రాజకీయాల్లో సమాన ప్రాతినిధ్యం సాధించారు.

**4. ఉత్తర అమెరికా:** అమెరికా, కెనడాలో మహిళలు అధికంగా ఉన్నత విద్య చదువుతున్నారు. మహిళలు ఉద్యోగ రంగంలో బలంగా ఉన్నా, అధిక పదవులలో ఇంకా తక్కువ శాతం కొనసాగుతున్నది. సర్వసాధారణంగా మంచి ఆరోగ్య సంరక్షణ ఉంటుంది, కానీ అమెరికాలో ఆరోగ్య హక్కులు (అందుబాటు) విషయంలో విభేదాలు ఉన్నాయి. ముఖ్యంగా అబార్షన్ అంశంలో తీవ్ర వైరుధ్యాలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆందోళనలు కూడా కొనసాగుతున్నాయి. రాజకీయాల విషయానికి వస్తే, ఇటీవల అమెరికాలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతున్నది (ఉదా: వాయిస్ ప్రెసిడెంట్ కమల హారిస్).

**5. దక్షిణ అమెరికా:** మెరుగైన బాలికల విద్యాస్థాయి ఉంది, కానీ పేదరికం కారణంగా కొన్ని దేశాల్లో చదువు మానేస్తున్నారు. మహిళలు అనధికారిక రంగంలో అధికంగా పనిచేస్తున్నారు. ఆరోగ్యం: కొన్ని దేశాల్లో గర్భ సంబంధిత మరణాలు ఇంకా సమస్యగా ఉన్నాయి. చిలీ, బ్రెజిల్ వంటి దేశాల్లో మహిళలు అధ్యక్షులుగా పనిచేశారు, కానీ రాజకీయ స్థాయిలో పూర్తి సమానత్వం లేదు.

**6. ఆస్ట్రేలియా మరియు ఓషియానియా:** విద్యలో మహిళలు పురుషుల కన్నా మెరుగైన స్థితిలో ఉన్నారు. ఉద్యోగ రంగాల్లో మహిళల పాల్గొనడం ఎక్కువగా ఉన్నా, కానీ జీతాల విషయంలో వ్యత్యాసం కొనసాగుతున్నది. ఆరోగ్య పరిరక్షణ అత్యుత్తమ స్థాయిలో ఉంది. ఆస్ట్రేలియాలో, న్యూజిలాండ్‌లో మహిళలు ప్రధానమైన నాయకులుగా ఉన్నారు (ఉదా: జసిండా ఆర్డర్న్). సంక్షిప్తంగా చెప్పాలంటే అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు విద్య, ఆరోగ్యం, ఉద్యోగ అవకాశాల్లో మెరుగుపడ్డారు, కానీ వేతన వ్యత్యాసం ఉంది. అభివృదిచెందుతున్న దేశాల్లో ఇంకా బాల్యవివాహం, చదువు లోపం, ఆరోగ్య సమస్యలు కొనసాగుతున్నాయి. ప్రపంచమంతా, మహిళల సాధికారత కోసం ఇంకా చాలా స్థాయిలో చర్యలు అవసరం.



## వాతావరణ సంక్షోభం..

# మహిళలపై పెరుగుతున్న హింస!

వాతావరణానికి, మనిషి ప్రవర్తనకూ దగ్గర సంబంధం ఉందనేది ఆశ్చర్యం కలిగించే విషయం. ఇటీవల పెరుగుతున్న వాతావరణ సంక్షోభం కారణంగా, మహిళలపై హింస పెరుగుతున్నదని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి స్పాట్ లైట్ ఇనిషియేటివ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, వాతావరణ మార్పు మహిళలపై , ముఖ్యంగా పేద, దుర్బల వర్గాలపై లింగ ఆధారిత హింస (జిబివి) పెరుగుతోంది. అత్యవసర చర్యలు తీసుకోకపోతే 2100 నాటికి వాతావరణ మార్పు వల్ల ప్రతి 10 మందిలో ఒకరు సన్నిహిత భాగస్వామి హింస (ఐపివి) బారిన పడే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. ఐక్యరాజ్య సమితి స్పాట్‌లైట్ ఇనిషియేటివ్ అనేది యూరోపియన్ యూనియన్ (ఇయు) మరియు ఐక్యరాజ్యసమితి మధ్య ప్రపంచవ్యాప్త, బహుళసంవత్సరాల భాగస్వామ్యం, ఇది మహిళలు మరియు బాలికలపై అన్ని రకాల హింసను (విఎడబ్ల్యుజి) తొలగించే లక్ష్యంతో ఉంది. ఉష్ణోగ్రతలో ఒక డిగ్రీ సెల్సియస్ పెరుగుదల సన్నిహిత భాగస్వామి హింస (ఐపివి)లో 4.7 శాతం పెరుగుదలకు దారితీస్తుంది. 2090 నాటికి, 2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద, ఏటా 40 మిలియన్ల మంది మహిళలు, బాలికలు ఐపివిని ఎదుర్కోవలసి ఉంటుంది. ఇది 3.5 డిగ్రీల సెల్సియస్ కంటే రెట్టింపు అవుతుంది. ఉష్ణోగ్రతను 1.5 డిగ్రీల సెల్సియస్‌కి పరిమితం చేయడం వల్ల 2060 నాటికి ఐపివి రేట్లు 24 శాతం నుండి 14 శాతానికి తగ్గుతాయి. విపత్తుప్రేరిత హింస: 2023లో, 93.1 మిలియన్ల మంది వాతావరణ విపత్తులను ఎదుర్కొన్నారు. 423 మిలియన్ల మహిళలు ఐపివిని అనుభవించారు. వేడిగాలులు స్త్రీ హత్యలలో 28 శాతం పెరుగుదలకు కారణమయ్యాయి. విపత్తు తర్వాత పరిస్థితులు బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీ పెరుగుదలకు దారితీశాయి. ముఖ్యంగా వరదలు, కరువులు, స్థానభ్రంశం తదితర ఘటనల తర్వాత కేసుల సంఖ్య మరింత పెరిగింది. లింగ ఆధారిత హింసను ఐక్యరాజ్య సమితి నివేదిక 'నీడ మహమ్మారి' లేదా 'వెన్నంటి ఉండే ప్రమాదం'గా అభివర్ణించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు శారీరక, లైంగిక లేదా మానసిక వేధింపులను అనుభవించారని, బాధితుల్లో కేవలం 7 శాతం మంది మాత్రమే ఈ సంఘటనలను నివేదిస్తున్నారని పేర్కొంది. పేదరికంలో ఉన్న మహిళలు , అనధికారిక స్థావరాలు, వ్యవసాయం, స్వదేశీ సంఘాలు, వైకల్యాలున్నవారు, వృద్ధులు, ఎల్‌జిబిటిక్యు+ వ్యక్తులు పరిమిత మద్దతు వ్యవస్థల కారణంగా అధిక లింగ ఆధారిత హింస ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. పర్యావరణ హక్కుల కోసం పోరాడుతున్న మహిళలు వేధింపులు, హింస, అపహరణ సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొంత మంది హత్యకు గురవుతున్నారు. కాగా, వాతావరణ సంబంధిత అభివృద్ధి సహాయంలో కేవలం 0.04 శాతం మాత్రమే ప్రధానంగా లింగ సమానత్వంపై దృష్టి పెడుతుంది. ఇది వాతావరణ చర్యలో లింగ ఆధారిత హింసని పరిష్కరించడంలో ప్రధాన వైఫల్యాన్ని చూపుతుంది. ఈ పరిస్థితుల్లో, వాతావరణ విధానంలో లింగ ఆధారిత హింస ని సమగ్రపరచాల్సిన అవసరం ఉంది. స్థానిక, జాతీయ, ప్రపంచ స్థాయిలలోని అన్ని వాతావరణ విధానాలు, కార్యక్రమాలలో ప్రధాన స్రవంతి లింగ ఆధారిత హింస నివారణను, లింగకేంద్రీకృత వాతావరణ నిధులను పెంచాలి. మహిళల భద్రత, నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలి. వాతావరణ పరిష్కారాలలో మహిళలు నాయకులుగా, లబ్ధిదారులుగా కేంద్రంగా ఉండేలా చూసుకోవాలి. వాతావరణ స్థితిస్థాపకతకు లింగ ఆధారిత హింస ఒక అవరోధంగా గుర్తించి, దానిని పరిష్కరించండి, దీనిని స్థిరమైన అభివృద్ధి ప్రయత్నాలలో ప్రధాన భాగంగా చేయండి. కాప్27 వంటి ప్రపంచ వాతావరణ వేదికలకు లింగ న్యాయం కేంద్రంగా ఉందని, సమ్మిళిత, స్థిరమైన వాతావరణ పరిష్కారాలను ప్రోత్సహిస్తున్నట్లు నిర్ధారించడానికి, పసిఫిక్ ఫెమినిస్ట్ కమ్యూనిటీ ఆఫ్ ప్రాక్టీస్ వంటి పౌర సమాజ సంస్థలు, మహిళా ఉద్యమాల సామర్థ్యాన్ని సమర్థించడం చాలా అవసరం. వనాటు, లైబీరియా, మొజాంబిక్‌లలో కనిపించే విధంగా లింగప్రతిస్పందించే కార్యక్రమాలను అమలు చేయడం, ఇవి లింగ న్యాయాన్ని వాతావరణ స్థితిస్థాపకతతో అనుసంధానిస్తాయి. కీలక చర్యలలో వాతావరణ స్మార్ట్ వ్యవసాయంలో మాజీ మహిళా జననేంద్రియ విచ్ఛేదనం (ఎఫ్‌జిఎం) అభ్యాసకులకు తిరిగి శిక్షణ ఇవ్వడం, విపత్తు ప్రతిస్పందనలో లింగ ఆధారిత హింస సేవలను పొందుపరచడం, వాతావరణ ప్రభావిత ప్రాంతాలలో మొబైల్ హెల్త్ క్లినిక్‌లను మోహరించడం వంటివి ఉన్నాయి. మొత్తం మీద వాతావరణ సంక్షోభం లింగ ఆధారిత హింస, సంక్షోభం సమానత్వ భావనకు, స్వేచ్ఛకు అంతరాయం కలిగిస్తున్నాయి. లింగ సమానత్వం, హింస నివారణను సమగ్రపరచాల్సిన తక్షణ అవసరాన్ని ఐక్యరాజ్యసమితి పరిశోధనలు నొక్కి చెబుతున్నాయి. విధాన చట్రాలను సమ్మిళితంగా, ప్రతిస్పందించేలా, హక్కులకేంద్రీకృతంగా ఉండేలా పునరాలోచించాల్సిన అవసరం ఉంది. అప్పుడే మనం అందరికీ సురక్షితమైన మరియు న్యాయమైన వాతావరణ స్థిరమైన భవిష్యత్తును నిర్మించగలుగుతాము.

## ప్రపంచ వ్యాప్తంగా మహిళల పరిస్థితి..

**1. విద్యా రంగం:** ప్రపంచవ్యాప్తంగా 15–24 ఏళ్ల వయసు బాలికలలో అక్షరాస్యత రేటు: 90%. రేటు: 76% మాత్రమే. నైజీరియా, అఫ్ఘనిస్తాన్, చాద్ వంటి దేశాల్లో, ప్రాథమిక స్థాయిలో బాలికల ప్రవేశం ఇతర బాలుర కంటే తక్కువ.

**2. ఆర్థిక రంగం:** ప్రపంచవ్యాప్తంగా మహిళల శ్రమ దరఖాస్తు 47శాతం ఉండగా, పురుషులది 72 శాతం. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) గత ఏడాది చివరిలో విడుదల చేసిన నివేదికను అనుసరించి మహిళలు లేబర్ మార్కెట్‌లోకి రావడానికి ఇష్టపడడం లేదు. కుటుంబానికే పరిమితం కావడం లేదా ఎలాంటి గుర్తింపులేని పనులకే పరిమితం కావడం సాధారమైపోయింది. ప్రపంచ వ్యాప్తంగా టాప్ 500 కంపెనీలను పరిశీలిస్తే, సిఇఒ స్థాయికి ఎదిగిన మహిళలు కేవలం 10.6 శాతం మాత్రమే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా వేతన వ్యత్యాసం కూడా ఎక్కువగా ఉంది. సగటున మహిళలు పురుషులతో పోలిస్తే మహిళలు 20 శాతం తక్కువ వేతనం పొందుతున్నారు.

**3. ఆరోగ్య రంగం:** ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నివేదికను అనుసరించి, ప్రతి లక్ష ప్రసవాల్లో 223 మరణాలు సంభవిస్తున్నాయి. ఉపసహారా ఆఫ్రికాలో ఈ రేటు 545 మరణాలుగా ఉంది. ఇది కేవలం అధికారికంగా నమోదైన డేటా మాత్రమే. అయితే, చాలా దేశాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రసవాల సమయంలో మరణాలు ఇంకా ఎక్కువగా ఉన్నాయన్నది నిజం. ఇక లైంగిక హింస గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా 1549 ఏళ్ల వయసు మహిళలలో 35 శాతం మంది ఏదో ఒక దశలో లైంగిక లేదా భౌతిక హింసను అనుభవిస్తున్నారు.

**4. రాజకీయ ప్రాతినిధ్యం:** 2024 నాటికి ప్రపంచ పార్లమెంటుల్లో మహిళల సగటు ప్రాతినిధ్యం కేవలం 26.5 శాతం మాత్రమే. అత్యధిక మహిళా ప్రాతినిధ్యం ఉన్న దేశం రువాండా. అక్కడ ప్రతి 100 పార్లమెంటరీ సీట్లలో 61 సీట్లు మహిళలవే కావడం విశేషం. అమెరికాలో మహిళల ప్రాతినిధ్యం సుమారు 29 శాతం.

**5. సాంకేతిక రంగం:** ప్రపంచంలో ఎస్‌టిఇఎం (స్టెమ్) రంగాలలో మహిళల భాగస్వామ్యం 28 శాతం మాత్రమేనని యునెస్కో నివేదిక పేర్కొంటున్నది. కృత్రిమ మేధ (ఎఐ) రంగంలో మహిళల ప్రాతినిధ్యం 22 శాతంగా ఉంది. మొత్తం మీద, స్థూలంగా చూస్తే, అభివృద్ధి చెందిన దేశాలలో కూడా విద్య, ఆరోగ్యం రంగాల్లో పురోగతి గణనీయమైనా, వేతన అసమానత ఇంకా కొనసాగుతున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో బాలికల విద్య, ఆరోగ్య పరిరక్షణ ఇంకా పెరిగేందుకు ప్రభుత్వ మద్దతు అవసరం. రాజకీయ రంగంలో ప్రపంచవ్యాప్తంగా మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతున్నా, ఇంకా సమాన ప్రాతినిధ్యం సాధించలేదు. ఆర్థిక స్వావలంబనలో ఇంకా అడ్డంకులు, ముఖ్యంగా రుణాలు, సంపత్తి హక్కులు పరంగా మహిళలు వెనుకబడే ఉన్నారు. మహిళల పరిస్థితి ప్రపంచం నలుమూలలా మెరుగుపడుతున్నా, అసమానతలు ఇంకా చాలా చోట్ల ఉన్నాయని. మహిళల విద్య, ఆరోగ్యం, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక స్వాతంత్ర్యం వంటి రంగాల్లో సమగ్రమైన చర్యలు తీసుకుంటే మాత్రమే పూర్తి సాధికారత సాధ్యమవుతుందని ఐక్యరాజ్య సమితి స్పష్టం చేస్తున్నది.



# ఆదివాసీలు జీవించే స్వేచ్ఛను కాపాడాలి

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రప్రభుత్వ బలగాలు మావోయిస్టులపై హత్యాకాండ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో బలగాలను మోహరించి మావోయిస్టు పార్టీని అంతం చేయాలని కేంద్రం ప్రకటించిందని, కేంద్ర హోంశాఖ మంత్రి అమీత్‌షా చివరి మావోయిస్టును చంపేదాకా వదిలిపెట్టబోమని మాట్లాడటం అప్రజాస్వామికమని ఆయన అన్నారు. సైన్యం తమ సొంత ఆస్తిగా కేంద్ర హోం శాఖ మంత్రి మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు.మావోయిస్టు పార్టీ ప్రతినిధులు శాంతి చర్చలకు పిలవాలని కోరుతుంటే,వారిని గౌరవించి పిలువకుండా తుదిముట్టించేదాకా వదలబోమనటం దుర్మార్గమన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్ అడవుల్లోని ఆదివాసీలను నిర్మూలించే పద్ధతిని మోడీ సర్కారు కొనసాగిస్తున్నదన్నారు. సాయుధలైన మావోయిస్టులకు, పోలీసు బలగాలకు మధ్య జరుగుతున్న యుద్ధంలా అది లేదనీ, బలగాలు అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేసి వారిని అడవుల నుంచి వెళ్లగొట్టేలా ఉందన్నారు. అక్కడ మానవ, ఆదివాసీ, గిరిజన హక్కులను హరణ జరుగుతున్నదని, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలోని విలువైన స్వదేశీ ఖనిజ సంపదను, విదేశీ కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర దాని వెనుక ఉన్నదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని,ఇప్పటికే శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో ఆ మేరకు స్పందించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం

- వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి...
- స్థానిక యువతకు 50 శాతం ఉపాధి కల్పించాలి
- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి
- యాదగిరిగుట్టలో వలీ ఉల్లా ఖాద్రి, కల్లూరి ధర్మేంద్ర

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలకు సిద్ధమని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రి, కల్లూరి ధర్మేంద్ర సంసిద్ధత వ్యక్తం చేశారు. మండల కేంద్రం యాదగిరిగుట్టలో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా రెండవ మహాసభలు మంగళవారం ఘనంగా జరిగాయి. మహాసభ యువజన ప్రదర్శనను వైకుంఠ ద్వారం నుండి లక్ష్మీ ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించారు. ఆ ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, కొండూరు వెంకటేష్, మొగుళ్ళ శేఖర్ రెడ్డి, అధ్యక్షతన జరిగిన మహాసభలో ఎఐవైఎఫ్ జెండాను వలి ఉల్లా ఖాద్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరి ధర్మేంద్ర మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత జిల్లా అయినందున వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి 50 శాతం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను విస్మరిస్తే మరో పోరాటానికి సిద్ధమన్నారు. దేశంలో అమాయక ప్రజలపై ఉగ్రవాదులు చేస్తున్న దాడులను కేంద్ర ప్రభుత్వం అరికట్టాలని ఉగ్రవాద దాడులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా మహిళలపై దాడులు అత్యాచారాలు,హత్యలు జరుగుతున్నాయని వీటి ఆరికట్టవలసిన అవసరం ఉందన్నారు. 1959 మే 3న ఆవిర్భవించిన ఎఐవైఎఫ్ భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, చంద్రశేఖర ఆజాద్ లాంటి అమరవీరుల వారసత్వాన్ని పునికిపుచ్చుకొని యువతలో ప్రగతిశీల అభ్యుదయ దేశభక్తి ,లౌకిక ప్రజాస్వానికి ఆలోచనలకు నిరంతరం కృషి చేస్తుందని మహాసభ ప్రారంభ ఉపన్యాసం చేయడం జరిగింది. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐటీ కేడర్‌ను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తు నేటి యువతపై ఆధారపడి ఉందని యువత ఆలోచన దేశ అభివృద్ధికై ఉండాలని, మతోన్మాదం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువత నడుం బిగించవలసిన అవసరం ఉందన్నారు. ఈ మహాసభలో నివేదికను సంఘం జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో జిల్లా సమితి సభ్యుడు మహమ్మద్ నయీమ్, బద్దుల శ్రీనివాస్, సుద్దాల సాయికుమార్, మొగుళ్ళ శేఖర్ రెడ్డి, కొండూరి వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చెక్క వెంకటేష్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, తదితరులు పాల్గొన్నారు.






# కనీస వేతన సలహా మండలి తీర్మానాలను గెజిట్ చేసి అమలుపరచాలి

ఎఐటియుసి ఆధ్వర్యంలో కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుకు వినతి

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలోని షెడ్యూల్ పరిశ్రమల కనీస వేతనాల ప్రతిపాదనలను తక్షణమే గెజిట్ చేసి అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం నాడు హైదరాబాద్ ముగ్ధూమ్ భవన్‌లో కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కనీస వేతనాల సలహా మండలి సభ్యులు ఎండి. యూసుఫ్ , కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండి. అక్బర్ ఆలీలు మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలోని కార్మికులకు కనీస వేతనాలు పెరగక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారని యాజమాన్యాలు అరకొర వేతనాలు చెల్లించి శ్రమదోపిడికి పాల్పడ్డాయి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు పెంచడానికి కనీస వేతనాల సలహా మండలిని ఏర్పాటు చేసి అనేక దఫాలుగా సమావేశాలు నిర్వహించారని చివరగా సోమవారం జరిగిన కనీస వేతనాల సలహా మండలిలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందని కార్మికుల పర్వదినమైన మే 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల సలహా మండలి పంపించిన ప్రతిపాదనలను అంగీకరించి అధికారికంగా ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గెజిట్ చేసి అమలు పరుచుటకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు అఫ్రోజ్ ఖాన్, యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ క్రిస్టోఫర్, కార్యవర్గ సభ్యులు దొడ్డిపట్ల రవీందర్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఖరికి నిరసనగా మే 20న సార్వత్రిక సమ్మె

అఖిల పక్ష కార్మిక సంఘాల సంయుక్త సమావేశం పిలుపు



**ప్రజాపక్షం/ఖమ్మం :** దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని ఈ చర్యను నిరసిస్తూ మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ప్రజలకు అఖిల పక్షకార్మిక సంఘాల సంయుక్త సమావేశం పిలుపునిచ్చింది. మంచికంటి భవన్‌లో అఖిలపక్ష కార్మిక సంఘాల జిల్లా స్థాయి సంయుక్త సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జే. వెంకటేష్, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు పాల్వంచ కృష్ణ, ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కె. రాంసింగ్‌లు హాజరయ్యారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ కార్మికులకు సంబంధించి ఏ చట్టాన్ని కార్మికుల పట్ల అభిమానంతోనో, వారి బాధలు గమనించో ఏ ప్రభుత్వం చేయలేదని భారతదేశ కార్మిక వర్గం అనుభవిస్తున్న ప్రతి హక్కు వెనక దశాబ్దాల పోరాటం దాగి ఉందన్నారు. అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాసేందుకు సిద్ధమైందన్నారు.కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయకుండా ఉన్న చట్టాలను తొలగించి కార్మికులకు పని భద్రత లేకుండా చేస్తున్నారని వారు ఆరోపించారు. దశాబ్ద కాలంలో మోడీ ప్రభుత్వం సంఘటిత అసంఘటి త కార్మికుల కొరకు ఖర్చు చేసిన మొత్తం లక్ష కోట్లు కూడా లేవని కాని కార్పొరేట్ సంస్థల కోసం రూ.16.53 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశార ని వారు తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెరిగిన ధరలు, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని కనీస వేతనాన్ని పెంచాల్సింది పోయి తగ్గించిందన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా జరిగే ఈ సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు మద్దతునివ్వాలని సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాల ని పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, నరాల నరేష్ నాయుడు (ఐఎన్‌టియుసి), విష్ణువర్దన్ (సిఐటి యు), ఎ.వెంకట రెడ్డి, ఐ.వెంకన్న అధ్యక్షత వహించగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, సిఐటియు కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వర రావు, టియుసిఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు నీలం రాజేష్, ఐఎఫ్‌టియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మేడే ఉద్యమ స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట అధ్యక్షులు

139వ మేడే ఉత్సవాల వాల్ పోస్టర్స్, కరపత్రాలు ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** కార్మిక త్యాగధనుల రక్తంతో తడిసి ఎగిరిన మేడే ఉద్యమ స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం ప్రతిఘటనకు సిద్ధం కావాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో 139వ ప్రపంచ కార్మిక దినోత్సవ ఉత్సవాల వాల్‌పోస్టర్ కరపత్రాలు ఇతర ప్రచార సామాగ్రిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నూతన కార్మిక విధానాల ఫలితంగా కార్మిక వర్గం సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నుండి రూ పొందించుకున్న 44 కార్మిక చట్టాలను సవరణల పేరుతో దోపిడి గుత్త పెట్టుబడిదారులకు కార్పోరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మారుస్తూ 29 కార్మిక చట్టాలను పూర్తిగా రద్దు చేస్తూ నాలుగు కోడ్‌లుగా విభజించి అసంఘటిత కార్మిక వర్గానికి ఇలాంటి హక్కులు వర్తించకుండా చేసే కుట్రలకు కేంద్ర ప్ర భుత్వం దిగుతుందని మండిపడ్డారు. హక్కులు బిక్ష కాదని, దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న రాజ్యాంగ చట్టబద్ధ హక్కులని అన్నారు. మేడే సందర్భంగా కార్మికుల ప్రతి అడ్డాలలో ఎర్రజెండా ఎగురవేస్తూ సభలు సమావేశాలు ర్యాలీలో చర్చ గోష్టులు విస్తృతంగా నిర్వహించాలని అన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD



## తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు : ఎంపిడిఒ



ప్రజాపక్షం/యాచారం :తాగునీటి తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాచారం మండల పరిధిలోని మేడిపల్లి, తాడిపర్తి గ్రామాల్లో అయన పర్యటించారు. తాగునీటి సమస్యకు తగిన కారణాలను పంచాయతీ కార్యదర్శులను, గ్రామస్తులను అడిగి తెసుకున్నారు. వేసవి కాలం కావడం వల్ల భూగర్బజలాలు అడుగంటే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో బోర్లు ఎక్కడేక్కడా ఉన్నాయి. వాటిని గుర్తించి రిపేర్ చేయాలన్నారు. వేసవిలో నర్సరీలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం వేళల్లోనే ఉపాధి పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగిరథ ఇఇ రాజు, ఎఇ సుబాష్, కార్తిక్, పంచాయతి కార్యదర్శులు కిషన్ పాల్గొన్నారు.

## నేడు బసవేశ్వర జయంతోత్సవం

### హాజరుకానున్న సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : సామాజిక సంస్కర్త, తత్వవేత్త మహాత్మ బసవేశ్వర 892వ జయంతోత్సవాన్ని ఈనెల 30న హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు వెన్న ఈశ్వరప్ప, అధ్యక్షులు పటియల్ల సంగమేశ్వర్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు సంఘం ప్రతినిధులతో కలిసి జయంతి కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బసవేశ్వర జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం దామోదర రాజ నరసింహ, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పలువురు ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి. దినేశ్ పటిల్, కోశాధికారి కల్లపల్లి రాచప్ప, శివశరణ్, సోమేశ్వర్, సూర్య శ్రావణి, ఎన్.విద్యులత పాల్గొన్నారు.

## త్రిసభ్య కమిటీ ఏర్పాటుకు కృతజ్ఞతలు



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : టిఎస్‌ఆర్‌టిసిలో వివిధ కారణాల రీత్యా ఉద్యోగాలు కోల్పోయిన వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయడం చరిత్రాత్మక నిర్ణయమని, ఇందుకు సిఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆర్‌టిసి నుంచి తొలగించబడిన కార్మికులు దాసరి రాంబాబు (ఖమ్మం), వీరాంజనేయులు (వరంగల్) పి.శ్రీనివాస్‌గౌడ్‌లు పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. బిఆర్‌ఎస్ హయాంలోనే వందలాది మంది కార్మికులను తొలగించడంతో ప్రస్తుతం వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఆర్‌టిసి ఎండిగా సజ్జనార్ బాధ్యతలు చేపట్టాక సంస్థ అభివృద్ధి బాట పట్టిందన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకొని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## సేవాదృక్పథంతో పనిచేయాలి

### ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: సమాజంలోకి తలసేమియా బాధితులకు రక్తం అందించడం కోసం నిరంతరం మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి వారి ప్రాణాలు నిలబెట్టడానికి మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ కృషి చేస్తుందని ఎంఎల్‌సి గోరెటి వెంకన్న అన్నారు. మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ 16వ వార్షికోత్సవం సందర్భంగా వైదేహి నగర్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న చేపూరి శంకర్‌ను అభినందించారు. వనస్థలిపురం ఏసిపి కాశిరెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం ఇతర దానాల కంటే గొప్పదన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక భాధ్యత కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కోయి కోటేశ్వర్, వైదేహి నగర్ కాలనీ వాసులు రామ్ చందర్ గౌడ్, చేపూరి సునిత, ట్రాఫిక్ సిఐలు అంజపల్లి నాగమల్లు, కట్ట బాలరాజు, ఎస్. నాగేశ్వర్ రావు, శ్యామ్ గౌడ్, చేపూరి రాజు, జేఏసీ చైర్మన్ చెన్నాన్నోజు శ్రీనివాస్ చారి, విజయ్, అబ్దుల్ గని పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రమావత్ సక్రునాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం హయత్ నగర్ డివిజన్లోని శారద నగర్, కమలానగర్‌లో పనిచేస్తున్న జిహెచ్‌ఎంసి కార్మికులతో కలిసి మేడే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమావత్ సక్రు నాయక్, ఎఐటియుసి హయత్ నగర్ మండల కార్యదర్శి గోల్కొండ నాగ రాజు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే 20లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఇతరత్రా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మే 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి సూపర్వైజర్లు పల్లె మధు, పగిల నాగన్న, టి. రాజ్‌కుమార్, కార్మికులు ఏ. వెంకటేష్, బిక్షపతి, సుగుణమ్మ, నాగమణి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి

### వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : వనస్థలిపురం డివిజన్లోని నాగార్జున కాలనీలో నూతనంగా మంజూరు అయిన సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగార్జున కాలనీలో రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున కాలనీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, క్రిస్టయల్ కాలనీ అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద నిర్మూలనకు మద్దతు

### గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే ఏ చర్యలకైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. పహల్గాం ఉగ్రదాడిపై నిరసనగా మంగళవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, కమిషనర్ ఆర్‌వి కర్ణన్, కార్పొరేటర్లు, జిహెచ్‌ఎంసి అధికారులు, సిబ్బంది నిరసన తెలుపుతూ ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడి భారతీయులందరీ గుండెలను కలచివేసిందన్నారు. ఉగ్రదాడి మానవతా విలువలకు, శాంతికి, సమాజ శ్రేయస్సుకు వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల కార్పొరేటర్లు, వంగ మధుసూదన్‌రెడ్డి, రాధా ధీరజ్ రెడ్డి, లాల్ సింగ్ మీర్జా బేగ్, సోహెల్ ఖాద్రీ, జగదీశ్వర్‌గౌడ్, రాజశేఖర్ రెడ్డి, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్,చీఫ్ ఇంజనీర్(ప్రాజెక్ట్స్) సానే భాస్కర్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్(నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, అదనపు కమిషనర్లు గీత రాధిక, వేణు గోపాల్, సరోజ, ఎస్.పంకజ, జోనల్, కమిషనర్‌లు ఎన్.రవికిరణ్, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, వెంకన్న, ముఖ్య వైద్యాధికారి డాకర్ పద్మజతో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా ఆర్‌వి కర్ణన్ బాధ్యతలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి నూతన కమిషనర్‌గా ఆర్‌వి కర్ణన్ మంగళవారం ఇలంబర్తి నుంచి బాధ్యతలు స్వీకరించారు. జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా కర్ణన్ ఫైల్‌పై సంతకం చేసి, బాధ్యతలు చేపట్టారు. ఆరు నెలల పాటు జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా కొనసాగిన ఇలంబర్తిని హెచ్‌ఎండిఏ కార్యదర్శిగా ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెల్సిందే. జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కర్ణన్‌కు ఇలంబర్తి, జోనల్ కమిషనర్లు హేమత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, ఎన్.రవికిరణ్, అదనపు కమిషనర్లు శివకుమార్‌నాయుడు, సత్యనారాయణ, వేణుగోపాల్, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ సానే భాస్కర్‌రెడ్డి, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.




## ఆర్మీ జవాన్లకు ట్రాఫిక్ పాఠాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆర్మీ జవాన్ (అగ్నివీర్)లకు నార్త్‌జోన్ ట్రాఫిక్ ఎసిపి జి.శంకర్‌రాజు ట్రాఫిక్ అవగాహన కల్పించారు. హైదరాబాద్ కమీషనర్ సివి ఆనంద్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి.జోయెల్ డేవిస్‌ఆదేశాల మేరకు మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ఎఒసి సెంటర్‌లో ఆర్మీ జవాన్‌లకు 'రోడ్డు ప్రమాదాలుని వారణ' అనే అంశంపై శంకర్‌రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత, అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతిఒక్కరి బాధ్యత, అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం, ప్రతి ఒక్కరు తప్పని సరిగ లైసెన్స్ తీసుకోవాలి అని చెప్పారు. ప్రతి ఒక్కరు వాహనం నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ వలన ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ ఎడి శర్మా, సబ్ మేజర్ బిఎల్ బోర్కర్, మారెడ్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్‌ఐలు శ్రీధర్, వెంకట ప్రసాద్ ఇతర సిబంది పాల్గొన్నారు.

## హైడ్రా చర్యలతో తగ్గిన దూర భారం

### రెండు కాలనీలకు తొలగిన ఆటంకం



ప్రజాపక్షం/హైదరాబాద్ : రెండు కాలనీలకు హైడ్రా దూరాన్ని తగ్గించింది. నేరుగా షేక్ పేటకు రావాలనుకున్నా.. ఇటు నుంచి గోల్కొండ కోటకు చేరాలన్నా దగ్గర దారిని హైడ్రా చూపించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని నెక్నాంపూర్ గ్రామంలో హైటెన్షన్ విద్యుత్ తీగల కింద కబ్జాదారులు నిర్మించిన అడ్డుగోడను మంగళవారం హైడ్రా తొలగించింది. దీంతో శ్రీ వేంకటేశ్వర కాలనీకి, ఉస్మానియా కాలనీకి మధ్య రహదారి అనుసంధానం ఏర్పడింది. ఈ రెండు కాలనీలకు మధ్య ఒక గుట్టలా ఉన్న ప్రాంతాన్ని ఆసరాగా తీసుకొని, హైటెన్షన్ విద్యుత్ తీగల పైనుంచి వెళ్తున్నప్పటికీ దిగువ వైపు దాదాపు 800ల గజాలకుపైగా ఉన్న స్థలంలో షెడ్డులు వేసి ఆక్రమించిన వైనాన్ని శ్రీ వేంకటేశ్వరా కాలనీ వాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. శనివారం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి వెంటనే ఈ అడ్డుగోడలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు ఎవరైతే కబ్జా చేశారో వారి షెడ్డులను తొలగించారు. మధ్యలో అడ్డంగా ఉన్న ప్రహరీని హైడ్రా తొలగించింది. దీంతో శ్రీ వేంకటేశ్వర కాలనీ, ఉస్మానియా కాలనీకి మధ్య 30 అడుగుల రహదారికి ఆటంకాలు తొలిగాయి. ఇరు కాలనీవాసులే కాదు.. ఆ మార్గంలో సులభంగా చేరుకునే అవకాశం 3 వేల మందికి లభించింది.

## ఆర్‌ఆర్‌బి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు మార్గదర్శకాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: భారతీయ రైల్వేలలో నియామకాల కోసం రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బి)ఆధ్వర్యంలో వివిధ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు దక్షణ మధ్య రైల్వే మార్గదర్శకాలను మంగళవారం విడుదల చేసింది. ఈ మార్గదర్శకాల ఆధారంగా ఆర్‌ఆర్‌బి సజావుగా పరీక్షలను నిర్వహిస్తుంది. అధికారులు జారీ చేసిన సూచనలను పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఖచ్చితంగా పాటించాలని సూచించడమైనది. మొబైల్ ఫోన్లు, పేజర్, గడియారాలు, ఇయర్ఫోన్, బ్లూటూత్ ఆధారిత పరికరాలు, మైక్రోఫోన్, హెల్త్ బ్యాండ్లు, కాలిక్యులేటర్లు, పుస్తకం, పెన్, పేపర్, పెన్సిల్, ఎరేజర్, పౌచ్, స్కేల్, రైటింగ్‌ప్యాడ్, బెల్టులు, హ్యాండ్బ్యాగ్, క్యాప్, పర్స్. కెమెరా, వాటర్ బాటిల్, ప్యాక్ చేయబడిన బహిరంగ ఆహార పదార్థాలు మొదలైనవి పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడవు. పరీక్షా కేంద్రం లోపలికి ఈకాల్ లెటర్ మాత్రమే అనుమతించబడుతుంది. పరీక్షా కేంద్రం లోపలికి అభ్యర్థులు ఎటువంటి పెన్ను, పెన్సిల్ తీసుకెళ్లకూడదు. పరీక్ష సమయంలో అభ్యర్థులకు పెన్లను అధికారులే అందిస్తారు. బయోమెట్రిక్స్ సంగ్రహణకు ఆటంకం కలుగకుండా అభ్యర్థులు తమ చేతులు, కాళ్లపై గోరింటాకు, పూసుకోకూడదని సూచించారు. తనిఖీ సమయంలో, అభ్యర్థులు లోహపు దుస్తులు, మతపరమైన చిహ్నాలు, గాజులు, ఆభరణాలు, మంగళసూత్రం, బ్రాస్లెట్లను ధరించి ఉన్నట్లు గుర్తించిన పక్షంలో, వారి కాల్ లెటర్లో ఆ వస్తువులకు సంబందించి తగిన ఆమోదంతో పరీక్షా హాలులోకి అనుమతించబడతారు, ఇన్విజిలేటర్లు అదనపు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## 'కిమ్స్ అస్పత్రి నుంచి శ్రీతేజ్ డిశ్చార్జ్

ప్రజాపక్షం/హైదరాబాద్: సంధ్యా థియేటర్ తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్ ఆరోగ్యం మెరుగు పడడంతో మంగళవారం కిమ్స్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. పుష్పా2 ప్రిమియం షో సందర్భంగా గత ఏడాది డిసెంబర్ 4న సంధ్యా సినిమా టాకీస్‌లో జరిగిన తొక్కిసలాటలో రేవతి (35) మృతి చెందగా ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. సుమారు ఐదు నెలలు మృత్యువుతో పోరాడిన శ్రీతేజ్ ఎట్టకేలకు కోలుకున్నాడు. దీంతో అతడిని వైద్యులు డిశ్చార్జ్ చేశారు.

## కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

ప్రజాపక్షం/గండిపేట : రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో రూ. 2.93 కోట్ల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మించడంతో గ్రామంలో చిన్నచిన్న సమావేశాలను నిర్మించుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, జైపాల్ రెడ్డి , నార్సింగి అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ కోట వేణుగౌడ్ , గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ తలారి మల్లేష్, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, డిఇఇ నరేష్ కుమార్, ఎఇ శ్రీనివాస్, వైద్యం వెంకటేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ అమరేందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు నరసింహ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎరుపుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## భూభారతిలో బాధితులకు న్యాయసలహా వ్యవస్థ



### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: భూభారతి చట్టంలో బాధితులకు న్యాయ సలహా వ్యవస్థ ఉందని, ఈచట్టంతో రైతు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాలోని కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్, తలకొండపల్లి మండలాలలో భూభారతి నూతన ఆర్‌ఒఆర్ చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి కలెక్టర్ సి.నారాయణరెడ్డిలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి నూతన చట్టంలో పొందుపరిచిన అంశాలు రైతుల సమస్యల పరిష్కారానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. భూమి అనేది ఒక రైతు జీవితానికి పెద్ద ఆధారమని, ముఖ్యంగా భూభారతి చట్టంలో అప్పిలు వ్యవస్థ చాలా కీలకమైనదని తెలిపారు. రైతుకు అన్యాయం జరిగితే అప్పీల్ చేసుకోవడం ద్వారా న్యాయాన్ని పొందవచ్చని, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్, సిసిఎల్‌ఏ స్థాయిలలో అప్పీల్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో అధ్యయనం చేసి భూచట్టాలను చేసింది. కానీ,గత పాలకులు ఉన్నపళంగా మంచి చట్టాన్ని రద్దు చేసి స్వార్థంతో "ధరణి" తీసుకొచ్చారని ఆరోపించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ భూభారతిలో రైతు తన సమస్యలను పరిష్కరించేందుకు ఎన్నో అవకాశాలు ప్రవేశ పెట్టడం జరిగిందని, చట్టంలోని అంశాలు, హక్కులపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కడ్తాల్, తలకొండపల్లి అవగాహన సదస్సులలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు కలెక్టర్, ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ జగదీశ్వర్‌రెడ్డి, కడ్తాల్, తలకొండపల్లి తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు

### గృహనిర్మాణశాఖ ప్రత్యేకకార్యదర్శి గౌతమ్



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్హులైన ఇల్లు లేని పేదలని గుర్తించాలని గృహ నిర్మాణం శాఖ ప్రత్యేక కార్యదర్శి విపి గౌతమ్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మునిసిపాలిటిలో పరిధిలో, మంఖాల్, తుక్కుగూడలతోపాటు మహేశ్వరం మండలంలోని సిరిగిరిపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతున్న తీరు, ఇంత వరకు సేకరించిన లబ్ధిదారుల వివరాలను ఇంటి ఇంటికి తిరిగి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ సెక్రెటరీ లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారుల కుటుంబ వివరాలు, ప్రస్తుతం నివాస స్థితిగతులు, వారి ఆర్థిక పరిస్థితుల వివరాలు అడిగిన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి విపి గౌతమ్ మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారుల ఇంటి వద్దకే అధికారులు వచ్చి వాళ్ళ వివరాలను సేకరించి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన ఇల్లు లేని పేద వారిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి ఖచ్చితమైన సర్వే చేసి ప్రభుత్వానికి, జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్(పిడి) ధరావత్ చంప్లా నాయక్, మహేశ్వరం తహసీల్దార్ కె.శైలజారెడ్డి, మహేశ్వరం ఎంపిడిఒ రామ్‌ప్రసాద్, తుక్కుగూడ మునిసిపాల్ కమిషనర్ ఎ.వాణి, టి.సైదులు, తహసీల్దారు మహేశ్వరం మండలం, వెరిఫికేషన్ ఆఫీసర్ మునిసిపల్, మండల సిబ్బంది పాల్గొన్నారు.

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తించటంలో పొరపాట్లకు తావివ్వొద్దు

జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : మేడ్చల్ పురపాలక సంఘ పరిధిలోని గిర్మాపూర్, మేడ్చల్ గ్రామాల్లో నిర్మితమవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను కేటాయించేందుకు అర్హులైన వారిని గుర్తించేందుకు నిర్దేశించిన ధృవీకరణ అంశాలన్నిటిని సంబంధిత అధికారులు జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎక్కడా ఎవరి ఒత్తిళ్లకు తావివ్వద్దని హెచ్చరించారు. అర్హులకు మాత్రమే ఇళ్లు వచ్చేలా చూడాలని సూచించారు.

## శ్మశాన వాటికలో పనిచేయని బోరు.. సమస్యలు పట్టించుకోని అధికారులు




ప్రజాపక్షం/నాగారం : నాగారం మున్సిపాలిటీలో గల శ్మశాన వాటికలో గత 20 రోజులుగా వాటర్ బోరు పనిచేయక పోవడంతో ఎవరైనా చనిపోయిన తర్వాత స్నానాలు చేసేందుకు నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాగారం మున్సిపాలిటీ నాయకులు,మాజీ వార్డు సభ్యులు చిన్నం రాజు సాయినాథ్‌గౌడ్,మున్సిపల్ టిడిపి అధ్యక్షులు కొండ జంగారెడ్డి,నాయకులు కొమిరెల్లి సుధాకర్‌రెడ్డి,పైళ్ల మల్లారెడ్డి,ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.మున్సిపాలిటీ పాలక వర్గం పదవీ కాలం ముగిసి పోయిననాటి నుండి కమిషనర్,అధికారులు,సిబ్బంది సమస్యలు పట్టించుకోవడం లేదని ఇకనైనా శ్మశాన వాటికలోని బోరుకు మరమ్మతులు చేసి సమస్యలపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

## నేడు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ ధర్నా

ప్రజాపక్షం/చర్లపల్లి : చర్లపల్లి రైల్వే టర్మినల్ ప్రారంభోత్సమై నాలుగు నెలలు కావస్తున్న కనీస సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంలేదని మాజీ ఎంఎల్‌ఎ, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్ చర్లపల్లి టర్మినల్ వద్ద బుధవారం ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నారు.కేంద్ర ప్రభుత్వం 450 కోట్లతో అత్యాధునీకంగా నిర్మాణం చేపట్టి ప్రారంభించి నాలుగు నెలలైన రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల సౌకర్యం కల్పించడం లేకపోవడంతో ధర్నా నిర్వహిస్తున్నామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాపక్షం/శామీర్‌పేట : అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ హారిక తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపూర్‌తాండాకు చెందిన దారవత్ దేవా(35) ఐదేళ్ల క్రితం దారవత్ మమతతో వివాహమైంది. దేవా తాగుడుకు బానిసై తరచు తన భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 27న దేవా ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అదే రోజు రాత్రి తాండలోని అంగన్‌వాడి ఎదుట దేవా రక్త గాయాలతో రోడ్డు పక్కన పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్సకు గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాంధీలో చికిత్స పొందుతు సోమవారం సాయంత్రం దేవా మృతి చెందాడని వైద్యులు తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా లేక ఇతర కారణాలు ఎమైనా ఉన్నాయా అనే కొణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఐక్యమత్యంతో సమస్యల పరిష్కారం



ప్రజాపక్షం/శామీర్‌పేట : యువకులందరు ఐక్యమత్యంతో ఉండి గ్రామంలోని సమస్యలను పరిష్కరించడం శుభపరిణామమని లక్ష్మాపూర్ గ్రామ యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లోని ప్రధాన చౌరస్తాలో నూతనంగా వీదిలైట్లను బిగించారు. ఈ సందర్భంగా యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో(రింగ్‌రోడ్డు) ప్రధాన వీధి దీపాలు పాడైపోయాయన్నారు. యువకులందరు ముందు కు వచ్చి విరాళాలు అందజేసి వీధిలైట్లను బిగించుకోవడం జరిగిందన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. యువత ముందుకు వచ్చి గ్రామ సమస్యలు పరిష్కరిస్తున్నారని చెప్పారు. వీధిలైట్లు బిగించిన జెఎల్‌ఎం సదానందంకు దన్యవాదాలు తెలిపారు.

## ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ




ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా బిజెపి శ్రేణులు మల్లాపూర్ ఎలిఫెంట్ బ్రిడ్జి నుండి శివా హోటల్ చౌరాస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, బిజెపి నేత ఏనుముల మహేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బిజెపి శ్రేణులు నల్లబ్యాడ్జిలు ధరించి ఉగ్రదాదిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఉగ్రవాదులను ఏరి పారేసేందుకు కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని నినదించారు. పలు పార్టీల నాయలు, కాలనీ వాసులు శైలేష్ రెడ్డి, కృష్ణాయాదవ్, రవీందర్ మర్రి, మోహన్‌రెడ్డి, రవి, భాస్కర్‌రెడ్డి,శ్రీను, రవీందర్, సాయి కృష్ణ, ఆనంద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సిసిటివి కెమెరాలు ప్రారంభించిన ఎస్‌పి

ప్రజాపక్షం/మోమిన్‌పేట్: వికారాబాద్ నియోజకరవ్గంలోని మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లోనూతనంగా ఏర్పాటు చేసిన 34 సిసిటివి కెమెరాలను జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ మరింత సులభతరం అవుతుందన్నారు. ఈ కేమెరాలు మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్‌లోని కమాండ్‌అండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసందనం చేశామని ఇందులో 24గంటలు పనిచేస్తున్నాయన్నారు. ఏదైన నేరం జరిగినప్పుడు, సంఘటన జరిగిన తీరును గుర్తించడానికి నిందితులను పట్టుకొవడానికి అమూల్యమైన సాక్ష్యంగా ఉపయోగపడుతాయన్నారు. దొంగతనాలు, దోపిడీలు, ఇవిటిసింగ్, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తామయని తెలిపారు. భవిషత్యుతలో మరిన్ని సాంతకేతిక సాదనాలను అందుబాటులోకి తెచ్చి ప్రజలకు మెరుగైన భద్రత కల్సిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి , సిఐ వెంకట్ ,ఎస్ఐ అరవింద్ ,సిబ్బంది పాల్గోన్నారు.



# హైదరాబాద్‌కు నలువైపులా పారిశ్రామిక పార్కులు

● యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి ● వికారాబాద్ నియోజకవర్గం ఎన్కతల గ్రామంలో టిజిఐఐసి ఇండస్ట్రీయల్ పార్కులో రూ.44.30కోట్లతో శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/వికారాబాద్ /మోమిన్‌పేట్ : పారిశ్రామిక రంగంలో తెలంగాణ అగ్రగామిగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఐటి పరిశ్రామల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల పరిధిలోని ఎన్కతల గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడలో రూ.44.30కోట్ల వ్యయంతో చేపట్టే వివిధ మౌలిక సదుపాయాలు అంతర్గత రోడ్లు నిర్మాణాలకు శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ శాసన మండలి ఛీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, చెవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లడుతూ హైదరాబాద్ నలువైపుల పారిశ్రమిక పార్కులను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మోమిన్‌పేట్‌లో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడలో రెండు సంవత్సరాలలో రూ.5వేల కోట్ల పెట్టుబడులను సాధించి 25వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పడినట్లయితే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని అయన తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటుకు స్థానికులు ముందుకు రావాలని ప్రభుత్వం వారిని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని అయన తెలిపారు. రాష్టంలో పరిశ్రమల ఏర్పాటు పెట్టుబడులకు ముందకు వచ్చే ఔత్సాహికులను ప్రొత్సహిస్తున్నాట్లు మంత్రి తెలిపారు. చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు స్థానికకులు ముందుకు రావాలని అటువంటి వారికి ప్రభుత్వ స్థలం కేటాయింపుతో పాటు సబ్సిడీ ప్రొత్సహిస్తామన్నారు. రాష్ట్ర ప్రగతిలో భాగంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మంత్రి అన్నారు. వర్షాధారం వల్ల వ్యవసాయంపై ఆధారపడ్డ కుటుంబాలు చాలా ఉన్నాయని అలాంటి రైతులను అదుకోవలసిన అవసరం ఎంతైన ఉందని మంత్రి అన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని, జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల భూమి ఉందని వివిధ మండలాల్లో పరిశ్రమలు స్థాపన చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతగిరి అభివృద్ధికి రూ.1000కోట్లతో పనులు చేపట్టేందుకు ఒప్పదం కుదిరిందని కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, జుంటుపల్లి, లక్నాపూర్, లాంటి ప్రాజెక్టులను అభివృద్ధి పరిచినట్లయితే యువతకు ఉపాధి కల్పించవచ్చన్నారు. జిల్లాలో రూ.600 కోట్లతో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాను పరిశ్రమల హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వాసుచంద్ర , టిజిఐఐసి జోనల్ మేనేజర్ కవిత , తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి , ఎంపీడిఓ విజలక్ష్మి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ,మండల పార్టీ అధ్యక్షులు,స్థానిక నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత



ప్రజాపక్షం/శామీర్‌పేట : సిఎం సహాయనిధి చెక్కును మాజి మంత్రి స్థానిక మేడ్చల్ ఎంఎల్‌ఎ చామకూర మల్లారెడ్డి మంగళవారం అందజేశారు. బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో తూంకుంట మున్సిపాలిటీకి చెందిన బానాల రాజేశ్వరికి రూ. 33 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వంగ వెంకట్‌రెడ్డి, గ్రంధాలయ మాజి చైర్మన్ భాస్కర్‌యాదవ్‌లు ఉన్నారు.

## ‘ధరణి’తో రైతులు ఎంతో నష్టపోయారు

అన్నదాతల కష్టాలను తీర్చడానికే ‘భూ భారతి’ చట్టం



ప్రజాపక్షం/పరిగి/దోమ : పరిగి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూ భారతిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ హజరై మాట్లాడుతూ భూభారతి చట్టం పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ధరణి పోర్టల్ వల్ల పేద ప్రజలకు, రైతులకు ఎంతో నష్టపోయరని. రైతుల కష్టలను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకు వచ్చిందన్నారు. భూ భారతితో అనేక సమస్యలకు పరిష్కారం తహసీల్దార్, జిల్లా కలెక్టర్ తీర్చే విధంగా రూపోందించడం జరిగిందన్నారు. అధికారులు చిత్త శుద్ధితో పని చేయాలని తెలిపారు. శాశ్వతంగా రైతులకు భూ ధార్ కార్డు ఇవ్వడం జరుగుతుదని తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న సాధా బైనామా సమస్యలను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ప్రస్తుతం 80 శాతం పరిష్కారం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే రామ్మెహన్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రైతులకు ప్రయోజనకరంగా లేదన్నారు. దొరలకు భూ స్వాములకు అనుకులంగా ధరణి పోర్టల రూపోందించారు అని తెలిపారు. గత ప్రభుత్వ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది అని అన్నారు. ఎన్నికల వెల ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రజలకు ఉపయోగపడే పోర్టల్ తీసుకువచ్చామని తెలిపారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు ,రిజిస్టేన్ ముటేషన్ తదితర సేవలు సులభతరం అవుతుందని తెలిపారు. అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురామ్‌రెడ్డి ఆర్‌డిఒ వాసుచంద్ర, తహసీల్దార్ అనంద్ రావు , తదితరులు పాల్గోన్నారు.

### చెరువుల పునరుద్ధరణ పనులకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శంకస్థాపన

పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామ చెరువు పునరుద్దరణ పనులను రూ. 25లక్షల వ్యయంతో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యేరామ్మెహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చెరువు పునరుద్ధరణ పనులను ప్రారంభించడం జరిగింది అని తెలిపారు. అలాగే అన్ని వర్గాల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, యాదయ్యగౌడ్ , శ్రీకంత్‌రెడ్డి రమేష్‌గౌడ్ , అనంతయ్య తదితరులు పాల్గోన్నారు.

## భూ భారతి చట్టంలో రెవెన్యూ అధికారులకే సమస్త అధికారాలు




ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: భూ భారతి చట్టంతో రైతుల, భూస్వాముల భూసమస్యలను తీర్చేందుకు రెవె న్యూ అధికారులకు పూర్తి స్థాయిలో అధికారాలు దక్కాయని, తద్వారా సమస్యలకు గతానికి భిన్నంగా శాశ్వత పరిష్కారం కల్పించటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ మండలంలో ని ఏదులాబాద్ గ్రామంలోని డిఎస్‌ఆర్ పంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహనా సదస్సులో ఆయ న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తహసీల్దార్లతో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయటం జరుగుతుందని, ఈ సదస్సుల్లో ఆయా గ్రామస్తులకు చెందిన వ్యక్తిగత భూసమస్యలకు సంబంధించి ధరఖాస్తులు ఇస్తే అన్ని సమస్యలను సత్వరమే పరిష్కరిస్తారన్నారు. గతంలో అమలులో ఉన్న ధరణిలో సమస్యలు పరిష్కరించేందుకు ఎలాంటి అధికారాలు లేనందున నేటికీ అపరిష్కృతంగానే మిగిలి పోయాయన్నారు. ఇలాంటివి భూభారతి చట్టంలో పునరావృతం కావన్నా రు. పాసు పుస్తకాలు రాని వారికి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వటం, గతంలో జారీ చేసిన పాసు పుస్తకాల్లో ఉన్న తప్పులను సవరించటం జరుగుతుందన్నారు. అదే విధం గా రైతులు కోరుకొంటే లైసెన్స్ ఉన్న సర్వేయర్లతో మరో సారి సర్వే జరిపించి భౌతిక సరిహద్దుతో చేయించిన మ్యాప్‌లను ప్రభుత్వ సర్వేయర్లు మళ్లీ వాలిడేట్ చేసిన తర్వాతే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో ల్యాండ్ మ్యాపులు వస్తాయని,దీని వల్ల ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లకుండా పకడ్బందీగా భూ సరిహద్దులు ఉంటాయన్నారు. ధరణి వల్ల పిఓబి సమస్యలు అనేక ఉన్నాయని, అదే భూ భారతి చట్టంలో పిఓబిని రద్దు చేసే అధికారం రెవెన్యూ అధకారులకు ఉందన్నారు. ప్రతి ఏడాది డిసెంబరు 31న ఆ సంవత్సరంలో జరిగిన మార్పు చేర్పులన్నిటిని ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసిప్రతి గ్రామ పంచాయతి నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారని, దీని వల్ల భూముల యజమానులకు తమ భూముల రికార్డులు స్పష్టంగా కనపడుతాయన్నారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి,ఘట్‌కేసర్ తహసీల్దార్ రజని, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## ఈతకు వెళ్లి నీట మునిగి ఇంటర్ విద్యార్థి మృతి



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : స్నేహితులతో ఈత కొడుతూ ఫొటోలు తీసుకొంటున్న విద్యార్థి క్వారీ గుంతలో పడి ప్రాణాలు కోల్పోయిన ఉదంతం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తరుణ్ మరో ఆరుగురు స్నేహితులతో కలిసి జవహర్‌నగర్‌లో నీరున్న క్వారీకి వెళ్లారు. వారందరూ సంతోషంగా నీటిలో ఈత కొడుతూ మొబైల్ ఫోన్లతో వీడియో రీల్స్ చేస్తుండగా తరుణ్ లోతు గమనించకుండా లోపలికి వెళ్లి సరిగ్గా ఈత రాక పోవటంతో నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు.ఈ విషయంపై సమాచారం అందుకొన్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి శవపంచనామా నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

## ఆర్‌టిసి కుషాయిగూడ సిబ్బందికి ప్రగతి చక్ర అవార్డులు



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరచిన వారికి టిఎస్‌ఆర్‌టిసి సికింద్రాబాద్ రీజియన్ త్రైమాసిక ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవంలో మంగళవారం ఉప్పల్ ఆర్టీసీ డిపోలో గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఇడి ఎం.రాజశేఖర్ అవార్డులను అందచేశారు. ఇపికె, కెఎంపిఎల్, హాజరీ, మెకానిక్, హెల్పర్ విభాగాల్లో ప్రతిభ కనపరచిన వారిలో కుషాయిగూడ డిపోకు చెందిన డ్రైవర్ రాజిరెడ్డి, కేశవులు,హెల్పర్ శ్రీరాములులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు శ్రీనివాస్, పవిత్ర, చౌహాన్, కుషాయిగూడ డిపోమేనేజర్ మహేష్‌కుమార్, ఉప్పల్, చెంగిచెర్ల, రాణిగంజ్, మేడ్చల్, హకీంపేట, కంటోన్మెంట్ డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు భోజనం, వసతి ఏర్పాటు చేస్తాం

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/ వికారాబాద్‌ప్రతినిధి : వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 7సంవత్సరాల నుండి 18సంవత్సరల అనాథ పిల్లలు ఇప్పటి వరకు హాస్టల్లో చదివి ఇప్పుడు వేసవి సెలవుల్లో వారి బంధువుల దగ్గర ఉండటానికి ఇబ్బంది పడినచో వారు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి కాల్ చేస్తే వారిని బాల సదన్‌లో, ఇతర చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్స్‌లో ఉంచి తగిన భోజన, వసతి ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఇతర వివరాల కోసం చైల్డ్ వేల్పర్ కమిటీ చైర్‌పర్సన్ వెంకటేశం, డిసిపిఒ శ్రీకాంత్, కాంతరావు, జయసుధ తదితర అధికారులను సంప్రదించవలసిందిగా కలెక్టర్ కోరారు. కాగా కొడంగల్ బార్ లైసన్స్ టెండర్‌కు 9మంది దరఖాస్తులు చేసుకోవడం జరిగిందని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిక్‌జైన్ లాటరీద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించడం జరిగిందని, కొడంగల్ బార్‌లైసెన్స్‌ను సురేష్‌నాయక్ దక్కించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో, అదనపు కలెక్టర్ సుధీర్ , అబ్కారి జిల్లా అదికారి విజయ బాస్కర్ పాలొన్నారు.

## కూచిపూడి నాట్యంలో రాణిస్తున్న మోక్షదృతి



ప్రజాపక్షం/ ఘట్‌కేసర్ : కూచిపూడి నాట్యాన్ని అద్భుతంగా చేసి అందరిని మెప్పించిన కళాకారిణి మోక్షదృతి అభినందనీయురాలని యక్షగాన కంఠీరవ, ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు పసుమర్తి శేషుబాబు తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్‌ఎఫ్‌సినగర్‌కు చెందిన మోక్షధృతి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన స్ఫూర్తి నేషనల్ డాన్స్ ఫెస్ట్ 2025 కార్యక్రమంలో కూచిపూడి నృత్య కళాకారి ని మోక్షదృతి పాల్గొని అత్యంత ప్రతిభ పాటలను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా మోక్షదృతి తల్లిదండ్రులు దోసపాటి శంకర్, ప్రవర్తిలను అభినందించి శాలువాలు, పుష్పగుచ్చాలతో సన్మానించారు. నాట్యకళాకారిణి మోక్షదృతిని ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ పసుమర్తి శేషుబాబు చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందజేశారు. పట్టుదలతో అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చి జాతీయ అంతర్జాతీయ గుర్తింపు సాధించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, నృత్యాచార్యులు, నాట్యగురువులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌ల వైఫల్యంతోనే వరుస దొంగతనలు

ప్రజాపక్షం/ వికారాబాద్‌ప్రతినిధి : వికారాబాద్ జిల్లా కేంద్రంలో రెండు నెలల నుండి వరస దొంగతనలు జరుగుతున్న పోలీసులు ఎక్కడ కూడా దొంగలను పట్టుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. వరుసగా చోరీలు జరుగుతున్న పోలీసుల వైఫల్యంతోను ఈ దొంగతనలు జరుగుతున్నయని ప్రజలు మాట్లాడుకుటుంన్నారు. తాజాగా ఎన్నెపల్లి నాలుగు ఇండ్లలో ,శివ రాంనగర్ లోని ఒక ఇంట్లో దొంగతనాలు జరిగినట్లు తెలుస్తుంది. కేసున మోదు చేసుకోని దర్యాప్తూ చేస్తున్నాట్లు పోలీస్‌లు తెలిపారు.

## పహల్గామ్ ఉగ్రదాడి బాధాకరం



ప్రజాపక్షం/ వికారాబాద్‌ప్రతినిధి : జమ్ముకశ్మీర్‌లోని పవల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణిచడం బాధాకరం అని సిపిఐ నియోజకవర్గం నాయకులు సురేష్, మధుసూదన్ యాదవ్, అంబేద్కర్ ప్రజాసంఘల నాయకులు రామేష్ బాబు అన్నారు. కొడంగల్ పట్టణ కేంద్రంలో సిపిఐ అధ్వర్యంలో జమ్ము కశ్మీర్‌లో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకురాలని, వారి కుటుంభ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు. ఉగ్రవాదని ప్రోత్సహించే ఏదేశం కూడా మనగడ సాధించలేదన్నారు. ఈ దాడి చేసిన ఉగ్రవాదులను గుర్తించి వారిని వారి సంస్థను మట్టబెట్టాలని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో సాయిలు, షాకీర్,అశ్వక్, వెంకటయ్య, బాబ్యానాయక్ , తదితరులు పాల్గోన్నారు.

## నిరుపేదకు ఆర్థిక సాయం



ప్రజాపక్షం/నాగారం : నాగారం మున్సిపాలిటీలోని ఓల్డ్ విలేజ్‌లో నివాసముండే నిరుపేద కుటుంబానికి చెందిన కిషోర్ గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై శరీరంలో షుగర్ లెవెల్స్ ఎక్కువై కాలు వేలును తీసివేయడంతో ఆయనను మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,మాజీ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్‌లు పరామర్శించారు.ఈ సందర్భంగా చంద్రారెడ్డి రూ.10 వేలు, మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంత్‌రెడ్డి రూ.10 వేలు, మల్లేష్ యాదవ్ రూ.5 వేలు, రాహుల్‌చారి రూ.5వేలు ఆర్థిక సహయం అందజేశారు. ఈ సందర్భంగా వారు ధైర్యంగా ఉండాలని అన్నారు.

# క్రీడ

## కోల్‌కతాకు నాలుగో విజయం

ఐపిఎల్ 18లో కోల్‌కతా నైట్‌రైడర్స్ నాలుగో విజయం సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 14 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. రఘువంశీ (44) టాప్ స్కోరర్. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసింది. డుప్లెసిస్ (62; 45 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (43; 23 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), విప్రాజ్ నిగమ్ (38; 19



బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడినా ఢిల్లీకి ఓటమి తప్పలేదు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 3, వరుణ్ చక్రవర్తి 2, అనుకుల్ రాయ్, వైభవ్ అరోరా, రస్సెల్ ఒక్కో వికెట్ తీశారు.

### డుప్లెసిస్, అక్షర్ పోరాడినా..

205 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. అనుకుల్ రాయ్ బౌలింగ్‌లో అభిషేక్ (4) రస్సెల్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం కరుణ్ నాయర్‌తో జట్టు కట్టిన డుప్లెసిస్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. అయితే అరోరా బౌలింగ్‌లో కరుణ్ (15) రింకు సింగ్‌కు క్యాచ్ ఇచ్చాడు. 60 పరుగుల వద్ద రాహుల్ రనౌట్ అయ్యాడు. దీంతో ఢిల్లీ తీవ్ర కష్టాల్లో పడింది. అనంతరం క్రీజులోకి వచ్చిన అక్షర్‌పటేల్‌తో కలిసి డుప్లెసిస్ చెలరేగాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని నరైన్ విడదీశాడు. 136 పరుగుల వద్ద అక్షర్ ఔటయ్యాడు. అదే ఓవర్లో స్టబ్స్ (1)ను సైతం నరైన్ బోల్తా కొట్టించాడు. 16వ ఓవర్ రెండో బంతికి డుప్లెసిస్ పెవిలియన్ చేరడంతో ఢిల్లీ ఓటమి ఖరారైంది. చివర్లో విప్రాజ్ చెలరేగినా ఫలితం లేకుండా పోయింది.

### చెలరేగిన రఘువంశీ, రింకు సింగ్..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతాకు శుభారంభం దక్కింది. తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం లభించింది. గుర్బాజ్ (26: 12 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్), నరైన్ (27: 16 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచికొట్టారు. మూడు ఓవర్లలోనే 48 పరుగులు చేశారు. అయితే మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో అభిషేక్‌కు క్యాచ్ గుర్బాజ్ ఔటయ్యాడు. అనంతరం వచ్చిన రహానె (26: 14 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్) సైతం బ్యాటు ఝుళిపించాడు. కష్టాల్లో పడ్డ కోల్‌కతాను రింకు సింగ్ (36: 25 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి రఘువంశీ (44: 32 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆదుకున్నారు.

## సౌతాఫ్రికాపై భారత్ జయభేరి

ముక్కోణపు సిరీస్‌లో భారత అమ్మాయిలు జోరు చూపిస్తున్నారు. తొలి పోరులో శ్రీలంకను చిత్తుగా ఓడించిన టీమిండియా ఈసారి దక్షిణాఫ్రికాను మట్టికరిపించింది. ప్రేమదాస స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 15 పరుగుల తేడాతో సఫారీలపై గెలుపొందింది. దాంతో, ఈ టోర్నీలో వరుసగా రెండో విజయం ఖాతాలో వేసుకుంది. భారత జట్టు నిర్దేశించిన 277 పరుగుల ఛేదనలో ఓపెనర్ తంజిమ్ బ్రిట్స్(109) సెంచరీతో చెలరేగి జట్టును గెలుపు వాకిట నిలిపింది. అయితే.. ఆల్‌రౌండర్ స్నేహ్ రానా(543) కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపుతిప్పింది. దాంతో, ప్రత్యర్థిని భారత్ 261 పరుగులకే కట్టడి చేసింది. తన అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్నందించిన రానా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైంది.



### ఉతికేసిన ప్రతీకా, జెమీమా

వరల్డ్ కప్ సన్నాహకాల్లో ఉన్న భారత మహిళల జట్టు అదరగొడుతోంది. తొలుత ఓపెనర్ ప్రతీకా రావల్(74) అర్ధ శతకంతో శుభారంభం ఇవ్వగా.. జెమీమా రోడ్రిగ్స్(41), కెప్టెన్ హర్మన్‌ప్రీత్(41)లు దంచేశారు. ఆఖర్లో రీచా ఘోష్(24) మెరుపులతో భారత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది.

భారీ ఛేదనలో సఫారీ జట్టు దీటుగా ఇన్నింగ్స్ ఆరంభించింది. ఓపెనర్లు లారా వొల్వార్డ్(43), తంజిమ్ బ్రిట్స్(109)లు భారత బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ధాటిగా ఆడారు. దాంతో, తొలి వికెట్‌కు దక్షిణాఫ్రికా 140 రన్స్ జోడించింది పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే.. లారాను ఔట్ చేసిన దీప్తి శర్మ బ్రేకిచ్చింది. ఆ తర్వాత బంతి అందుకున్న స్నేహ్ రానా(5 43) వరుసగా వికెట్లు తీసి ప్రత్యర్థిని ఒత్తిడిలో పడేసంది. దాంతో, మిడిలార్డర్ చేతులెత్తేయగా సఫారీలు 261 పరుగులకే ఆలౌటయ్యారు. భారత బౌలర్లలో శ్రీచరణి, దీప్తి శర్మ, అ రుంధతీ రెడ్డిలు తలా ఒక వికెట్ తీశారు.

### వైభవ్‌కు.. నజరానా

ఐపిఎల్ చరిత్రలో అతి పిన్న వయసులో (14 ఏళ్లు) సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచిన బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీకి అభినందనలు. తన కృషి, ప్రతిభతో భారత క్రికెట్‌కు కొత్త ఆశాకిరణంగా మారాడు. నేను



2024లో వైభవ్‌ను, అతని తండ్రిని కలిశాను. అతనికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని కోరుకున్నా. ఐపీఎల్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత ఫోన్ చేసి అభినందించాను. వైభవ్ సూర్యవంశీకి ప్రోత్సాహకంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల నగదు బహుమతి అందజేయనుంది. వైభవ్ భవిష్యత్తులో భారత జట్టు తరఫున ఆడి కొత్త రికార్డులు నెలకొల్పి దేశానికి కీర్తిని తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నా' అని నితీశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

# లీల

## ఈ బ్యూటీ.. వర్కవుట్ అయ్యేనా?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ని దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కించేందుకు సిద్ధమయ్యాడు. ఈ సినిమాను ఇటీవల అధికారికంగా అనౌన్స్ చేశారు. ఇక ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ బ్యానర్ ప్రొడ్యూస్ చేస్తుండటంతో ఈ మూవీ ఎలాంటి కథతో రాబోతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించే వారి గురించి పలు ఇంట్రెస్టింగ్ వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాలో అందాల భామ మృణాల్ ఠాకూర్ నటించబోతుందనే వార్త జోరుగా వినిపిస్తుంది. ఇక మరో హీరోయిన్‌గా దీపికా పదుకొనే పేరు కూడా వినిపించింది. కానీ, దీపికా ఈ సినిమాలో నటించడం లేదని.. ఆమె ప్లేస్‌లో 'లైగర్' బ్యూటీ అనన్య పాండే ఈ చిత్రానికి ఓకే చెప్పిందని తెలుస్తోంది. దీంతో ఇప్పుడు ఈ సినిమాలో అనన్య పాండే నటిస్తుందనే వార్త అభిమానుల్లో ఆసక్తికరంగా మారింది. లైగర్ మూవీతో డిజాస్టర్ మూటగట్టుకున్న ఈ బ్యూటీ, బాలీవుడ్‌లో సినిమాలు చేస్తున్నా, సౌత్‌లో మాత్రం అమ్మడికి సరైన చిత్రం పడలేదు. మరి అల్లు అర్జున్ అట్లీ వంటి బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌లో ఆమెను ఎలాంటి పాత్ర కోసం తీసుకుంటున్నారా అనేది ఆసక్తికరంగా మారింది.



## మహేశ్‌బాబు 'న్యూ' లుక్

సూపర్ స్టార్ మహేష్ బాబు ఇండియన్ సినిమా చరిత్రలోనే రాజమౌళి ఈ చిత్రాన్ని అత్యంత భారీ చిత్రంగా రూపొందిస్తున్నారు. ఏకంగా 1000 కోట్ల బడ్జెట్‌లో ఈ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ మూవీతని ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్ చిత్రంగా రాజమౌళి అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. అయితే రాజమౌళి సినిమాలో హీరో లుక్ గత సినిమాల కన్నా భిన్నంగా ఉంటుందనే విషయం మనకు తెలిసిందే. ఇప్పుడు మహేష్ బాబు లుక్ ఎలా ఉంటుందనే చర్చ గత కొన్ని రోజులుగా నడుస్తుంది. ఈ క్రమంలో మహేష్ బాబు లేటెస్ట్ లుక్ లీక్ అయింది. ఇందులో పొడవైన జుట్టు, గుబురు గడ్డం కనిపిస్తున్నాయి. లేటెస్ట్ లుక్ మాత్రం ఫ్యాన్స్‌కి షాకింగ్‌గా ఉంది. అసలు అక్కడ ఉన్నది మహేష్ బాబా, ఇంకెవరా అని ఒక్కసారి ఆలోచనలో పడ్డారు సూపర్ స్టార్ ఫ్యాన్స్. ఎంతో హ్యాండ్సమ్‌గా కనిపించే మహేష్ ఈ లుక్‌లో బీస్ట్ లాగా ఉన్నాడని, గుర్తు పట్టకుండా మారాడని కొందరు కామెంట్ చేస్తున్నారు. కొందరు ఫ్యాన్స్ అయితే మహేష్ లుక్ చూసి సింహాన్ని దగ్గర నుంచి చూస్తున్నట్లు ఉంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఏది ఏమైన కూడా మహేష్ లుక్ సోషల్ మీడియాలో వైల్డ్ ఫైర్ లాగా వ్యాపించింది. ఇక సినిమా విషయానికి వస్తే చిత్రాన్ని రాజమౌళి ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్నారు. ఆఫ్రికా అడవుల్లో మహేష్ తిరుగుతూ ప్రాణాంతక వ్యాధికి మెడిసిన్ తీసుకువచ్చే కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు అర్థం అవుతుంది. రామాయణంలో లక్ష్మణుడిని కాపాడేందుకు హనుమంతుడు సంజీవని పర్వతాన్ని తీసుకువస్తారు.



## కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ మెంబర్‌గా భారతీయ దర్శకురాలు!



భారతీయ చలనచిత్ర దర్శకురాలు పాయల్ కపాడియాకి అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025 జ్యూరీలో పాయల్ చోటు దక్కించుకున్నారు. గతేడాది పాయల్ దర్శకత్వంలో వచ్చిన 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్స్ అనే చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ పిక్స్ అవార్డు గెలుచుకున్న విషయం తెలిసిందే. ముంబై, కొంకణ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం మహిళా స్నేహం, ప్రేమ ఆకాంక్షల గురించి రూపొందించబడింది. ఈ సినిమా విడుదలై ప్రశంసలు అందుకోవడమే కాకుండా.. 30 సంవత్సరాల తర్వాత కేన్స్ ఫెస్టివల్‌లో నిలిచిన మొదటి భారతీయ చిత్రంగా చరిత్ర సృష్టించింది. అయితే తాజాగా పాయల్ కపాడియా జ్యూరీ మెంబర్‌గా చోటు దక్కించుకుంది. ఈ వేడుకలో ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ అధ్యక్షురాలిగా ఫ్రెంచ్ నటి జూలియెట్ బినోష్ వ్యవహరించనుండగా.. జ్యూరీలో పాయల్‌తో పాటు హాలీవుడ్ నటి హాలీ బెర్రీ, ఇటాలియన్ నటి ఆల్బా రోర్‌వాచర్, కొరియన్ దర్శకుడు హాంగ్ సాంగ్సూ, కాంగోలీస్ దర్శకుడు డైయెడో హమాడి, మెక్సికన్ దర్శకుడు కార్లోస్ రేగాడాస్, ఫ్రెంచ్‌మొరాకన్ రచయిత్రి లీలా స్లిమాని కూడా సభ్యులుగా చోటు దక్కించుకున్నారు. గతేడాది దర్శకురాలిగా ఎంట్రీ ఇచ్చిన పాయల్ ఈసారి జ్యూరీ సభ్యురాలిగా కేన్స్‌లో భారతీయ సినిమాకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ చలనచిత్రోత్సవం మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో జరగనుంది.

# కొత్త డిజిపి నియామకంపై సస్పెన్స్

### యుపిఎస్‌సి పంపే ఆ ముగ్గురి పేర్లపై ఉత్కంఠ



ప్రజాపక్షం/హైదరాబాద్: ఈ ఏడాది సెప్టెంబర్ 30న డిజిపి డాక్టర్ జితేందర్ పదవీవిరమణ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త డిజిపి నియామక ప్రక్రియను సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రారంభించింది.ఈ మేరకు అర్హులైన ఎనిమిది మంది ఐపిఎస్ అధికారుల పేర్లను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి)కు పంపింది. యుపిఎస్‌సికి పంపిన సినియారిటి ప్రకారం ఐపిఎస్ అధికారుల్లో 1990 బ్యాచ్‌కు చెందిన రవిగుప్తా, 1991 బ్యాచ్‌కు చెందిన సివి ఆనంద్, 1992 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ జితేందర్, 1994 బ్యాచ్‌కు చెందిన అప్టె వినాయక్ ప్రభాకర్, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, 1994 బ్యాచ్‌కు చెందిన బి.శివధర్‌రెడ్డి, 1994 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ సౌమ్యా మిశ్రా, శిఖాగోయల్ ఉన్నారు. నిబంధనల ప్రకారం యుపిఎస్‌సి ఈ ఎనిమిది మంది పేర్లలో ముగ్గురి పేర్లు ప్రభుత్వానికి పంపనుంది. ఇందులో కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఈ ఏడాది ఆగస్టులో, సెప్టెంబర్‌లో జితేందర్‌లు పదవీ విరమణ చేయనున్నారు. ఇక మిగిలిన ఆరుగురిలో రవి గుప్తా డిసెంబర్‌లో రిటైర్డ్ కావాల్సి ఉంది. యుపిఎస్ ప్రభుత్వానికి పంపే మూడు పేర్లపై సస్పెన్స్ కొనసాగుతుంది. ఈ మూడు పేర్లలో రవిగుప్తా, సివి ఆనంద్, శివధర్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో ఒకరిని ప్రభుత్వం డిజిపిగా నియమించాల్సి ఉంటుంది. రవిగుప్తా గతంలోనే డిజిపిగా చేసి ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. (సెప్టెంబర్ నుంచి) రవిగుప్తాకు కేవలం మూడు నెలలు మాత్రమే సర్వీస్ ఉన్నందునా తిరిగి రవిగుప్తాకు డిజిపిగా ఇచ్చే అవకాశాలు కనిపించడంలేదు. ఇక ఇంటెలిజెన్స్ శివధర్‌రెడ్డికి మాత్రం వచ్చే ఏడాది ఎప్రిల్ వరకు సర్వీస్ ఉంది. సెప్టెంబర్‌లో జితేందర్ రిటైర్డ్ అయితే శివధర్‌రెడ్డికి కేవలం ఏడు నెలలు మాత్రమే సర్వీస్ ఉన్నందునా అతన్ని డిజిపిగా నియమిస్తారా లేదా అనేది ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంది. ఐఎఎస్ అధికారి రామకృష్ణరావు పదవీ విరమణకు ఇంకా నాలుగు నెలలే సర్వీస్ ఉన్నా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. ఈ కోణంలో చూసుకుంటూ ఇంకా ఏడు నెలల సర్వీస్ ఉన్న శివధర్‌రెడ్డికి కూడా డిజిపి పోస్టు వరించే అవకాశాలు లేకపోలేదు. ఆ తరువాత సివి ఆనంద్‌కు డిజిపి పోస్టు ఇవ్వవచ్చని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తుంది. సివి ఆనంద్‌కు 2028 వరకు సర్వీస్ ఉన్నందునా డిజిపి పోస్టుకు ఆ లోపు ఇవ్వవచ్చని ప్రభుత్వం భావిస్తున్నాట్లు తెలుస్తుంది. ఈ లోపు సినియారిటి ప్రకారం చూస్తే పదవి విరమణకు దగ్గరలో ఉన్న శివధర్‌రెడ్డి పేరు డిజిపిగా వినిపిస్తుందని తెలుస్తుంది. శివధర్‌రెడ్డికి సర్వీస్ కొద్ది కాలమే ఉన్నందునా ఎక్కువ సర్వీస్ ఉన్న సివి ఆనంద్‌కు డిజిపి పోస్టు కేటాయించాలనే వాదన కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉంది. యుపిఎస్ మూడు పేర్లను పంపిన తరువాత ప్రభుత్వం డిజిపిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# 'కాళేశ్వరం'లో అవినీతి జరిగినట్లు.. ఎన్‌డిఎస్‌ఎ నివేదికలో ఎక్కడా లేదు



### జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది

### కొడంగల్–నారాయణ పేట ఎత్తిపోతలకు డిపిఆర్ ఉందా?: హరీశ్‌రావ్

ప్రజాపక్షం/–హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఎన్‌డిఎస్‌ఏ నివేదికలో ఎక్కడా లేదని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ టి.హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరంపై ఎన్‌డిఎస్‌ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెటేషన్‌పై హరీశ్ రావు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందన్నారు. కొడంగల్ నారాయణ పేట ఎత్తిపోతలకు డిపిఆర్ ఉందా? అని ప్రశ్నించారు. డిపిఆర్ లేకుండానే కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించారన్నారు. 2, 3 టిఎంసిలకు మించిన బ్యారేజీలు లేవని ఉత్తమ్ అన్నారని తెలిపారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ కొట్టుకపోతే ఎన్‌డిఎస్‌ఏ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. పోలవరానికి ఎందుకు పోలేదన్నారు. ఎందుకు నివేదిక ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎన్‌డిఎస్‌ఏ అనేది ఎన్‌డిఏ ప్రభుత్వ జేబు సంస్థగా మారిందని ఆరోపించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎన్‌డిఎస్‌ఏ నివేదికను అడ్డం పెట్టుకొని, అదే పాత చింతకాయ పచ్చడిలాగా రాజకీయం ప్రసంగాన్ని కొనసాగించారని విమర్శించారు. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేక ఎల్లెంకల పడ్డారని ఎద్దేవా చేశారు. ఎన్‌డిఎస్‌ఏ ఏర్పాటు బిల్లును కాంగ్రెస్ పక్షాన లోక్‌సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యతిరేకించారన్నారు. బిఆర్‌ఎస్ మీద విమర్శలు చేయడానికి ఇవాళ ఎన్‌టిఎస్‌ఏ నివేదిక భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లాగా కనపడుతుందన్నారు. అప్పుడు రాంగ్ అయ్యింది, ఇప్పుడు రైట్ ఎట్ల అయ్యిందని ప్రశ్నించారు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందని ఎన్‌డిఎస్‌ఏ ఎక్కడా చెప్పలేదన్నారు. అవినీతి జరిగినట్లు ఎన్‌డిఎస్‌ఏ పేర్కొనకున్నా, పేర్కొన్నట్లు చెప్పడానికి ఉత్తం కుమార్ రెడ్డి ప్రయాస, ఆపసోపాలు చూస్తే జాలి కలిగిందన్నారు. కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా బిఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైందన్నారు. బిఆర్‌ఎస్ సభ విజయవంతం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

## చారిత్రక విజయం

(మొదటి పేజీ తరువాయి)

కూడా ట్రంప్ తరహాలోనే కెనడాలో ఎన్నికల ప్రచారం చేశారు. కెనడా ఫస్ట్ అని నినాదాలు చేశారు. ట్రంప్ తరహాలోనే మితిమీరినస్థాయిలో ప్రకటనలు గుప్పించారు. చివరకు ఆయన వైఖరివల్ల యావత్ కన్జర్వేటివ్‌పార్టీ ఈ ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. తొలుత బ్యాకింగ్‌రంగంలో, ఆర్థిక వ్యవహారాల్లో నిపుణుడుగా ఉన్న కార్నీకి ఏ మాత్రం రాజకీయానుభవం లేదు. కొద్దినెలలక్రితమే ఆయన రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 28,525,638 మంది అర్హులైన ఓటర్లు కెనడాలో ఉన్నారు. 70.30 లక్షలమంది ఓటర్లు ముందుగానే అన్‌లైన్ పద్ధతిలో ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. సోమవారం కెనడా పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ప్రధానమంత్రి మార్క్ కార్నీ (60) మళ్ళీ గెలిచారు. ట్రంప్ సుంకాల బెదిరింపులతోపాటు కెనడా తమ దేశంలో 51వ రాష్ట్రంగా చేరాలంటూ జస్టిన్ ట్రూడో ప్రధానిగా ఉండగా ఎగతాళిచేసి అవమానించడంతో ఆగ్రహంతో ఊగిపోయిన కెనడా పౌరులు కార్నీపై విశ్వాసంతో లిబరల్‌పార్టీని మరోసారి గెలిపించారు. కెనడా ప్రతిపక్షాలు తమ ఓటమిని అంగీకరించాయి. ఒట్టావాలోని ఆంటోరియాలో జరిగిన విజయోత్సవ సభలో ప్రధానమంత్రి కార్నీ మాట్లాడుతూ, ట్రంప్ కెనడా దేశాన్ని ఆక్రమించాలని ప్రయత్నం చేశారనీ, మన దేశ వనరులు, మన దేశ నిధి నిక్షేపాలను, మనదేశంలో ఉన్న నీటి వనరులన్నింటినీ దోపిడీ చేయడానికి ఆయన పథకం వేశారని, తమ దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నించారనీ, అలాంటి ఆటలు సాగబోవని హెచ్చరించారు. అమెరికా ఎప్పటికీ తమ దేశాన్ని ఆక్రమించలేదని అన్నారు. ట్రంప్ స్థాయికి వెళ్ళి ఆయనతో వాదించి దేశాన్ని రక్షించగల సత్తా ఉన్న నాయకుడుగా మార్క్ కార్నీని కెనడా ప్రజలు అంచనావేస్తున్నారు. దశాబ్దకాలంపాటు జస్టిన్ ట్రూడో ప్రధానమంత్రిగా చేసిన పరిపాలనలో కెనడాలో ధరలు పెరిగిపోయి ప్రజలు నానా ఇబ్బందులూ పడుతున్న తరుణంలో దేశంలో ఆయనపై తీవ్ర వ్యతిరేకత పెల్లుబికింది. దీంతో గడచిన జనవరి ఆరో తేదీన జస్టిన్ ట్రూడో ప్రధానమంత్రి పదవికి రాజీనామ చేశారు. ఆయన స్థానంలో లిబరల్ పార్టీ నాయకుడుగా ఆర్థిక వ్యవహారాల్లో ఆరితేరిన మార్క్ కార్నీ పదవీ బాధ్యతలు చేపట్టారు. కొద్దిరోజులకే ఎన్నికల ప్రకటన చేసి ట్రంప్ సృష్టించిన భయ వాతావరణాన్ని తమ పార్టీ విజయానికి అనుకూలంగా మలచుకున్నారు.అదేవిధంగా జస్టిన్ ట్రూడో దేశంలో ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని కార్నీ విమర్శించారు. కార్బన్ ఎమిషన్స్‌పై ఆయన విధించిన వివాదాస్పద పన్నును తక్షణం కార్నీ రద్దుచేశారు.

**మోదీ సహా పలువురి అభినందన**

కెనడాఎన్నికల్లో తిరిగి విజయం సాధించిన ప్రధానమంత్రి మార్క్ కార్నీకి భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందనలు తెలియజేశారు. ఫెడరల్ ఎన్నికల్లో లిబరల్‌పార్టీ ఘన విజయం సాధించింది. కెనడాతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని భారతదేశం ఎదురుచూస్తోందని తన సందేశంలో మోదీ పేర్కొన్నారు. రెండు దేశాల ప్రజలకు ఉన్న బ్రహ్మాండమైన అవకాశాలను తెరచేందుకు తాము ఎదురు చూస్తున్నామన్నారు. భారత్–కెనడా దేశాలు రెండూ ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలకు, స్థిరమైన చట్టాలకు చిత్తశుద్ధితో కట్టుబడి ఉంటాయన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టింగ్ పెట్టారు. 2023 సెప్టెంబరునెలలో హరదీప్‌సింగ్ హత్యకేసులో భారతదేశం హస్తం ఉందని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలను మోదీ తిరస్కరించారు. ఆ తర్వాత ట్రూడో పదవి పోగొట్టుకున్నారు. ట్రూడో పదవిలో ఉన్నప్పుడు రెండు దేశాలమధ్యా ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ అభినందనలు తెలియజేశారు. లిబరల్‌పార్టీ తిరుగులేని నాయకత్వం దేశానికి అందజేస్తోందని ఆయన తన అభినందన సందేశంలో పేర్కొన్నారు. 2022లో రష్యా పూర్తిస్థాయిలో యుద్ధం ప్రారంభించినప్పటినుండీ ఉక్రేన్ దేశానికి చాలా స్థిరమైన మద్దతు కెనడా అందజేస్తోందన్నారు. కెనడాతో ఉన్న అనుబంధాన్ని ఉక్రేన్ ఎంతో విలువైనదిగా పరిగణిస్తోందని పేర్కొన్నారు. బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్మర్ కూడా కార్నీకి అభినందనలు తెలియజేశారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడుల రంగాలలో రెండు దేశాలు సన్నిహితంగా కలిసి పనిచేయాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## 'స్పైవేర్' ఉపయోగిస్తే తప్పేంటి?

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగిస్తే తప్పు ఏముందని? మంగళవారం పెగాసస్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది.దేశ భద్రత, సార్వభౌమత్వాన్ని తాకిన ఏ నివేదిక బహిర్గతపర్చబడదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. జాతీయ భద్రతా ప్రయోజనం కోసం ఒక దేశం స్పైవేర్‌ను ఉపయోగించడంలో ఎలాంటి తప్పు ఉండదని పెగాసస్‌పై దాఖలైన పలు పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. రాజకీయనాయకులు, జర్నలిస్టులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ఇజ్రాయేల్ స్పైవేర్‌ను ఉపయోగించాయన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు 2021లో దర్యాప్తునకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని పరిశీలించడానికి సాంకేతిక మరియు పర్యవేక్షక కమిటీలను అత్యున్నత న్యాయస్థానం అపాయింట్ చేసింది.సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ గోప్యత ఉల్లంఘనకు సంబంధించి వ్యక్తిగత భయాలను ఇది పరిష్కరించవచ్చని సూచించింది. కానీ సాంకేతిక కమిటీ నివేదికను వీధుల్లో చర్చించడానికి అది ఏమైనా డాక్యుమెంటా అని ప్రశ్నించింది.'దేశ భద్రత, సార్వభౌమత్వాన్ని తాకేది ఏదైతే ఉందో అలాంటి ఏ నివేదికను కూడా తాకబోమని ధర్మాసనం తెలిపింది. కానీ అవి చేర్చబడ్డాయో లేదో తెలుసుకోవాలనుకునే వ్యక్తులకు తెలియజేయవచ్చు, వ్యక్తిగత భయాన్ని తప్పకుండా పరిష్కరించాలి అనే అంటాం. కానీ దానిని వీధుల్లో చర్చకు పత్రంగా మార్చలేము' అని బెంచ్ వివరించింది. సాంకేతిక కమిటీ నివేదికను బహిరంగంగా షేర్ చేసే విషయాన్ని మాత్రం పరిశీలిస్తామని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది. పిటిషనర్లలో ఒకరి తరపున హాజరైన అడ్వకేట్ దినేష్ ద్వివేదీ తన వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం వద్ద స్పైవేర్ పరికరం ఉన్నదా అనేది ప్రశ్న కాదని వారు దానిని ఉపయోగించారా? లేదా? అన్నది మాత్రమే ప్రశ్న అన్నారు. అది వారి దగ్గర ఉంటే నిరంతరం వారు దానిని ఉపయోగించకుండా నిరోధించడానికి ఏమీ లేదని న్యాయవాది దినేష్ ద్వివేది అన్నారు.జర్నలిస్ట్ పరంజోయ్ గుహథాకుర్తా తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ అమెరికా జిల్లా కోర్టు తీర్పు సమీక్షించారు. అయితే సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా 'సంచార' విచారణకు వ్యతిరేకంగా సూచించారు. ఉగ్రవాదులపై స్పైవేర్‌ను ఉపయోగించడంలో ఎలాంటి తప్పు ఉండదని, వారికి గోప్యత హక్కు ఉండదని సొలిసిటర్ జనరల్ మెహతా స్పష్టం చేశారు. పిటిషన్‌దార్లలో ఒకరి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది శ్యామ్ దివన్ మాట్లాడుతూ సాంకేతిక కమిటీ నివేదికను ఎలాంటి సవరణ లేకుండా బహిర్గతం చేయాలన్నారు. అనంతరం పిటిషన్ విచారణను అత్యున్నత న్యాయస్థానం జులై 30కి వాయిదా వేసింది. 2022 ఆగష్టు 25న సాంకేతిక కమిటీని నియమించిన సుప్రీంకోర్టు పెగాసస్ అనధికార వాడకాన్ని పరిశోధించడానికి పరిశీలించిన 29సెల్‌ఫోన్లలో5 మాల్వేర్లనుకనుగొన్నారు. కానీ పెగాసస్ ఉపయోగించబడిందని సాంకేతిక కమిటీ నిర్ధారించలేకపోయింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌వి.రవీంద్రన్ నివేదిక అనుసరించి పెగాసస్ దర్యాప్తుకు కేంద్రం సహకరించలేదనే విషయాన్ని గమనించింది.

## విద్యుత్ ఛార్జీలు పెరగవ్

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీ సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్, టిజిఎన్‌పిడిసిఎల్)లు, సిరిసిల్లా కోఆపరేటివ్ ఎలక్ట్రికల్ సప్లై సొసైటీ (సెస్)లు 2025–26లో మొత్తం రూ.65,849.74 కోట్ల ఆదాయ అవసరాలుంటాయని ప్రతిపాదించింది. అయితే తాము శాస్త్రీయ పద్ధతిలో లెక్కంచి రూ.58,628.09 కోట్లకు తగ్గించి ఈఆర్‌సి ఆమోదించింది. ప్రస్తుత విద్యుత్ చార్జీలతో రూ.45,710.05 కోట్ల ఆదాయం మాత్రమే రానుండడంతో రూ.13,499.41 కోట్ల ఆదాయ లోటును ఎదుర్కోనున్నాయని ఈఆర్‌సి నిర్ధారించామన్నారు. ఆ మేరకు రూ.13,499.41 కోట్ల విద్యుత్ సబ్సిడీలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తెలపడంతో విద్యుత్ చార్జీలు పెంచడం లేదని కమిషన్ స్పష్టం చేసింది. ఈఆర్‌సి చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ హైదరాబాద్‌లో మంగళవారం పై వివరాలను వెల్లడించారు. గతేడాదితో పోల్చితే విద్యుత్ సబ్సిడీ రూ.1999.89 కోట్లు (17.4శాతం) పెరిగిందన్నారు. ట్రాన్స్ ఫార్మర్లకు సకాలంలో మరమ్మతులు చేయడం లేదని, విద్యుదాఘాతంతో రైతులు, యువకులు మృత్యువాతపడుతున్నారని పెద్ద మొత్తంలో ఫిర్యాదులు వచ్చాయని జస్టిస్ దేవరాజు నాగార్జున్ అన్నారు. ఈ ప్రమాదాల మృతులకు రూ.5లక్షల పరిహారం ఇస్తుండగా, పెంచాలని వచ్చిన విజ్ఞప్తులపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. త్వరలో క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలతో మాట్లాడి విద్యుత్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com